# భారత శక్తి
VOICE OF INDIAN

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి : 20 | సంచిక : 311 | బుధవారం,జూన్ 3 , 2026 | పేజీలు : 12 | వెల : 1.00


## "ధైర్యముంటే నన్ను అరెస్ట్ చేసుకోండి"..

### - ధర్నాకు అనుమతి నిరాకరణపై మమతా బెనర్జీ ఫైర్!



పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ బీజేపీ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. కోల్‌కతాలో తాను చేపట్టబోయే ధర్నాను అడ్డుకోవాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. ధైర్యముంటే నన్ను అరెస్ట్ చేసుకోండి అంటూ పోలీసులకు బహిరంగంగా సవాల్ విసిరారు. రాష్ట్రంలో ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల తదనంతర హింసకు వ్యతిరేకంగా, అలాగే తన మేనల్లుడు, టీఎంసీ నేత అభిషేక్ బెనర్జీపై జరిగిన దాడిని నిరసిస్తూ మమతా బెనర్జీ ఒక భారీ నిరసన

2లో..

## ఓట్ల గల్లంతుపై మీడియా దృష్టి పెట్టాలి

### - భట్టి విక్రమార్క

- అర్హులైన వారి ఓట్లు గల్లంతు కాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్న మల్లు భట్టి
- రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ కు ప్రత్యర్థులే లేరని వ్యాఖ్య
- బీజేపీ రైతు వ్యతిరేక పార్టీ అని విమర్శ



**హైదరాబాద్ (భారత శక్తి)** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) ప్రక్రియపై మీడియా ప్రత్యేక దృష్టి పెట్టాలని, అర్హులైన వారి ఓట్లు గల్లంతు కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ఈ 'ఎస్ఐఆర్ మ్యాపింగ్' అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలని ఆయన కోరారు. సచివాలయంలో

2లో..

# రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా పేదరికం నిర్మూలనే ప్రధాన్యం

### ▶ ప్రజలకు సేవకులుగా బాధ్యత నిర్వర్తిస్తున్నాం ▶ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి





**హైదరాబాద్(భారత శక్తి)** తెలంగాణ స్వరాష్ట్ర అస్తిత్వం కోసం దశాబ్దాల ఉద్యమంలో ఎందరో అమరులయ్యారు. మరెందరో పోరాట యోధులుగా నిలిచారు. వారి త్యాగాలకు, తెగువకు ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మంగళవారం నాడు రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో అయన మాట్లాడుతూ. కోటి రతనాల వీణ.. నా తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు. ప్రతి ఏటా త్యాగాల చరిత్రను స్మరిస్తూ, రేపటి భవిష్యత్ కు దిశానిర్దేశం చేసుకునే ఒక భావోద్వేగ సందర్భం జూన్ 2 మనం కలలు కన్న స్వరాష్ట్ర స్వప్నాన్ని నిజం చేసిన ఆనాటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్, నాటి యు.పి.ఏ ఛైర్ పర్సన్ నియాగాంధీలకు తెలంగాణ

2లో..

## తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం..

### తెలుగులో శుభాకాంక్షలు తెలిపిన పీఎం మోదీ, అమిత్ షా!

- నేడు తెలంగాణ 12వ ఆవిర్భావ దినోత్సవం
- పోరాట పటిమకు తెలంగాణ ప్రతీక అన్న మోదీ
- దేశ ప్రగతిలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తోందన్న అమిత్ షా



**న్యూఢిల్లీ(భారత శక్తి)** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాష్ట్ర ప్రజలకు తెలుగులో హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ తన 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకుంటున్న తరుణంలో నేతలిద్దరూ ట్విట్టర్ వేదికగా స్పందించారు. తెలంగాణ రాష్ట్రం సాహసం, సంకల్పం, పోరాట పటిమకు ఒక శక్తిమంతమైన ప్రతీక అని ప్రధాని మోదీ కొనియాడారు. ఇక్కడి ప్రజల సృజనాత్మకత, వ్యాపార నైపుణ్యాలు అద్భుతమైనవని, వికసిత భారత్ కలని సాకారం చేయడంలో తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ప్రధాని స్పష్టం చేస్తూ, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. అమిత్ షా సైతం తెలుగులోనే తన సందేశాన్ని పంచుకుంటూ తెలంగాణ విశిష్ట సంస్కృతిని, పారిశ్రామిక నైపుణ్యాన్ని అభినందించారు. దేశ ప్రగతిలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తోందని, రాబోయే రోజుల్లో ఈ రాష్ట్రం మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి దేశ కీర్తిని మరింత పెంచుతుందని ఆశిస్తున్నట్లు పేర్కొంటూ ఆయన తన సందేశాన్ని 'జై తెలంగాణ'తో ముగించారు.

దేశంలోని ఇద్దరు అగ్రనేతలు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నాడు ఇక్కడి ప్రజలకు గౌరవపూర్వకంగా మాతృభాషలోనే శుభాకాంక్షలు తెలపడంపై సర్వత్ర హర్షం వ్యక్తమవుతోంది.

## సీఎం గారూ మీకు చేతగాదని ఒప్పుకోండి

### - కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్



**హైదరాబాద్ (భారత శక్తి)** కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ మహారాష్ట్ర సీఎం అపాయిట్ మెంట్ మేమిప్పిస్తాంగిల్లికజ్జాలు పెట్టుకుని రాజకీయ లబ్ధి పొందాలనుకోవడం దుర్మార్గం.6 గ్యారంటీలు,వడ్ల కొనుగోలు అంశాలను పక్కదారి పట్టించేందుకు మహారాష్ట్ర సీఎంపై ఆరోపణలు,కాంగ్రెస్ పాలనను చూసి జనం అసహ్యించుకుంటున్నారురాష్ట్రంలో ట్రిపుల్ సీపాలన నడుస్తోంది కాంగ్రెస్ అంటేనే కరప్షన్, కలెక్షన్,కమీషన్,రాష్ట్రం కుక్కలు చింపిన విస్తరిలా మారిందితెలంగాణ బాగుపడాలంటే కేంద్ర నిధులు అవసరం.బీజేపీకి అధికారమిస్తే కేంద్రం నుండి నిధులు తెస్తాంఅందరికీ ఇచ్చారు అధికారం బీజేపీకి ఇవ్వండి అవకాశం.తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ హాట్ కామెంట్స్:6 గ్యారంటీలు, వడ్ల కొనుగోలు అంశంపై ప్రజలను పక్కదారి పట్టించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విబేధాలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. అందులో భాగంగానే మహారాష్ట్ర ముఖ్యమంత్రి

2లో..

## 'సబితమ్మ' సామర్థ్యం..

# మహేశ్వరం ప్రగతి ప్రస్థానం!

- నాడు పోరాటం.. నేడు పునర్నిర్మాణం: కేసీఆర్ అడుగుజాడల్లో మాజీ మంత్రి అప్రతిహత ప్రయాణం
- విద్యుత్, సాగునీరు, సంక్షేమంలో మహేశ్వరాన్ని అగ్రగామిగా నిలిపిన సబితా ఇంద్రారెడ్డి
- పార్టీ పటిష్టతే శ్వాసగా సభ్యత్వ సమరానికి శంఖారావం.. గులాబీ కోటలో సగర్వ శ్రేణులు

**మహేశ్వరం,: భారత శక్తి ప్రత్యేక ప్రతినిధి:** తెలంగాణ రాజకీయ యవనికపై ఆమె ఒక చెరగని ముద్ర. ప్రజా సమస్యల పరిష్కారంలో చిరునవ్వుతో కూడిన పట్టుదల ఆమె శైలి. ఉమ్మడి రాష్ట్రంలోనే కాకుండా, స్వరాష్ట్రంలోనూ కీలక మంత్రిత్వ శాఖలను సమర్థవంతంగా నిర్వహించిన ఘనత ఆమెది. ఆమే.. మహేశ్వరం శాసనసభ సభ్యురాలు, మాజీ మంత్రి

సబితా ఇంద్రారెడ్డి. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల వేళ.. మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలో జరిగిన బీఆర్ఎస్ విస్తృత స్థాయి ప్రతినిధుల సభ, కేవలం ఒక ఉత్సవంగా కాక, ఆమె నాయకత్వ పటిమకు, నియోజకవర్గ ప్రగతిపై ఆమెకున్న స్పష్టమైన విజన్‌కు అద్దం పట్టింది. కేసీఆర్ అడుగుజాడల్లో నడుస్తూ, మహేశ్వరం నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రపథాన నిలిపిన సబితా ఇంద్రారెడ్డి రాజకీయ, పరిపాలనా ప్రస్థానంపై 'భారత శక్తి' ప్రత్యేక పరిశోధనాత్మక కథనం.

### లీడర్ అంటే కేసీఆర్.. కేసీఆర్ నమ్మిన బంటు సబితా ఇంద్రారెడ్డి!

తెలంగాణ ఉద్యమ కాలం నుండి నేటి అభివృద్ధి సమయం వరకు విశ్లేషిస్తే.. సబితా ఇంద్రారెడ్డి పాత్ర అత్యంత క్రియాశీలకమైనదిగా కనిపిస్తుంది. రాష్ట్ర ఏర్పాటు అనంతరం కేసీఆర్ సారథ్యంలోని పదేళ్ల సువర్ణ పాలనలో ఆమె మంత్రిగా బాధ్యతలు చేపట్టి,

2లో..



## తెలంగాణ మీ అయ్య జాగీరా ?



**విజయవాడ(భారత శక్తి)** తెలంగాణ గురించి జనసేన ఎందుకు మాట్లాడుతుందని అడుగుతున్నారు. జనసేన పార్టీ పెట్టిందే హైదరాబాద్ నడిబొడ్డన.. ఇది తెలంగాణపై కొత్తగా తెచ్చుకున్న ప్రేమ కాదని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. నేను తెలంగాణ నలుమూలలా తిరిగాను. తెలంగాణ బాగుండాలని అనుకునేవాణ్ని.. ఇప్పుడు నన్ను విమర్శించేవారు ఆదిలాబాద్ లాంటి నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో తిరగలేదు. నేను

2లో..

## జూన్ 2 మరిచిపోలేని రోజు- కేటీఆర్

**హైదరాబాద్ (భారత శక్తి)** తెలంగాణ రాష్ట్ర 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. దశాబ్దాల తరబడి సాగిన వివక్ష, అవమానాలు, అణచివేతకు ముగింపు పలికిన

2లో..



## ఈసారి ఒక్కరోజులో 1 కోటి మంది పుణ్య స్నానాలు ఆచరిస్తారని అంచనా

- ట్రాఫిక్ రద్దీ నియంత్రణ, శానిటేషన్, తాగునీరు, భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి

గోదావరి పుష్కరాల పనులపై సీఎం చంద్రబాబు సమీక్ష



**అమరావతి (భారత శక్తి)** గోదావరి పుష్కరాలు 2027 నిర్వహణపై సచివాలయంలో వివిధ శాఖలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. అఖండ గోదావరి అభివృద్ధి ప్రాజెక్టుపై సమీక్షలో మంత్రుల కమిటీతో పాటు వివిధ శాఖల అధికారులతో సమగ్రంగా చర్చించారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా గోదావరి పుష్కరాలను నిర్వహించేందుకు అన్ని శాఖలూ సమన్వయంతో పనిచేయాలని సీఎం ఆదేశాలు ఇచ్చారు. 2027 గోదావరి పుష్కరాలకు ముందే పోలవరం ప్రాజెక్టును కూడా పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని సమీక్షలో వెల్లడించారు. ఇటీవల ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా క్షేత్రస్థాయిలో పర్యటించి చేసిన సూచనల్ని పరిగణనలోకి తీసుకుని పనులు చేపట్టాలని అన్నారు. పుష్కరాల నిర్వహణతో పాటు రాజమహేంద్రవరం లాంటి నగరం ఓ మెగాసిటీగా అభివృద్ధి అయ్యేలా పనులు చేపట్టాలని సూచనలు ఇచ్చారు. కేవలం పుష్కరాలకు మాత్రమే పనులు పరిమితం చేయకుండా ప్రస్తుతం కల్పిస్తోన్న మౌలిక వసతులు గోదావరి పరివాహక ప్రాంతానికి ఆస్తిగా మారాలని అన్నారు. పోలవరం, ఏలూరు, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాల్లో పుష్కరాల పనులు, రాష్ట్రంలో 212 కిలోమీటర్ల పొడవున ప్రవహిస్తోన్న గోదావరి నది. పోలవరం జిల్లా గుండాలలో మొదటి పుష్కర ఘాట్, కోనసీమ జిల్లా అంతర్వేది, బలుసుతిప్ప,

2లో..

## గవర్నర్‌కు ప్రేమతో...దివ్యాంగురాలి ప్రత్యేక కానుక

- తెలంగాణ అవతరణ వేడుకల్లో భావోద్వేగ సన్నివేశం.
- అనుకోని కానుక... గవర్నర్‌ను కదిలించిన అభిమానం
- అభినందించి, ఆశీస్సులు అందజేసిన గవర్నర్ దంపతులు

**హైదరాబాద్, జూన్ 2, భరత శక్తి:** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు లోక్ భవన్‌లోని సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో ఘనంగా జరుగుతున్న వేళ, అక్కడ చోటుచేసుకున్న ఓ హృద్యమైన ఘటన అందరి హృదయాలను తాకింది. అది ఓ దివ్యాంగురాలి అభిమానానికి, ఆత్మవిశ్వాసానికి, కళాప్రతిభకు ప్రతీకగా నిలిచిన అపురూప క్షణం. జీహెచ్ఎంసీలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వైష్ణవి చిన్ననాటి నుంచే జీవిత సవాళ్లతో పోరాడుతోంది. అయితే శారీరక వైకల్యాన్ని ఆమె ఎన్నడూ తన కలలకు అడ్డంకిగా భావించలేదు. తన కాళ్లనే చేతులుగా మార్చుకుని చిత్రకళలో అసాధారణ

2లో..



# 'సబితమ్మ' సామర్థ్యం.. మహేశ్వరం ప్రగతి ప్రస్థానం!

కీలక నిర్ణయాలతో తనదైన ముద్ర వేశారు.సమావేశంలో ఆమె ప్రసంగాన్ని నిశితంగా పరిశీలిస్తే.. కేసీఆర్ దూరదృష్టిని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆమె ఎంతటి నిబద్ధతతో ఉన్నారో స్పష్టమవుతుంది.వ్యవసాయ విప్లవం: 24 గంటల ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలను నియోజకవర్గంలోని ప్రతి రైతుకూ చేరేలా ఆమె ప్రత్యేక నిఘా పెట్టారు.మౌలిక సదుపాయాల కల్పన: మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాలను అనుసంధానిస్తూ అంతర్గత రహదారులు, తాగునీరు, సాగునీటి వసతులను రికార్డు స్థాయిలో మెరుగుపరిచారు.ఐపారిశ్రామిక హబ్‌గా మహేశ్వరం: ఐటీ, ఫార్మా, పరిశ్రమల విస్తరణలో మహేశ్వరం ప్రాంతం దేశంలోనే ప్రముఖ కేంద్రంగా మారడం వెనుక స్థానిక శాసనసభ సభ్యురాలిగా ఆమె అందించిన సహకారం, చూపిన చొరవ అసాధారణమైనవి.

### క్షేత్రస్థాయి పరిశీలన: సంక్షేమ పథకాల విజయవంతంలో సబితమ్మ మార్క్

పరిశోధనాత్మకంగా పరిశీలిస్తే, మహేశ్వరం నియోజకవర్గంలో బీఆర్ఎస్ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందని ఇల్లు లేదంటే అతిశయోక్తి కాదు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ఆసరా పింఛన్లు, దళితబంధు వంటి ప్రతిష్టాత్మక పథకాలను అర్హులకు చేర్చడంలో సబితా ఇంద్రారెడ్డి అహర్నిశలు శ్రమించారు. రాజకీయాలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులను ఎంపిక చేసి, ప్రజాప్రతినిధి అంటే కేవలం అధికారానికి పరిమితం కాదని, ప్రజల సేవకురాలని ఆమె నిరూపించారు. "కేసీఆర్ నాయకత్వంలో పదేళ్లపాటు జరిగిన అభివృద్ధి ఒక చరిత్ర. తెలంగాణను దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా నిలిపిన ఘనత ఆయనది. నాడు కేసీఆర్ చూపిన బాటలోనే నేడు మహేశ్వరం నియోజకవర్గం ప్రగతి పథంలో దూసుకుపోతోంది. ఈ అభివృద్ధిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది."

### సబితా ఇంద్రారెడ్డి, మాజీ మంత్రి డ శాసనసభ సభ్యురాలు,

గులాబీ కోటలో 'సభ్యత్వ సమరం'.. కార్యకర్తలకు దిశా నిర్దేశం కేవలం పరిపాలనకే పరిమితం కాకుండా, పార్టీ పటిష్టత విషయంలోనూ 'సబితా ఇంద్రారెడ్డి' తన చాణక్యాన్ని ప్రదర్శిస్తున్నారు. రాబోయే రోజుల్లో ప్రారంభం కానున్న బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఒక యజ్ఞంలా చేపట్టాలని ఆమె శ్రేణులకు పిలుపునిచ్చారు. మహేశ్వరం నియోజకవర్గాన్ని బీఆర్ఎస్ పార్టీకి పెట్టని కోటగా మార్చడమే లక్ష్యంగా ఆమె వ్యూహ రచన చేస్తున్నారు. ప్రతి గ్రామంలో, ప్రతి వార్డులో పార్టీ జెండాను ఎగురవేస్తూ, క్షేత్రస్థాయి కార్యకర్తను సైతం గుండెలకు హత్తుకుంటూ ఆమె సాగుతున్న తీరు మిగిలిన నియోజకవర్గాలకు ఆదర్శంగా నిలుస్తోంది.

### జన హృదయ నేతగా సబితమ్మ:

పీఎస్‌వై కన్వెన్షన్ హాల్‌లో జరిగిన ఈ భారీ కార్యకర్తల సమావేశం సబితా ఇంద్రారెడ్డి పట్ల నియోజకవర్గ ప్రజలకు, పార్టీ శ్రేణులకు ఉన్న నమ్మకాన్ని, ఆదరణను మరోసారి నిరూపించింది. సర్పంచులు, ఉపసర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల ప్రతినిధులు ఒకే తాటిపైకి వచ్చి, ఆమె నాయకత్వాన్ని బలపర్చడం గమనార్హం. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా, కేసీఆర్ ఆలోచన విధానాన్ని నరనరాన జీర్ణించుకుని సాగుతున్న సబితా ఇంద్రారెడ్డి, ప్రస్థానం మహేశ్వరం నియోజకవర్గ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినది.

# తెలంగాణ అవతరణ దినోత్సవ కానుకగా "రావయ్యా మా పెద్దసారు" పాట

**- మాజీ మంత్రి కేటిరామ రావు చేతుల మీదుగా ఆవిష్కరణ**

**- ముక్కపల్లి శ్రీనివాస్ అభినందించిన కేటిఆర్**



**సిద్దిపేట, జూన్ 2(భారత శక్తి )** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం పద్మనాభునిపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, ప్రముఖ గాయకుడు, రచయిత ముక్కపల్లి శ్రీనివాస్ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు (కేసీఆర్)పై అభిమానంతో రచించి ఆలపించిన "రావయ్యా మా పెద్దసారు" పాటను మాజీ మంత్రి కే . టి . రామ రావు చేతుల మీదుగా హైదరాబాద్‌లో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని, కేసీఆర్ నాయకత్వాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేలా ఈ పాట ఉందని ప్రశంసించారు. కళాకారులు, రచయితలు తమ సృజనాత్మకతతో తెలంగాణ చరిత్ర, సంస్కృతి, ఉద్యమ భావజాలాన్ని భావితరాలకు చేరవేయడం అభినందనీయమన్నారు. ముక్కపల్లి శ్రీనివాస్ రచించి, స్వయంగా ఆలపించిన ఈ పాట ప్రజాదరణ పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎర్రోళ్ల శ్రీనివాస్ నిర్మాత నాగరాజు జర్నలిస్టు చిన్ని కృష్ణ ఉపాధ్యాయులు బాలయ్య తో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా, పేదరికం నిర్మూలనే ప్రాధాన్యం

సమాజం తరఫున ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు.పుట్టుక నీది... చావు నీది, బతుకంతా దేశానిది" అన్న ప్రజా కవి కాళోజీ మాటలే స్ఫూర్తిగా డిసెంబర్ 7, 2023 న బాధ్యతలు స్వీకరించిన క్షణం నుండి ప్రతిక్షణం తెలంగాణ హితమే పరమార్థంగా, రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా, పేదరికం నిర్మూలనే ప్రాధాన్యంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తోంది. రాష్ట్రంలో అధికారం ఇవ్వడంతో పాటు, ఈ రెండున్నరేళ్లలో జరిగిన పలు ఉప ఎన్నికల్లో, పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో మా పట్ల మీరు చూపించిన ఆదరణ, అభిమానం మరువలేనిది. ఎవరెన్ని విమర్శలు, కుట్రలు చేసినా ప్రజలు మాకు అండగా నిలవడం ఎనలేని శక్తిని ఇచ్చింది. ప్రజల సంక్షేమం పట్ల, రాష్ట్ర అభివృద్ధి పట్ల మా బాధ్యతను మరింత పెంచిందని అన్నారు.రైతులు, యువత, ఆడబిడ్డల ఆకాంక్షలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, అగ్రవర్ణ పేద వర్గాల సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధి సాధన కోసం పలు విధాన నిర్ణయాలు తీసుకుంటూ, కార్యచరణ చేసుకుంటూ రెండున్నరేళ్లుగా నిరంతరం శ్రమిస్తున్నాం. అభివృద్ధితో పాటు సంక్షేమానికి సమపాళ్లలో ప్రాధాన్యత ఇస్తూ పాలన సాగిస్తున్నాం. ఈ రోజు నేను గర్వంగా చెప్పగలను... దేశంలో ఏ రాష్ట్రం అమలు చేయని సంక్షేమ పథకాలను తెలంగాణలో మనం అమలు చేస్తున్నాం. అభివృద్ధి, సంక్షేమం ఒక ఎత్తు. ఆత్మగౌరవం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం మరో ఎత్తు. తెలంగాణ ఆవిర్భావం ఒక ప్రత్యేక ఘట్టం. దశాబ్దాలు ఉద్యమం చేసి రాష్ట్రాన్ని సాధించుకున్నది కేవలం సంక్షేమం, అభివృద్ధి కోసం కాదు. ఆత్మగౌరవం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం కోసం ఈ గడ్డపై ప్రతి బిడ్డ పోరాటం చేశారు. పెత్తందారీ తనానికి వ్యతిరేకంగానే పోరాటాలు జరిగాయని అన్నారు.నాటి రాచరికం నుంచి నిన్నటి నియంతృత్వం వరకు తెలంగాణ తిరుగుబాటు చరిత్ర మొత్తం చెబుతున్న సత్యం ఇదే. ఆ చరిత్రకు మనం సాక్షులం. రాచరిక ఆలోచనలు, నియంతృత్వ పోకడలను ఓడించి కొత్త చరిత్రను రాసుకోవడం కోసం మీరు ప్రజా ప్రభుత్వాన్ని గెలిపించుకున్నారు. ఈ రోజు ప్రజల మనోభావాలకు మేం ప్రతినిధులం. సమాజ ఆకాంక్షలకు మేం వారధులం. అందుకే మీరిచ్చిన ఈ అవకాశాన్ని మేం అధికారం.. అని సంభోదించడం లేదు. మమ్మల్ని మేం పాలకులుగా అనుకోవడం లేదు. మీకు సేవకులుగా బాధ్యత నిర్వర్తిస్తున్నాం. ప్రభుత్వం అంటే నలుగురు చేతుల్లో పెత్తనం కాదు... నాలుగు కోట్ల ప్రజల ఉమ్మడి ప్రతినిధి.. అని మేం భావిస్తున్నాం... బాధ్యతగా పని చేస్తున్నాం. అందుకే ఇది కేవలం పరిపాలన చేసే ప్రభుత్వం కాదు... ప్రజాస్వామ్య ఆకాంక్షలను నెరవేర్చే ప్రజా ప్రభుత్వం అని గర్వంగా చెబుతున్నామన్నారు.డిసెంబర్ 7, 2023న ప్రారంభమైన మన ప్రభుత్వం ప్రజలకు స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించడానికి ప్రాధాన్యతనిస్తూ వస్తోంది. రకరకాల అడ్డంకులు అధిగమిస్తూ 30 నెలల్లోనే ప్రజల ఆశలు, ఆశయాలను నెరవేర్చడంలో విజయవంతంగా ముందుకు సాగుతున్నామని అన్నారు.

## తెలంగాణ మీ అయ్య జాగీరా ?

తెలంగాణకు వ్యతిరేకం కాదు.. విభజన జరిగిన తీరుకు వ్యతిరేకమని అన్నారు.తెలంగాణ ప్రజలకు, నాయకులకు ఏపీ ప్రజలపై విద్వేషం లేదు. హైదరాబాద్లో ఎలా అడుగుపెడతారని కొందరు అడుగుతున్నారు. మీ అయ్య జాగీరా తెలంగాణ.. మీరెవరు నన్ను బెదిరించడానికి..? బెదిరించేవారికి ఒకటే చెబుతున్నా.. నా ఇంటి అడ్రస్ చెప్పడానికే ఇక్కడ ప్రెస్మీట్ పెట్టానని అన్నారు.

## జూన్ 2 మరిచిపోలేని రోజు- కేటీఆర్

జూన్ 2వ తేదీ తెలంగాణ చరిత్రలోనే అత్యంత అద్భుతమైన రోజని ఆయన అభివర్ణించారు. అమరవీరుల త్యాగాలు, ఉమ్మడి ఆత్మగౌరవ పోరాటం వల్లే తెలంగాణ ప్రజలు విముక్తి సాధించారని కేటీఆర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు.ఉద్యమ కాలంలో వినిపించిన "తెలంగాణ వచ్చుడా... కేసీఆర్ సచ్చుడా" అనే నినాదాన్ని ప్రస్తావిస్తూ.. 60 ఏళ్ల సుదీర్ఘ కలని నిజం చేయడంలో తన తండ్రి, బీఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖర రావు పోషించిన కీలక పాత్రను కేటీఆర్ కొనియాడారు. 14 ఏళ్ల పాటు సాగిన సుదీర్ఘ స్వరాష్ట్ర ఉద్యమంలో కానీ, ఆ తర్వాత తొమ్మిదిన్నరేళ్ల పాటు అధికారంలో ఉన్నప్పుడు కానీ, కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ఎల్లప్పుడూ తెలంగాణ ప్రగతి, ప్రజల సంక్షేమమే ఏకైక లక్ష్యంగా పనిచేసిందని స్పష్టం చేశారు. నేటికీ తమ పార్టీ ప్రజల గొంతుకగా నిలుస్తూ... తెలంగాణ అస్తిత్వానికి, ప్రగతికి ఒక రక్షణ కవచంలా నిలబడిందని పేర్కొన్నారు.ప్రస్తుత కాంగ్రెస్ పాలన సాగుతున్న తరుణంలో ఆయన బీఆర్ఎస్ శ్రేణులకు ఒక ప్రత్యక్ష పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం, ప్రజల సేవ కోసం ప్రతి ఒక్క బీఆర్ఎస్ కార్యకర్త పునరంకితం కావాలని కోరారు. తెలంగాణను దెబ్బతీయాలని చూస్తున్న విద్రోహ, వ్యతిరేక శక్తుల నుండి మన రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి ఈ ఆవిర్భావ దినోత్సవం సాక్షిగా మనమంతా మళ్లీ ఒకసారి ప్రతిజ్ఞ చేద్దామని కేటీఆర్ పిలుపునిచ్చారు. స్వరాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు ఈ సందర్భంగా ఆయన ఘన నివాళులర్పించారు.

# అతివేగంగా వచ్చిన బైక్ ఢీ...నలుగురికి గాయాలు.




**భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, జూన్ 2:**ఎల్లారెడ్డిపేట మండలంలోని పదిర గ్రామ శివారులో కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో నలుగురు గాయపడ్డారు. ఎల్లారెడ్డిపేట ఎస్సై కె.రాహుల్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామానికి చెందిన ఎండీ ఇమ్రాన్ తన కుటుంబ సభ్యులతో కలిసి కారులో సిరిసిల్లలో జరిగిన ఒక ఫంక్షన్‌కు వెళ్లి తిరిగి ఇంటికి బయలుదేరారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో కారు పదిర గ్రామ శివారులోని రైస్ మిల్ వద్దకు చేరుకోగానే గంభీరావుపేటకు చెందిన అఫ్రోజ్ తన ద్విచక్ర వాహనాన్ని అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుకుంటూ వచ్చి ఎదురుగా వస్తున్న కారును బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం తీవ్రంగా దెబ్బతిన్నదని, కారులో ప్రయాణిస్తున్న నలుగురు కుటుంబ సభ్యులకు గాయాలయ్యాయని ఎస్సై తెలిపారు. ఫిర్యాది ఎండీ ఇమ్రాన్ ఇచ్చిన దరఖాస్తు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## ఓట్ల గల్లంతుపై

# మీడియా దృష్టి పెట్టాలి

జరిగిన తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకల అనంతరం ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయాలపై ఆయన కొన్ని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అసలు ప్రత్యర్థులే లేరని భట్టి విక్రమార్క ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ తీరును తప్పుబడుతూ.. "భారతీయ జనతా పార్టీ పక్కా రైతు వ్యతిరేక పార్టీ" అని ఆయన దుయ్యబట్టారు. ప్రజల కోసం నిరంతరం పనిచేసే ప్రభుత్వాలకు, పార్టీలకు ప్రత్యేకంగా ప్రచారం అవసరం లేదని.. తాము చేసిన పనులే మాట్లాడతాయని చెప్పారు. ఇప్పటికే జరిగిన అసెంబ్లీ, లోక్‌సభ, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తన సత్తా ఏంటో నిరూపించుకుందని ఆయన గుర్తుచేశారు. ఇదే క్రమంలో అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్న జిల్లా పరిషత్ ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం త్వరలోనే ఒక స్పష్టమైన నిర్ణయం తీసుకుంటుందని భట్టి విక్రమార్క వెల్లడించారు.

## గవర్నర్‌కు ప్రేమతో...దివ్యాంగురాలి ప్రత్యేక కానుక






నైపుణ్యాన్ని సాధించి, ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తోంది.రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లాపై ఉన్న అభిమానాన్ని ప్రత్యేకంగా వ్యక్తం చేయాలని వైష్ణవి నిర్ణయించుకుంది. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గవర్నర్ చిత్రపటాన్ని తన కాలి వేళ్లతో అద్భుతంగా చిత్రించింది. ఆ చిత్రాన్ని స్వయంగా గవర్నర్‌కు అందించాలన్న ఆమె కోరిక వేడుకల సందర్భంగా నెరవేరింది.గవర్నర్‌ను కలిసి తన కాలి వేళ్లతో గీసిన చిత్రాన్ని అందజేసిన వైష్ణవిని చూసి అక్కడున్న వారంతా భావోద్వేగానికి లోనయ్యారు. చిత్రాన్ని పరిశీలించిన గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా దంపతులు భావోద్వేగానికి లోనయ్యారు. ఆమె ప్రతిభను ప్రశంసిస్తూ అభినందనలు తెలిపారు. జీవితంలో ఎదురైన ప్రతికూల పరిస్థితులను అధిగమించి కళారంగంలో తనదైన ముద్ర వేస్తున్న వైష్ణవి సంకల్పాన్ని కొనియాడారు.ఈ సందర్భంగా గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా, ఆయన సతీమణి శ్రీమతి జానకి శుక్లా వైష్ణవిని ప్రత్యేకంగా సన్మానించి మెమెంటో, నగదు ప్రోత్సాహం అందజేశారు. ఆమెకు ఆశీస్సులు అందిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఆ క్షణం కేవలం ఒక సన్మానం మాత్రమే కాదు... ప్రతిభకు శారీరక పరిమితులు అడ్డుకావని, సంకల్పం ముందు అవరోధాలు తలవంచుతాయని చాటిచెప్పిన స్ఫూర్తిదాయక సందేశం.గవర్నర్‌కు ప్రేమతో వైష్ణవి అందించిన ఆ చిత్రం కేవలం ఒక చిత్రం మాత్రమే కాదు... ఒక దివ్యాంగురాలి హృదయంలోని గౌరవం, అభిమానం, కృతజ్ఞత, ఆత్మవిశ్వాసం కలిసిన అపురూప భావోద్వేగ కానుక.

# కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర స్థాయి పురస్కారం అందుకున్న నేతన్న పాము భిక్షపతిని సన్మానించిన గ్రామ సర్పంచ్ కోతి స్రవంతి ప్రవీణ్ గౌడ్.



**దేవరుప్పుల (భారత శక్తి)జూన్ 2:**కోలుకొండ గ్రామానికి చెందిన చేనేత కార్మికుడు పాము భిక్షపతి గారు చేనేత రంగంలో విశిష్ట ప్రతిభ కనబరిచి ప్రతిష్టాత్మకమైన కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర స్థాయి పురస్కారం అందుకోవడం పట్ల గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడం జరిగింది.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కోతి స్రవంతి ప్రవీణ్ గౌడ్ మాట్లాడుతూ, భిక్షపతి గారు తన అసాధారణ ప్రతిభతో రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందడం కోలుకొండ గ్రామానికే గర్వకారణమని అన్నారు. చేనేత కళను సజీవంగా ఉంచుతూ, తన నైపుణ్యంతో రాష్ట్ర స్థాయి పురస్కారం అందుకోవడం ప్రతి చేనేత కార్మికునికి ఆదర్శప్రాయమని కొనియాడారు.అనంతరం పాము భిక్షపతి గారిని శాలువాతో సత్కరించి, ఘనంగా సన్మానించారు. ఆయన మరిన్ని విజయాలు సాధించి చేనేత రంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చింత జయమ్మ, పంచాయతీ సెక్రెటరీ తిరుపతిరెడ్డి,గ్రామ వార్డు సభ్యులు, మిట్ట బిక్షపతి స్వరూప, వాసర్ల బీరప్ప, రచ్చ శ్రావణ్, మాచర్ల నర్సమ్మ, గ్రామ శాఖ అధ్యక్షులు గనుపాక ఎల్లేష్, గ్రామ పెద్దలు, పాము మోహన్, కౌడగాని ప్రభాకర్, రచ్చ రామచందర్, మామిడాల రమేష్, చింతకింది పెంటయ్య, యువజన నాయకులు చింత నరేష్, చేనేత కార్మికులు, యువకులు మరియు గ్రామస్థులు పాల్గొని భిక్షపతి గారికి శుభాకాంక్షలు తెలిపారు.

## ఈసారి ఒక్కరోజులో 1 కోటి మంది పుణ్య స్నానాలు ఆచరిస్తారని అంచనా

కాకినాడలోని గోవాలంక,పశ్చిమగోదావరిలోని నర్సాపురంలో చివరి ఘాట్ నిర్మాణ ప్రతిపాదనలను అయన సమీక్షించారు. ప్రస్తుతం ఉన్న 288 ఘాట్లతో సహా కొత్తగా 237 ఘాట్లను నిర్మించాలని అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసారు. × ఈసారి పుష్కరాల్లో పుణ్య స్నానాల కోసం 9 నుంచి 10 కోట్లమంది భక్తులు వస్తారని అంచనా. పుష్కర ఘాట్లు, రహదారులు, టెంట్లు, మరుగుదొడ్లు సహా ఇతర మౌలిక సదుపాయాల కల్పన కోసం పనులు చేపట్టేలా ప్రతిపాదనలు రూపొందించారు. రాజమహేంద్రవరం, నర్సాపురం సహా వివిధ పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ శాఖ పరిధిలో రూ.1,974 కోట్ల వ్యయంతో 1,660 పనులు, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో రూ.1,080 కోట్ల విలువైన 1140 పనులు జరుగుతున్నాయి. ఈసారి ఒక్కరోజులో 1 కోటి మంది పుణ్య స్నానాలు ఆచరిస్తారని అంచనా. × ప్రస్తుతం 4.5 కిలోమీటర్ల మేర పొడవైన పుష్కర ఘాట్లు. కొత్తగా నిర్మించే వాటితో కలిపి ఘాట్ల పొడవు 9.9 కిలోమీటర్ల మేర నిర్మించనున్నారు. అత్యధికంగా తూర్పుగోదావరి , కోనసీమ జిల్లాల్లో 150కి పైగా పుష్కర ఘాట్ ల నిర్మాణం జరగనున్నది. ఇప్పటికే రూ.211.97 కోట్లకు సంబంధించి 132 పనులకు అనుమతులు మంజూరు చేసారు. ట్రాఫిక్ రద్దీ నియంత్రణ, శానిటేషన్, తాగునీరు, భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎం చంద్రబాబు సూచింఆరు.ఈ సమీక్షకు మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, పయ్యావుల కేశవ్, బీసీ జనార్ధన్ రెడ్డి, సత్యకుమార్ యాదవ్, పి.నారాయణ, అనిత, నిమ్మల రామానాయుడు, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, వాసంశెట్టి సుభాష్, సీఎస్ జి.సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, దేవాదాయ, వైద్యారోగ్యం, రవాణా, పర్యాటక, పురపాలక, పంచాయితీరాజ్, ఆర్థిక, జలవనరులు, పోలీసు శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## సీఎం గారూ మీకు చేతగాదని ఒప్పుకోండి

అపాయిట్ మెంట్ ఇవ్వడం లేదని, ఉప్పెన సృష్టిస్తామని చెబుతున్నారని అన్నారు. కాళేశ్వరం విషయంలో మహారాష్ట్ర ప్రభుత్వం తెలంగాణకు సహకరించిందనే విషయాన్ని మర్చిపోయారా, అని ప్రశ్నించారు.సీఎం గారు మీకు అపాయిట్ మెంట్ తీసుకోవడం చేతగాకపోతే, ఆ విషయాన్ని ఒప్పుకోండి. అప్పుడు నేను, కిషన్ రెడ్డి ముందుకొస్తాం.అపాయిట్ మెంట్ ఇప్పించేందుకు ప్రయత్నిస్తాం అని చెప్పారు. పక్క రాష్ట్రాలతో మంచి సంబంధాలు పెట్టుకుంటూ ముందుకు పోవాలే తప్ప గిల్లికజ్జాలు పెట్టుకుంటూ రాజకీయ లబ్ది పొందాలనుకోవడం సరికాదని హితవు పలికారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణ కుక్కలు చింపిన విస్తరిలా మారిందన్నారు. తెలంగాణ బాగుపడాలంటే కేంద్ర నిధులు అవసరమన్నారు. రాష్ట్రంలో ఈసారి బీజేపీకి అధికారమిస్తే..పెద్ద ఎత్తున నిధులు తీసుకొచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. రాష్ట్రంలో ట్రిపుల్ సీ సినిమా కన్పిస్తోందని,కాంగ్రెస్ అంటేనే కరప్షన్, కలెక్షన్, కమిషన్ అని ఎద్దేవా చేశారు.బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో కేంద్ర మంత్రి బండి సంజయ్ తోపాటు మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్ రెడ్డి,ఎమ్మెల్సీలు మల్క కొమరయ్య, అంజిరెడ్డి,బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూర నర్సయ్యగౌడ్, సీనియర్ నేతలు పొంగులేటి సుధాకర్ రెడ్డి,గౌతంరావు, అశోక్, ల్ మాజీ మంత్రులు పెద్దిరెడ్డి, రాములు తదితరులు హాజరయ్యారు.

## "ధైర్యముంటే నన్ను అరెస్ట్ చేసుకోండి"..

ప్రదర్శనకు పిలుపునిచ్చారు. అయితే ఈ ధర్నాకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో దీదీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "పోలీసులు అనుమతి ఇవ్వకపోయినా మేము కచ్చితంగా ధర్నా నిర్వహించి తీరుతాం. మీ చేతనైతే నన్ను అరెస్ట్ చేసుకోండి" అని సోషల్ మీడియా వేదికగా విడుదల చేసిన ఒక వీడియో సందేశంలో మమతా బెనర్జీ స్పష్టం చేశారు. బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పశ్చిమ బెంగాల్‌లో పరిస్థితులు మరింత దిగజారాయని, ప్రజలు తీవ్ర భయాందోళనల మధ్య బతుకుతున్నారని ఆమె ఆరోపించారు. పోలీసులు కావాలనే తమ టీఎంసీ పార్టీని బలహీనపరిచేందుకు, దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఇటీవలి ఎన్నికల తర్వాత తమ పార్టీకి చెందిన దాదాపు 12 మంది కార్యకర్తలు ప్రాణాలు కోల్పోయారని, వేలాది మందిని అక్రమంగా అరెస్ట్ చేశారని ఆమె ఈ సందర్భంగా వెల్లడించారు. కొంతమంది నాయకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీని వీడినా.. అది టీఎంసీని మరింత బలంగా పునర్నిర్మించడానికే ఉపయోగపడుతుందని వ్యాఖ్యానించారు. కోల్‌కతాలో శాంతియుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును కాలరాస్తే.. ఈ పోరాటాన్ని దేశ రాజధాని ఢిల్లీకి సైతం తీసుకెళ్లడానికి తాను సిద్ధంగా ఉన్నానని మమతా బెనర్జీ హెచ్చరించారు.

# సంపాదకీయం

భారత శక్తి
VOICE OF INDIAN


## భారీగా తగ్గిన బంగారం కొనుగోళ్లు...

ప్రధాని నరేంద్ర మోదీ కొద్ది రోజుల కిందట విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేసేందుకు కీలక సూచనలు చేసిన సంగతి తెలిసిందే. ఇందులోనే బంగారం కొనుగోళ్లకు సంబంధించింది ఒకటి ఉంది. భారతీయులు బంగారం కొనుగోళ్లను ఏడాది పాటు నిలిపివేయాలని..పెళ్లిళ్లు, శుభకార్యాలు ఉన్నా కొనబోమని ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. అయితే ఈ క్రమంలోనే పసిడి కొనుగోలుదారులు ట్రెండ్ మార్చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఒక్క నిర్ణయం దేశంలో పసిడి అమ్మకాలను భారీగా తగ్గించేసింది. దిగుమతి సుంకాన్ని భారీగా పెంచడంతో విక్రయాలు పడిపోయాయి. ఇరాన్ ఉద్రిక్తతలతో పెరిగిన ఇంధన, ఆహార ధరలు తోడవడంతో జనం అసలు షాపుల వైపు వెళ్లడమే మానేశారు. కేవలం రెండు వారాల వ్యవధిలోనే దేశవ్యాప్తంగా పసిడి డిమాండ్ ఊహించని విధంగా 70 శాతం మేర పడిపోయింది.బంగారం దిగుమతులపై కస్టమ్స్ డ్యూటీని కేంద్ర ప్రభుత్వం 6 శాతం నుంచి ఏకంగా 15 శాతానికి పెంచింది. దీనికి జీఎస్టీ కూడా చేరడంతో పసిడిపై పడే మొత్తం పన్ను భారం 9.18 శాతం నుంచి 18.45 శాతానికి చేరింది. రూపాయి విలువ పతనం కావడం, క్రూడాయిల్ ధరలు పెరగడంతో విదేశీ మారక నిల్వలను కాపాడుకోవడానికి ప్రభుత్వం ఈ కఠిన నిర్ణయం తీసుకుంది.పన్నుల పెంపు దెబ్బకు దేశవ్యాప్తంగా పసిడి కొనుగోళ్లు భారీగా పడిపోయాయని 'ఇండియా బులియన్ అండ్ జ్యువెలర్స్ అసోసియేషన్' వెల్లడించింది. గతేడాది మే నెల చివరి రెండు వారాల్లో 25 టన్నులుగా ఉన్న బంగారం డిమాండ్ ఈసారి కేవలం 7.5 టన్నులకే పరిమితమైంది. దేశీయ బంగారం వ్యాపారంలో 65 శాతం వాటా ఉన్న అసంఘటిత రంగం ఈ నిర్ణయంతో తీవ్రంగా ప్రభావితమైంది.ఈ ఏడాది బంగారానికి దూరంగా ఉండాలంటూ ప్రధానమంత్రి మోదీ దేశ ప్రజలకు చేసిన విజ్ఞప్తి కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దీనితో పాటు పెట్రోల్, డీజిల్, నిత్యావసరాల ధరలు పెరగడంతో మధ్యతరగతి కుటుంబాలు పసిడి కొనుగోళ్లను వాయిదా వేసుకుంటున్నాయి. ప్రస్తుతం ముంబై స్పాట్ మార్కెట్‌లో 10 గ్రాముల స్వచ్ఛమైన బంగారం ధర ఏకంగా రూ.1.57 లక్షలు పలుకుతుండటం గమనార్హం.బంగారం ధరలు ఆకాశాన్ని తాకడంతో కొనుగోలుదారులు తమ బడ్జెట్‌కు తగ్గట్టుగా తక్కువ క్యారెట్ ఉన్న లైట్‌వెయిట్ నగల వైపు మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో ఈ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. మరోవైపు మార్కెట్‌లో ధరలు ఎక్కువగా ఉండటాన్ని ఆసరాగా చేసుకొని చేతిలో డబ్బుల కోసం తమ పాత నగలను అమ్మి క్యాష్ చేసుకునేందుకు జనం జువెలరీ షాపుల వద్ద క్యూ కడుతున్నారు.భారతీయులకు బంగారం అంటే విపరీతమైన ఇష్టం ఉంటుందన్న సంగతి తెలిసిందే. ఎక్కువగా మహిళలు.. పండగలు, పెళ్లిళ్లు సహా ఇతర శుభకార్యాల వేళ బంగారు ఆభరణాల్ని ఎక్కువగా కొనుగోలు చేసి ధరించాలని చూస్తుంటారు. అయితే.. గత కొంత కాలంగా దీనికి డిమాండ్ తగ్గింది. బంగారం ధరలు ఈ కాలంలో విపరీతంగా పెరగడమే ఇందుకు కారణం. గతేడాది గోల్డ్ రేట్లు ఏకంగా 70 శాతానికిపైగా పెరిగాయి. ఇదే సమయంలో ఈ ఏడాది కూడా ఆరంభంలో పెరిగినా.. తర్వాత అమెరికా- ఇరాన్ యుద్ధం నేపథ్యంలో స్వల్పంగా తగ్గాయి. అయినప్పటికీ మరీ ఎక్కువేం తగ్గలేదు. దీంతో ఇప్పటికీ గరిష్ఠ స్థాయిల్లోనే కొనసాగుతున్నాయి.ఇక భారత ప్రధాని నరేంద్ర మోదీ కొద్ది రోజుల కిందట బంగారం కొనుగోళ్లకు సంబంధించి ఒక కీలక ప్రకటన చేశారు. విదేశీ మారక ద్రవ్యం తరిగిపోతుందని.. దీనిని ఆదా చేసేందుకు బంగారం కొనుగోళ్లను ఏడాది పాటు నిలిపివేయాలని.. పండగలు, ఇతర శుభకార్యాలు ఉన్నా కూడా పసిడి కొనుగోళ్లను వాయిదా వేయాలని సూచించారు. భారతీయులు.. బంగారానికి సంబంధించి ఎక్కువగా దిగుమతులపైనే ఆధారపడుతుంది కాబట్టి.. దిగుమతి బిల్లు పెరిగి విదేశీ మారక ద్రవ్యం తరిగిపోతుందని అన్నారు.అయితే మరి ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు తర్వాత భారతీయులు.. బంగారం కొనుగోళ్లను తగ్గించారా అంటే.. అలా జరగకున్నా ట్రెండ్ మార్చేశారని తెలుస్తోంది. పసిడి కొనుగోళ్లకు సంబంధించి.. వినియోగదారుల ధోరణిలో స్పష్టమైన మార్పు కనిపిస్తోందని తెలుస్తోంది. గతంలో కొత్త ఆభరణాల్ని కొనుగోలు చేసేందుకు పూర్తి మొత్తం డబ్బులు చెల్లించేవారు.. కానీ ఇప్పుడు మాత్రం తమ దగ్గర ఉన్నటువంటి పాత బంగారు ఆభరణాల్ని ఇచ్చి వాటి విలువకు కొంత అదనపు మొత్తం జోడించి.. కొత్త డిజైన్లు ఎంపిక చేసుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నట్లు తెలుస్తోంది.వాస్తవంగా చెప్పాలంటే.. పాత బంగారం ఇచ్చి కొత్త బంగారం తీసుకోవడం అనేది కొత్త విషయం ఏమీ కాకపోయినా.. గతంలో దీనిపై ఎక్కువగా ఆసక్తి చూపించేవారు కాదు. అప్పట్లో బంగారం స్వచ్ఛతను సరిగా అంచనా వేస్తారా? వేయరా? వేరే దుకాణాల్లో కొనుగోలు చేసిన ఆభరణాలకు సరైన ధర ఇస్తారా లేదా? అదనంగా ఛార్జీలు ఏమైనా విధిస్తారా.. ఇలాంటి సందేహాలతో చాలా మంది దీనికి దూరంగా ఉండేవారు. అయితే ఇప్పుడు హాల్ మార్కింగ్ వ్యవస్థ పకడ్బందీగా అమలు చేస్తుండటం, ఆధునిక టెస్టింగ్ పద్ధతులు అందుబాటులోకి రావడంతో చాలా మందిలో ఒకప్పటి భయాలు తగ్గుతున్నాయి.

నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ప్రస్తుతం బంగారం ధరలు అధిక స్థాయిల్లో ఉన్న నేపథ్యంలో పాత బంగారు ఆభరణాల్ని మార్పిడి చేసుకోవడం అనేది ఆర్థికంగా ప్రయోజనకర నిర్ణయం అని చెబుతున్నారు.ఇది వ్యక్తిగతంగా మాత్రమే కాకుండా.. దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా ఉపయోగకరంగా ఉంటుంది.భారత్ ఏటా భారీ మొత్తంలో బంగారం దిగుమతి చేసుకుంటుంది కాబట్టి.. పాత ఆభరణాల్ని రీసైక్లింగ్ చేయడం.. మార్పిడి చేసుకోవడం పెరిగితే అప్పుడు కొత్త బంగారం దిగుమతుల అవసరం కూడా కొంత మేర తగ్గుతుంది. దీంతో విదేశీ మారక నిల్వలపై ఒత్తిడి కూడా తగ్గుతుంది.

# సింహగర్జన: పవన్ కళ్యాణ్‌పై అల్లంపల్లి రామకోటి తీవ్ర ధ్వజం!

**- 'తెలంగాణ గడ్డపై రాజకీయం చేయడానికి నీకేం హక్కు ఉంది?' - అల్లంపల్లి.రామకోటి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడి సూటి ప్రశ్న**



**హైదరాబాద్ జూన్ 2 (భారత శక్తి ప్రతినిధి):** సినిమాల్లో నటన తప్ప నిజజీవితంలో ప్రజాసేవ అంటే ఏంటో తెలియని పవన్ కళ్యాణ్‌కు తెలంగాణ నేలపై అడుగుపెట్టే హక్కు లేదని తెలంగాణ వెనుకబడిన తరగతుల (బీసీ) సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, టిఆర్ఎస్ పార్టీ నాయకులు అల్లంపల్లి రామకోటి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన ఒక సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పవన్ కళ్యాణ్ వైఖరిని, ఆయన రాజకీయ విధానాలను తీవ్రంగా తప్పుపట్టారు.

### భోగాల జీవితం నీది.. ప్రజాక్షేత్రంలో నీ త్యాగాలేంటి?

"పవన్ కళ్యాణ్.. నీకు ఆంధ్రప్రదేశ్‌లోనే ప్రజలు ఓట్లు వేయడం వృథా. ఎందుకంటే నీ జీవితం మొత్తం చలనచిత్రాల్లో నటనకే సరిపోయింది తప్ప, నిజజీవితంలో సమాజం కోసం నువ్వు చేసిందేమీ లేదు. ప్రజాక్షేత్రంలో నీవు చేసిన త్యాగాలేంటో చెప్పాలి. నీ జీవితమంతా భోగ భాగ్యాలతోనే గడిచింది. అటువంటి విలాసవంతమైన జీవితాన్ని అనుభవించిన నువ్వు.. ఈరోజు తెలంగాణకు వచ్చి రాజకీయ జెండాలు పాతతామంటే ఇక్కడి సమాజం చూస్తూ ఊరుకోదు" అని రామకోటి హెచ్చరించారు.

### విద్యార్థులు, బహుజనుల కోసం ఏం చేశావు?

సమాజంలోని వివిధ వర్గాల పట్ల పవన్ కళ్యాణ్‌కు ఉన్న చిత్తశుద్ధిని ప్రశ్నిస్తూ అల్లంపల్లి రామకోటి పలు ప్రశ్నలను సంధించారు: విద్యార్థుల సమస్యలపై మౌనం ఎందుకు?: పేద విద్యార్థుల కోసం ఎప్పుడైనా విద్యావేతనాలు (స్కాలర్‌షిప్‌లు) ఇప్పించావా? ప్రభుత్వ రుసుముల రీఇంబర్స్‌మెంట్ కోసం ఎప్పుడైనా రోడ్డు ఎక్కి పోరాటం చేశావా? వసతి గృహాల (హాస్టల్) సౌకర్యాలు కల్పించాలని కనీసం ఒక్క రోజైనా ధర్నా చేశావా?

### బహుజనులకు, మహిళలకు చేసిన మేలేంటి?:

ఈ నేలపై ఉన్న షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీ), వెనుకబడిన తరగతులు (బీసీ), మైనారిటీ వర్గాల సంక్షేమం కోసం నీవు చేసిన ఒక్క మంచి పనిని చూపించగలవా? మహిళల సాధికారత కోసం నీవు చేసిన త్యాగం ఏంటో స్పష్టం చేయాలి.
మా దృష్టిలో నువ్వు కేవలం 'ఆంధ్ర పవన్ కళ్యాణ్'వి మాత్రమే: నువ్వు చలనచిత్ర కథానాయకుడివి కావు.. పొరుగు రాష్ట్ర ఉపముఖ్యమంత్రివి అంతకన్నా కావు. మా దృష్టిలో నువ్వు కేవలం 'ఆంధ్ర పవన్ కళ్యాణ్' వి మాత్రమే అని రామకోటి స్పష్టం చేశారు.

### ఇది అమరవీరుల త్యాగాల గడ్డ.. జాగ్రత్త!

ఒకప్పుడు ఇక్కడ రాజకీయంగా ఉగ్రూతలూపిన చంద్రబాబును, జగన్‌ను, షర్మిలను సైతం వెనక్కి పంపించిన గడ్డ తెలంగాణ అని ఆయన గుర్తుచేశారు. ఇది వేలాది మంది అమరవీరుల త్యాగాలతో సిద్ధించిన ప్రత్యేక రాష్ట్రమని, ఇక్కడికి వచ్చి ప్రాంతీయ విభేదాలు సృష్టించాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు. "ఆంధ్ర పవన్ కళ్యాణ్ తెలంగాణకు రావడానికి వీల్లేదు, ఇక్కడ జెండాలు పాతడానికి వీల్లేదు. రాసిపెట్టుకో... జాగ్రత్త పవన్ కళ్యాణ్ జాగ్రత్త!" అంటూ రామకోటి హెచ్చరించారు.

# ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు

**- సంక్షేమం అభివృద్ధి సామాజిక న్యాయం లక్ష్యంగా ప్రభుత్వ పాలన**
**- మంత్రి దామోదర రాజనర్సింహ- అమరవీరుల కుటుంబాలకు ఘన సన్మానం**
**- స్వయం సహాయక సంఘాలకు రూ.69.19 కోట్ల రుణాల పంపిణీ**

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జూన్ 2: తెలంగాణ రాష్ట్రం నేడు అన్ని రంగాల్లో దేశానికి ఆదర్శంగా నిలుస్తూ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు మంగళవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి దామోదర రాజనర్సింహ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు.
అనంతరం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, జిల్లాలో సాధించిన ప్రగతిని వివరిస్తూ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల కుటుంబాలను మంత్రి ఘనంగా సన్మానించి వారి త్యాగాలను స్మరించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అమరవీరులు చేసిన త్యాగాలు చిరస్మరణీయమని, వారి ఆశయాల సాధనే వారికి నిజమైన నివాళి అని పేర్కొన్నారు.విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ప్రదర్శనలు ఇచ్చిన విద్యార్థులకు మంత్రి ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాళ్లను సందర్శించి, ఆయా శాఖల కార్యక్రమాలు, సేవలపై వివరాలు తెలుసుకున్నారు.అనంతరం నలుగురు దృష్టిలోపం కలిగిన విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేశారు. 768 స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాల కింద రూ.69.19 కోట్ల విలువైన చెక్కులను అందజేశారు. అలాగే ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు.పీఎం శ్రీ పాఠశాలల్లో నిర్వహించిన వేసవి శిబిరాలలో విశిష్ట సేవలు అందించిన ప్రధానోపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.అంతకుముందు ఐబీ వద్ద గల తెలంగాణ అమరవీరుల స్మారక స్థూపం వద్ద మంత్రి దామోదర రాజనర్సింహ, ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత సంతోష్, కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# తెలంగాణ బీజేపీలో ఏం జరుగుతోంది

**హైదరాబాద్,(భారత శక్తి)** తెలంగాణ బీజేపీలో అంతర్గత విభేదాలు మరోసారి రచ్చకెక్కాయి. రాష్ట్రంలో పార్టీకి మైలేజ్ పెరుగుతున్న తరుణంలో, కీలక నేతల మధ్య సాగుతున్న ఆధిపత్య పోరు గ్రూపు రాజకీయాలను రోడ్డుకు ఈడుస్తోంది. ఒకరిపై మరొకరు పైచేయి సాధించేందుకు కొందరు నేతలు చేస్తున్న ప్రయత్నాలు పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీస్తుండటంతో, అటు కేడర్ తీవ్ర గందరగోళానికి, ఆందోళనకు గురవుతోంది. ఈ పరిస్థితి ఇలాగే ఉంటే పార్టీ తీవ్రంగా నష్టపోతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.బీజేపీలో గత కొంతకాలంగా సాగుతున్న పాత వర్సెస్ కొత్త నేతల వివాదం ఇప్పుడు మరింత ముదిరింది. తాజాగా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను లక్ష్యంగా చేసుకుని కొందరు గుర్తుతెలియని వ్యక్తులు తీవ్ర ఆరోపణలతో కూడిన పోస్టర్లు వేయడం కలకలం రేపింది. ఈ వ్యవహారం వెనుక కేంద్రమంత్రి బండి సంజయ్ వర్గానికి చెందిన కొందరి హస్తం ఉందంటూ ఈటల అనుచరులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్, ఈటల రాజేందర్ కొంతకాలంగా సాన్నిహిత్యంగా ఉంటుండటాన్ని జీర్ణించుకోలేక, వారి మధ్య గ్యాప్ పెంచేందుకే ఈ పోస్టర్ల కుట్రకు తెరలేపారనే టాక్ వినిపిస్తోంది.అయితే, దీనికి కౌంటర్‌గా బండి సంజయ్ అనుచరులు మరో వాదనను తెరపైకి తెస్తున్నారు. గతంలో బండి సంజయ్ కొడుకు భగీరథ్‌పై పోక్సో కేసు నమోదు కావడం వెనుక, అలాగే బండి సంజయ్‌ను రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి దించేయడం వెనుక పరోక్షంగా ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్ మరికొందరు నేతల హస్తం ఉందంటూ వారు పాత విషయాలను గుర్తు చేస్తున్నారు. ఈ వివాదాల నేపథ్యంలో సోషల్ మీడియా వేదికగా ఇరు వర్గాల మధ్య పరస్పర పోస్టులు, తీవ్ర విమర్శలు వైరల్ అవుతున్నాయి."ఈటల ఏడుపే బీజేపీకి శాపం.. రాష్ట్ర అధ్యక్ష పదవి రాలేదని, సీఎం అభ్యర్థిగా ప్రకటించలేదని, కేంద్రమంత్రి పదవి రాలేదని నిరంతరం అసంతృప్తితో ఉంటున్నారు. రెండు చోట్ల ఎమ్మెల్యేగా ఓడిపోయినా మల్కాజిగిరి ఎంపీ టికెట్ ఇచ్చి గెలిపిస్తే? మోడీ ఇమేజ్‌తో కాకుండా తన సొంత ఇమేజ్‌తోనే గెలిచాననడం రాజకీయ నైతికత కాదు. ఇందూరు బిడ్డ ఎంపీ అర్వింద్‌కు వస్తున్న ఆదరణ చూసి కడుపుమంట ఎందుకు? నేనే ప్రత్యామ్నాయం అనే భ్రమ నుంచి బయటకు రావాలి." అని ఈటలపై పోస్టర్లు పెద్దఎత్తున వెలిశాయి.అయితే, ఈ ఆధిపత్య పోరు వెనుక అసలు కారణం కేంద్ర మంత్రివర్గ విస్తరణే అనే చర్చ రాజకీయ వర్గాల్లో బలంగా నడుస్తోంది. గతంలో బండి సంజయ్‌ను కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకున్న సమయంలో? తమకు కూడా అవకాశం వస్తుందని ఎంపీలు ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్, డీకే అరుణ తదితరులు ఆశించారు. కానీ బండికి మాత్రమే అవకాశం దక్కడంతో వారంతా తీవ్ర నిరాశకు గురయ్యారు. త్వరలో కేంద్ర మంత్రివర్గ విస్తరణ జరగబోతోందని, తెలంగాణ నుంచి మరొకరికి అవకాశం దక్కే ఛాన్స్ ఉందనే ప్రచారం జరుగుతోంది. దీంతో ఎవరికి వారు ఢిల్లీ స్థాయిలో ముమ్మర ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ మంత్రి పదవి రేసులో ముందంజలో ఉండాలనే తాపత్రయమే తాజా గ్రూపు రాజకీయాలకు, పరస్పర దుష్ప్రచారాలకు కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు.ఈటల రాజేందర్‌కు వ్యతిరేకంగా పోస్టర్లు వెలిసిన వ్యవహారాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు తీవ్రంగా ఖండించారు. 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న ఈటల లాంటి సీనియర్ నేతను కించపరిచేలా నీచ రాజకీయాలు చేయడం సరికాదని వారు పేర్కొన్నారు. ఇది కేవలం ఒక నాయకుడిపై జరిగిన వ్యక్తిగత దాడి మాత్రమే కాదని, తెలంగాణలో బీజేపీ పుంజుకోవడాన్ని చూసి ఓర్వలేక ప్రత్యర్థి పార్టీలు చేస్తున్న కుట్రగా వారు అభివర్ణించారు. రాష్ట్ర బీజేపీ నేతలమంతా ఐక్యంగా ఉన్నామని, ఇలాంటి కుట్రలను తిప్పికొడతామని వారు స్పష్టం చేశారు. నేతలు పైకి ఐక్యత రాగం వినిపిస్తున్నప్పటికీ, లోపల జరుగుతున్న అంతర్గత పోరును కేంద్ర అధిష్టానం ఎలా సర్దుమణిగిస్తుందో వేచి చూడాలి.

### రైతు భరోసా యాత్రలో కలవని నేతలు

తెలంగాణలో ప్రధాని నరేంద్ర మోదీ భారీ బహిరంగ సభ తర్వాత, రాష్ట్రంలో బీజేపీ చేపట్టిన 'రైతు ఘోష ? బీజేపీ భరోసా యాత్ర' అధికార పార్టీ గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. నాలుగు రోజుల పాటు సాగిన ఈ యాత్ర.. ఊహించిన దానికంటే.. దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్న అధికార పక్షాన్ని తీవ్రంగా భయపెట్టడంలో విజయవంతమైంది. ఒక ప్రతిపక్ష నేత చేసే యాత్ర ఎంతవరకు ప్రభావం చూపించిందో చెప్పడానికి ప్రభుత్వ స్పందనే కొలమానం. మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ యాత్ర సృష్టించిన ప్రభావం ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మహేశ్వర్ రెడ్డి గురి పక్కాగా తగిలిందని అర్థమవుతోంది. యాత్ర సందర్భంగా మహేశ్వర్ రెడ్డి విసిరిన సవాల్ ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. "రాష్ట్రంలో 80 శాతం ధాన్యం కొనుగోళ్లు జరిగాయని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. దమ్ముంటే ఎక్కడ జరిగాయో చూపించండి, నేను నిరూపించడానికి సిద్ధం. సీఎం రేవంత్ రెడ్డికి దమ్ముంటే ఇప్పుడే రాజీనామా చేసి మళ్లీ గెలవాలి? ఆయన గెలిస్తే నేను రాజకీయాల నుంచే శాశ్వతంగా తప్పుకుంటా!" అంటూ మహేశ్వర్ రెడ్డి విసిరిన పొలిటికల్ ఛాలెంజ్ కాంగ్రెస్ శ్రేణులను ఆత్మరక్షణలో పడేసింది.ఈ యాత్రకు బీజేపీ అగ్ర నేతల నుంచి ఆశించిన స్థాయిలో మద్దతు దక్కకపోయినప్పటికీ.., మహేశ్వర్ రెడ్డి తన వ్యక్తిగత సామర్థ్యంతో, అందరినీ కలుపుకుపోయే మనస్తత్వంతో ఈ కార్యక్రమాన్ని విజయతీరాలకు చేర్చారు.

అలాగే నిస్తేజంగా ఉన్న గ్రౌండ్ కేడర్‌ను యాక్టివ్ చేసి, రైతుల గుండెల్లోకి బీజేపీని తీసుకెళ్లడంలో మహేశ్వర్ రెడ్డి పూర్తిగా కృతకృత్యులయ్యారబెంగాల్ ఎన్నికల ఫలితాల తర్వాత బీజేపీ జాతీయ నాయకత్వం తన తదుపరి పూర్తి ఫోకస్‌ను తెలంగాణపైనే పెట్టబోతోందనే అంశంపై చర్చ జరుగుతోంది. ఈ క్రమంలోనే ఈ కీలకమైన కార్యక్రమ బాధ్యతను హైకమాండ్ మహేశ్వర్ రెడ్డికి అప్పగించడం వెనుక అధిష్టానం ఏదైనా పెద్ద వ్యూహాన్నే అమలు చేసిందా? అనే టాక్ వినిపిస్తోంది. ఈ యాత్రను ఒక 'టెస్టింగ్ గ్రౌండ్' లాగా భావించిన అధిష్టానం? రాష్ట్రంలో పార్టీని పరుగులు పెట్టించడానికి మహేశ్వర్ రెడ్డే సరైన వ్యక్తి అని భావించి ఈ బాధ్యతలు అప్పగించిందా? అధిష్టానం నమ్మకాన్ని వమ్ము చేయకుండా.. క్షేత్రస్థాయిలో ఉన్న లీడర్లందరినీ సమన్వయం చేసుకుంటూ ఆయన ఈ యాత్రను ఘన విజయం వైపు నడిపించారని పార్టీ భావిస్తోందా? దీనిపై రాబోయే రోజుల్లో ఎలాంటి పరిణామాలు ఉండబోతున్నాయి? అంటూ రాజకీయ వర్గాల్లో చర్చించుకుంటున్నారు. ఈ యాత్ర విజయం బీజేపీ క్యాడర్‌లో మరింత ఉత్సాహాన్ని పెంచుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# ప్రజా ఆకాంక్షల దిశగా తెలంగాణ ప్రస్థానం: మల్‌రెడ్డి రాంరెడ్డి

**- దిల్‌సుఖ్‌నగర్‌లో ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు: జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన రహదారుల అభివృద్ధి సంస్థ అధినేత**





**భారత శక్తి, జూన్ 2, ఎల్.బి.నగర్:** తెలంగాణ ప్రజల దశాబ్దాల కల సాకారమై, స్వరాష్ట్రంలో ఆత్మగౌరవంతో బతుకుతున్నామనే భావన ప్రతి ఒక్కరిలో నిండాలని తెలంగాణ రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ (రహదారుల అభివృద్ధి సంస్థ) అధినేత మల్‌రెడ్డి రాంరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని దిల్‌సుఖ్‌నగర్‌లోని రాజీవ్ గాంధీ కూడలి వద్ద నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

### సోనియా గాంధీ చారిత్రాత్మక నిర్ణయం

ఈ సందర్భంగా మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల సుదీర్ఘ ఆకాంక్షను గుర్తించి, రాజకీయ లాభనష్టాలను బేరీజు వేసుకోకుండా ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీ (భారత జాతీయ కాంగ్రెస్) అధినేత్రి సోనియా గాంధీదేనని స్పష్టం చేశారు. ఆమె తీసుకున్న ఆ చారిత్రాత్మక నిర్ణయం వల్లే నేడు తెలంగాణ సమాజం స్వరాష్ట్రంలో స్వేచ్ఛావాయువులు పీలుస్తోందని అన్నారు."తెలంగాణ సాధన కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివి. వారి ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రస్తుత ప్రభుత్వం కట్టుబడి ఉంది." అని రాంరెడ్డి పునరుద్ఘాటించారు.

### ప్రజా పాలనలో సమగ్ర అభివృద్ధి

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో సాగుతున్న ఇందిరమ్మ రాజ్యంలో ప్రజా సంక్షేమం, పారదర్శక పాలన, సమగ్ర అభివృద్ధే ప్రధాన లక్ష్యాలని మల్‌రెడ్డి రాంరెడ్డి వివరించారు. విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి కల్పనతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, తెలంగాణను దేశంలోనే ఒక ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కృషి జరుగుతోందని తెలిపారు. యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు, మహిళా సాధికారత, రైతు సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగుతోందని ఆయన వివరించారు.

### వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు

ఈ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు కృష్ణ ప్రసాద్, గడ్డిఅన్నారం పురపాలక సంఘ మాజీ పక్ష నేత బద్దుల వెంకటేష్ యాదవ్, గడ్డిఅన్నారం విభాగం అధ్యక్షుడు బద్దుల వేణుగోపాల్ యాదవ్, సత్యనారాయణ, గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ (సంత సమితి) సంయుక్త దర్శకుడు పన్యాల జైపాల్ రెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు శశికళ పాల్గొన్నారు.
వీరితో పాటు శశిధర్ రెడ్డి, చందర్ యాదవ్, బాబు గౌడ్, సునీల్ బాబు, రవీందర్ రెడ్డి, విజయ్, వంశీ శ్రీనివాస్, మూర్తి, వేణు, నవీన్ గౌడ్, కుమార్, శ్రీనివాస్ యాదవ్, కృష్ణ రెడ్డి, సన్నాయి శీనన్న, శరత్ శ్రీనివాస్, సురేష్, చారి, మల్లికార్జున్, భాస్కర్ తదితరులు పాల్గొని అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు.

# ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**- వేడుకల్లో పాల్గొన్న రెవెన్యూ అధికారులు**







**ఎల్బీనగర్, జూన్ 02 (భారత శక్తి):** సరూర్నగర్ ఇండోర్ స్టేడియంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు కందుకూర్ డివిజన్ ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై అమరవీరుల స్థూపానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాల్, ఉప తహసీల్దార్ భానుప్రసాద్, జిల్లా స్పోర్ట్ ఆథారిటీ అధికారిణి స్వర్ణలత, అధికారులు, క్రీడా కోచ్ లు, సిబ్బంది పాల్గొన్నారు. అదే విధంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం సరూర్నగర్ మండల్ తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వేణుగోపాల్, ఉప తహసీల్దార్ భానుప్రసాద్ జాతీయ జెండాను ఆవిష్కరించి ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

# నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ ఆకాంక్షలు సాకారమైన రోజు

**- పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**
**- పటాన్‌చెరులో ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు..**
**- అమరవీరులకు ఘన నివాళి..**



**పటాన్‌చెరు జూన్ 2 భారత శక్తి** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం పురస్కరించుకుని... పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జాతీయ రహదారి సమీపంలో గల తెలంగాణ అమరవీరుల స్థూపానికి పటాన్‌చెరు శాసనసభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి ఘన నివాళులు అర్పించారు.



అనంతరం పోలీస్ స్టేషన్ సమీపంలో బిఆర్ఎస్ పార్టీ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ తొలి ముఖ్యమంత్రివర్యులు శ్రీ కెసిఆర్ నాయకత్వంలో 14 సంవత్సరాలు మలిదశ ప్రత్యేక తెలంగాణఉద్యమం చేపట్టి నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ ఆకాంక్షలు సాకారం చేశారని అన్నారు. తెలంగాణ ఏర్పడిన నాటి నుండి నేటి వరకు పటాన్‌చెరు నియోజకవర్గాన్ని అభివృద్ధి సంక్షేమ రంగాలలో నెంబర్ వన్ గా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు, బిఆర్ఎస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

# తెలంగాణ అమరవీరుల త్యాగాలు మరువలేనివి : బీజేపీ నాయకులు



**ఎల్బీనగర్, జూన్ 02 (భారత శక్తి):** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగాబీజేపీ నాయకుడు అంకంగారి నవకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో హుడా కాంప్లెక్స్ లో తెలంగాణ అమరవీరుడు సిరిపురం యాదయ్య విగ్రహాన్ని పూల మాలలు వేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న బీజేపీ రాష్ట్ర నాయకులు ఆరుట్ల సురేష్ కుమార్, రాష్ట్ర దళిత మోర్చా నాయకుడు బాణాల ప్రవీణ్ కుమార్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, "నేడు మనం చూస్తున్న తెలంగాణ రాష్ట్రం ఎందరో అమరవీరుల త్యాగ ఫలమని, వారి బలిదానాలను మనం ఎప్పటికీ మర్చిపోవద్దని తెలిపారు. అమరుల ఆశయ సాధన కోసం మనమంతా నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు.అలాగే, నాడు పార్లమెంట్‌లో దేశం చూపు మొత్తం మన తెలంగాణ వైపు తిరిగేలా ప్రసంగించి,ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన 'తెలంగాణ చిన్నమ్మ' స్వర్గీయ శ్రీమతి సుష్మా స్వరాజ్ చారిత్రాత్మక కృషి చిరస్మరణీయమని , ఈ తెలంగాణ గడ్డ వారిని ఎన్నటికీ మరువదని తెలిపారు." ఈ కార్యక్రమంలో బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర నాయకులు బాణాల ప్రవీణ్ కుమార్ గారు, బీజేపీ రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యుడు బెంగారబోయిన సురేష్ , మాజీ డివిజన్ అధ్యక్షుడు సిద్ది ముదిరాజ్ , జంగయ్య ముదిరాజ్, సుమ, సరస్వతి,సుజాత, మూర్తి యువ మోర్చా నాయకులు పంతంగి రంజిత్ కుమార్, పొన్నం బద్రి, ఎర్రన్న, రామారావు, నాగరాజ్, మనోహర్,కొండే రాజేష్,శ్రీకాంత్, ప్రవీణ్,ఇంద్ర తేజ, సంజయ్, శైలేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక తెలంగాణ సాధనే అమరులకు నిజమైన నివాళి

**- తెలంగాణ ఉద్యమకారుల సంఘం సిద్దిపేట పిలుపు**







**సిద్దిపేట, జూన్ 2(భారత శక్తి ):** సామాజిక తెలంగాణ సాధనే అమరులకు నిజమైన నివాళి అని సిద్దిపేట తెలంగాణ ఉద్యమకారుల సంఘం సభ్యులు పిలుపునిచ్చారు .మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమకారుల సంఘం సిద్దిపేట ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రంగధాంపల్లి చౌరస్తా, రైతుబజార్ వద్ద ఉన్న తెలంగాణ అమరవీరుల స్థూపాల వద్ద అమరులకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సిద్దిపేట జిల్లా ప్రెస్‌క్లబ్‌లో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సంఘం స్టీరింగ్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన అమరులు, ఉద్యమకారులను గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీని నియమించడం అభినందనీయమని పేర్కొన్నారు. అయితే కమిటీ నియామకంలో మరింత సామాజిక సమతుల్యత పాటిస్తూ అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.అన్ని జిల్లా కేంద్రాల్లో అఖిలపక్ష సమావేశాలు నిర్వహించి, వివిధ వేదికలు, ప్రజా సంఘాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటూ నిజమైన ఉద్యమకారులను గుర్తించాలని కోరారు. అలాగే అమరుల కుటుంబాలు, ఉద్యమకారుల కుటుంబాల జీవన పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఉద్యమ కాలంలో ఉద్యోగాలు కోల్పోయిన ప్రభుత్వ, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, కళాకారులకు సముచిత న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతూ, త్వరలో జిల్లా మంత్రి మరియు గుర్తింపు కమిటీ సభ్యుడు పొన్నం ప్రభాకర్ కు వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు సత్తయ్య, డా. పాపయ్య, తిరుపతి రెడ్డి, కర్రోళ్ల రవిబాబు, ఖమ్మంపల్లి యాదగిరి, ఎ. శ్రీహరి, పోచబోయిన శ్రీహరి యాదవ్, పెద్దిరాజు, బి. చంద్రబాను, డప్పు బాబు తదితరులు, వివిధ నియోజకవర్గ, మండలాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం జరుపుకున్న చైతన్యపురి పోలీస్ అధికారులు




**ఎల్బీనగర్, జూన్ 02 (భారత శక్తి):**తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని చైతన్యపురి పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ సైదులు తెలంగాణ అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అనేక మంది యువకులు, విద్యార్థులు మరియు ఉద్యమకారులు తమ ప్రాణాలను అర్పించారని, వారి త్యాగాలు మరియు పోరాట ఫలితంగానే నేడు తెలంగాణ రాష్ట్రం ఏర్పడి అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని తెలిపారు. అమరవీరుల ఆశయాలను ప్రతి పౌరుడు గౌరవించాలని, సమాజ అభివృద్ధి మరియు శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. అమరవీరులు కలలుగన్న తెలంగాణ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, యువత విద్య, క్రమశిక్షణ మరియు సామాజిక బాధ్యతలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం మరియు సామాజిక సమానత్వం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బంది తెలంగాణ అమరవీరులకు ఘన నివాళులు అర్పించి, వారి త్యాగ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని ప్రజాసేవలో మరింత అంకితభావంతో పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

# తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకావిష్కరణ చేసిన గ్రామ సర్పంచ్ కోతి స్రవంతి ప్రవీణ్ గౌడ్.

**దేవరుప్పుల(భారత శక్తి)జూన్ 2:**గ్రామ శాఖ ఆధ్వర్యంలో గ్రామ పార్టీ అధ్యక్షులు గనుపాక ఎల్లేష్ తెలంగాణ జెండా పతాక ఆవిష్కరణ చేశారు.బస్టాండ్ చౌరస్తాలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని జిల్లా యువజన నాయకులు కోతి ప్రవీణ్ గౌడ్ జాతీయ పథకావిష్కరణ చేశారు.దేవరుప్పుల మండలం కోలుకొండ గ్రామంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా గ్రామ పంచాయతీకార్యాలయంలో గ్రామ సర్పంచ్ కోతి స్రవంతి ప్రవీణ్ గౌడ్ చేతుల మీదుగా జాతీయపతాకావిష్కరణ కార్యక్రమం జరిగింది. సర్పంచ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన అమరుల త్యాగాలను స్మరించుకుంటూ రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.అలాగే జూన్ 1 నుండి జూన్ 5 వరకు నిర్వహిస్తున్న ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమాలలో భాగంగా గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీని ప్రారంభించారు. మొక్కల పెంపకం, పరిశుభ్రత మరియు పర్యావరణ సంరక్షణ యొక్క ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. అనంతరం"స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా గ్రామ పారిశుద్ధ్య సిబ్బందికి కొబ్బరి నూనె, సబ్బులు, గ్లోవ్స్, మాస్కులు మరియు ఇతర అవసరమైన పారిశుద్ధ్య సామగ్రిని గ్రామ సర్పంచ్ కోతి స్రవంతి ప్రవీణ్ గౌడ్ పంపిణీ చేశారు."ఈ సందర్భంగా గ్రామ పాఠశాలలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం వేడుకలో పాల్గొనడం జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ,వార్డు సభ్యులు, ప్రజా ప్రతినిధులు, మండల నాయకులు, గ్రామ నాయకులు, యువజన నాయకులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, పార్టీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించిన బీఆర్ఎస్ నాయకులు

- తెలంగాణ సాధనలో బీఆర్ఎస్ పాత్ర చిరస్మరణీయం..బీఆర్ఎస్ నాయకులు





**వికారాబాద్ జూన్ 2 భారత శక్తి** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని తాండూరులోని మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నాయకులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. ముందుగా జాతీయ జెండాను ఆవిష్కరించిన నాయకులు అనంతరం పార్టీ జెండాను ఎగురవేసి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరవీరులను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఎన్నో దశాబ్దాల పాటు సాగిన ఉద్యమంలో టీఆర్ఎస్ పార్టీ కీలక పాత్ర పోషించిందన్నారు. ఉద్యమకారుల త్యాగాలు, ప్రజల ఆకాంక్షలు, ప్రొఫెసర్ జయశంకర్ వంటి మేధావుల మార్గదర్శకత్వంతో తెలంగాణ రాష్ట్రం సాకారమైందని పేర్కొన్నారు. రాష్ట్ర సాధన అనంతరం సాగునీరు, తాగునీరు, విద్యుత్, సంక్షేమ పథకాలు, రైతు సంక్షేమ కార్యక్రమాల అమలు ద్వారా తెలంగాణ దేశంలోనే అభివృద్ధి రాష్ట్రంగా నిలిచిందని తెలిపారు. అనంతరం పట్టణంలోని తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం కోసం ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు విఠల్ రెడ్డి, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజు గౌడ్, సాయిపూర్ నర్సింలు, శ్రీనివాస్ చారి, వర్కింగ్ ప్రెసిడెంట్ నరేందర్ గౌడ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ దీపా నర్సింలు, మాజీ ఫ్లోర్ లీడర్ శోభారాణి, వెంకట్ రెడ్డి, మంకల రాఘవేందర్, వరాల శ్రీనివాస్ రెడ్డి, మధు గౌడ్, చందర్ ఇర్ఫాన్, భషారత్, చెన్ బసప్ప, రవీందర్ తదితర నాయకులు పాల్గొన్నారు. అలాగే కౌన్సిలర్లు నవీన, సుప్రియ, నాగలక్ష్మి, జావేద్, యోగానంద్, ఇర్షాద్, సురేష్ నాయక్, నాయకులు సలీం, సంతోష్ గౌడ్, గుండప్ప కరుణాకర్, రుద్రు పాటిల్, భీమ్ సింగ్, అనంత రెడ్డి, చెన్నారెడ్డి, కోట్రీకే శ్రీకాంత్, అంజాద్ ఖాన్, ఫైసల్ ఖాన్, అస్ఫక్, బీఆర్ఎస్వీ నాయకులు ఇబ్రహీం, వినోద్, సోహెబ్‌తో పాటు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొని తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విజయవంతం చేశారు.

# అమరుల ఆకాంక్షల సాధనే లక్ష్యం

- ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఘనంగా తెలంగాణ అవతరణ దినోత్సవాలు

- ప్రజా పాలనలో సబ్బండ వర్గాల అభ్యున్నతి






**భారత శక్తి, జూన్ 2, ఇబ్రహీంపట్నం:** తెలంగాణ సాధన కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల స్ఫూర్తితో, ఉద్యమ ఆకాంక్షలకు అనుగుణంగానే రాష్ట్రంలో ప్రస్తుత పాలన సాగుతోందని ఇబ్రహీంపట్నం శాసనసభ్యుడు (ఎమ్మెల్యే) మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. సబ్బండ వర్గాల సమగ్ర అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రావతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ (జిల్లా ప్రజా పరిపాలన కార్యాలయం)లో నిర్వహించిన అధికారిక వేడుకల్లో జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ (జిల్లా పరిపాలకుడు) నారాయణరెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు.

### మువ్వన్నెల జెండా ఆవిష్కరణ -- లబ్ధిదారులకు ఆర్థిక సాయం

జిల్లా కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం, పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం తరఫున వివిధ పథకాల లబ్ధిదారులకు ఆర్థిక సాయానికి సంబంధించిన (చెక్కులు) అందజేశారు. అనంతరం కలెక్టరేట్ ప్రాంగణంలో వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన ప్రదర్శన శాలలను (స్టాళ్లు) మంత్రితో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు.

### క్యాంపు కార్యాలయంలో నివాళులు

కలెక్టరేట్ కార్యక్రమం ముగిసిన అనంతరం, ఇబ్రహీంపట్నంలోని ఎమ్మెల్యే క్యాంపు (నివాస/సమావేశ) కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి రాష్ట్రావతరణ వేడుకలను నిర్వహించారు. కార్యాలయ ప్రాంగణంలో మువ్వన్నెల జెండాను ఎగురవేసి, తెలంగాణ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

### పునర్నిర్మాణ పథంలో తెలంగాణ

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ... నాడు సోనియా గాంధీ దృఢ సంకల్పంతోనే తెలంగాణ రాష్ట్రం సాకారమైందని గుర్తు చేశారు. నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా, రాష్ట్ర పునర్నిర్మాణమే లక్ష్యంగా పనిచేస్తోందని వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా ప్రజాపాలనను మరింత ముందుకు తీసుకెళ్తామని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

# తెలంగాణ అస్తిత్వ నినాదం..
# ప్రగతి పథంలో హెచ్ఎండీఏ ప్రయాణం!

- హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ కార్యాలయంలో మిన్నంటిన రాష్ట్ర అవతరణ 12వ వార్షికోత్సవ సంబరాలు.. అమరవీరులకు ఘన నివాళి!



**హైదరాబాద్: జూన్ 2 (భారత శక్తి బ్యూరో):** తెలంగాణ అస్తిత్వ పోరాట విజయానికి ప్రతీకగా నిలిచే రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిగాయి. అమీర్‌పేటలోని స్వర్ణజయంతి సముదాయంలో ఉన్న ప్రధాన కార్యాలయంలో మంగళవారం (జూన్ 2, 2026) నాడు తెలంగాణ 12వ వార్షికోత్సవ సంబరాలు అంబరాన్నంటాయి. కరతాళ ధ్వనులు, దేశభక్తి గీతాల నడుమ కార్యాలయ ప్రాంగణమంతా పండగ వాతావరణాన్ని తలపించింది.

### మువ్వన్నెల జెండా ఆవిష్కరణ.. అమరులకు వందనం

మహానగర అభివృద్ధి సంస్థ కమిషనర్ ఆదేశాల మేరకు.. సంస్థ సంయుక్త కమిషనర్ (సాధారణ పరిపాలన), కార్యదర్శి (అదనపు బాధ్యతలు) శ్రీవత్స కోట జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం సమర్పించారు. అనంతరం తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో ప్రాణాలను పణంగా పెట్టిన అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ వారికి ఘనంగా నివాళులర్పించారు. మలిదశ ఉద్యమంలో సాగిన పోరాటాలను, సాధించుకున్న ప్రగతిని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.



### బంగారు తెలంగాణ సాధనే లక్ష్యం: శ్రీవత్స కోట పిలుపు

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో శ్రీవత్స కోట మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రగతి, భావితరాల సంక్షేమమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షించారు. "రాష్ట్ర లక్ష్యాలను, ప్రజల ఆకాంక్షలను సాకారం చేయడంలో మహానగర అభివృద్ధి సంస్థ పాత్ర ఎంతో కీలకమైనది. ఉద్యోగులందరూ అదే అంకితభావంతో, నిబద్ధతతో పనిచేస్తూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్లాలి." అని ఆయన పిలుపునిచ్చారు.


### వేడుకల్లో కొలువుదీరిన అధికారులు, సిబ్బంది

తెలంగాణ నిరంతర ప్రగతి పట్ల సంస్థ ఉద్యోగుల సమిష్టి నిబద్ధతను చాటిచెప్పేలా సాగిన ఈ వేడుకల్లో పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సంస్థ సంయుక్త కమిషనర్ (ఉపాంత నగర ప్రాంతం) ఉపేందర్ రెడ్డి, సంయుక్త కమిషనర్ (ప్రధాన నగర ప్రాంతం) వెంకన్న, ప్రధాన ఇంజనీర్ రవీందర్, హైదరాబాద్ వృద్ధి కారిడార్ పరిమిత సంస్థ (హెచ్‌జీసీఎల్) ప్రధాన ప్రజా నిర్వాహకులు పరమ్ జ్యోతి, ప్రణాళికా విభాగం సంచాలకులు విద్యాధర్, యశ్వంత్ రావు, వికాస్ సహా పెద్ద సంఖ్యలో అధికారులు, సిబ్బంది పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## స్వరాష్ట్ర పోరాటంలో భాగస్వామిని కావడం గర్వకారణం: కప్పాటి పాండురంగారెడ్డి

- అహింసాయుత మార్గంలోనే తెలంగాణ సిద్ధి,

- రంగారెడ్డి జిల్లాలో ఘనంగా 12వ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు,



**రంగారెడ్డి జిల్లా, జూన్ 2 (భారత శక్తి ప్రతినిధి):** దేశ చరిత్రలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా, అహింసాయుత మార్గంలో, ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం నేడు దేశంలోనే సుస్థిరమైన స్థానాన్ని సంపాదించుకుందని రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ పూర్వ అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర సమితి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా జరుపుకుంటున్న తరుణంలో, మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. స్వరాష్ట్ర సాధన కోసం పోరాడిన ఒక ఉద్యమకారుడిగా ఈ వేడుకల్లో భాగస్వామిని కావడం తనకు ఎంతో గర్వంగా ఉందంటూ ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

### ఉద్యమ ప్రస్థానంలో భాగస్వామ్యం గొప్ప అనుభూతి

2001 ఏప్రిల్ 27న ఊపిరి పోసుకున్న తెలంగాణ రాష్ట్ర సమితి ద్వారా మలిదశ ఉద్యమంలో చురుగ్గా పాల్గొనే అవకాశం తనకు దక్కిందని పాండురంగారెడ్డి గుర్తుచేసుకున్నారు. కందుకూరు మండల మొట్టమొదటి పార్టీ కన్వీనర్‌గా, మండల అధ్యక్షుడిగా, జిల్లా కార్యవర్గ సభ్యుడిగా, జిల్లా ప్రధాన కార్యదర్శిగా, మహేశ్వరం నియోజకవర్గ బాధ్యుడిగా, రాజకీయ ఐక్య కార్యాచరణ సమితి అధికార ప్రతినిధిగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఉద్యమ నాయకత్వంతో కలిసి నడిచే అరుదైన అవకాశం తనకు లభించిందని పేర్కొన్నారు.

### ప్రపంచానికే ఆదర్శం.. శాంతియుత పోరాటం.

"14 సంవత్సరాల పాటు సుదీర్ఘంగా, శాంతియుతంగా, అహింసా మార్గంలో సాగిన తెలంగాణ ఉద్యమం ప్రపంచానికే ఆదర్శంగా నిలిచింది."

**కప్పాటి పాండురంగారెడ్డి**

ఎందరో అమరవీరుల ఆత్మబలిదానాలు, ఉద్యమకారుల నిరంతర పోరాటాలు, అన్ని వర్గాల ప్రజల క్రియాశీలక భాగస్వామ్యం, రాజకీయ ఐక్య కార్యాచరణ సమితి తోడ్పాటుతో తెలంగాణ ప్రజల దశాబ్దాల కల 2014 జూన్ 2న సాకారమైందని ఆయన వివరించారు.

### ఆటుపోట్లు ఎదుర్కొని.. సేవకుడిగా నిలిచి..

ఉద్యమ కాలంలో ఎన్నో అవమానాలను, ఆటుపోట్లను, ఆర్థిక నష్టాలను, వ్యక్తిగత ఇబ్బందులను ఎదుర్కొన్నప్పటికీ... ప్రజల ఆశీర్వాదంతో ఉద్యమకారుడిగా నిలదొక్కుకోగలిగానని పాండురంగారెడ్డి స్మరించుకున్నారు. స్వరాష్ట్రం సిద్ధించిన తర్వాత తెలంగాణ ప్రభుత్వంలో రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడిగా ప్రజలకు సేవలు అందించే అవకాశం రావడం, నేడు ఈ 12వ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో సగర్వంగా పాల్గొనడం తన జీవితంలోనే అత్యంత గొప్ప అనుభూతిని ఇచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు. అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్రం మరింత ప్రగతి పథంలో ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు.

# అర్ధరాత్రి దారుణం

## ఈస్ట్ మారేడ్‌పల్లిలో యువకుడి దారుణ హత్య!

- పాత కక్షల నేపథ్యంలో కత్తితో పొడిచి చంపిన వైనం..

- 24 గంటల్లోనే నలుగురు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు



**మారేడ్పల్లి: జూన్ 2 భారత శక్తి.** మారేడ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో కలకలం రేపిన యువకుడి హత్య కేసును పోలీసులు 24 గంటల వ్యవధిలోనే ఛేదించారు. ఈస్ట్ మారేడ్‌పల్లి పరిధిలోని సంజీవయ్య నగర్‌లో జరిగిన ఈ దారుణ సంఘటనకు సంబంధించి నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.

### అసభ్య ప్రవర్తన.. నిలదీసినందుకు ఘర్షణ!

పోలీసుల కథనం ప్రకారం.. గత నెల 31వ తేదీ రాత్రి సుమారు 11:45 గంటల సమయంలో సంజీవయ్య నగర్‌కు చెందిన కౌసల్య పరశురామ్ కుమార్తె కె. దీపిక ఇంటి ముందు నడుచుకుంటూ వెళ్తుండగా, అదే ప్రాంతానికి చెందిన పంగా నిఖిల్ అనే యువకుడు ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. దీనిపై దీపిక తండ్రి పరశురామ్ నిఖిల్‌ను నిలదీయడంతో అతడు అక్కడి నుండి వెళ్ళిపోయాడు. అనంతరం పనులు ముగించుకుని ఇంటికి వచ్చిన పరశురామ్ కుమారుడు కె. శ్రవణ్ (మృతుడు) జరిగిన విషయం తెలుసుకుని, గొడవకు గల కారణాన్ని అడగడానికి బయటకు వెళ్ళాడు. ఆ సమయంలో పంగా నిఖిల్ తన స్నేహితులైన బి. నందు, సాయి, రమేష్‌లతో కలిసి శ్రవణ్‌ను అడ్డగించి రమేష్ ఇంటి ముందు గొడవకు దిగారు.

### కత్తితో విచక్షణారహితంగా దాడి.. ఆసుపత్రిలో మృతి

ఈ ఘర్షణ తీవ్రరూపం దాల్చడంతో పంగా నిఖిల్ తన ఇంట్లో నుండి కత్తి తీసుకువచ్చి శ్రవణ్‌పై విచక్షణారహితంగా దాడి చేశాడు. ఛాతీ, నడుము, తొడలు, చంక భాగాల్లో తీవ్రంగా పొడవడంతో శ్రవణ్ రక్తపు మడుగులో కుప్పకూలాడు.

### వైద్యుల ప్రకటన:

తీవ్ర రక్తస్రావమైన శ్రవణ్‌ను కుటుంబ సభ్యులు, స్థానికులు వెంటనే గాంధీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నిన్న (జూన్ 1) ఉదయం 05:19 గంటలకు శ్రవణ్ మరణించినట్లు వైద్యులు ప్రకటించారు.

### రంగంలోకి ప్రత్యేక బృందాలు.. నిందితుల అరెస్టు

మృతుడి తండ్రి పరశురామ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మారేడ్‌పల్లి పోలీసులు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మల్కాజిగిరి డీసీపీ సి.హెచ్. శ్రీధర్, అదనపు డీసీపీ కె. రామ్ కుమార్, బేగంపేట్ ఏసీపీ పి. గోపాల కృష్ణమూర్తి, గోపాలపురం డివిజన్ ఏసీపీ పి. సుబ్బయ్యల పర్యవేక్షణలో, మారేడుపల్లి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నోముల వెంకటేష్ నేతృత్వంలోని ప్రత్యేక బృందాలు నిందితుల కోసం గాలింపు చేపట్టాయి. సాంకేతిక ఆధారాలు, నిఘా కెమెరా (సీసీటీవీ) దృశ్యాలను పరిశీలించి, ఘటనా స్థలం నుండి రక్తపు మరకలున్న కత్తిని, ఇతర భౌతిక ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు. పాత కక్షల వల్లే ఈ హత్య జరిగినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది.

### అరెస్టు అయిన నిందితుల వివరాలు:

A-1) పంగా సాయి నిఖిల్ (22):నిరుద్యోగి, సంజీవయ్య నగర్.
A-2) బండి ఆనంద్ అలియాస్ నందు (19): నిత్యావసర వస్తువుల సరఫరాదారు (రైడర్), సంజీవయ్య నగర్.
*A-3) చింతకాయల సాయినాథ్ (26):లిప్రైవేట్ ఉద్యోగి, సంజీవయ్య నగర్.
A-4) రాసేపల్లి రమేష్ (20):ద్విచక్రవాహన సేవల చోదకుడు (రైడర్), సంజీవయ్య నగర్.

### యువతపై పర్యవేక్షణ అవసరం: పోలీసుల విజ్ఞప్తి

ఈ ఘోర కలికలిపై బేగంపేట్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ స్పందిస్తూ.. తల్లిదండ్రులు, కాలనీ పెద్దలు తమ పిల్లల, స్థానిక యువత ప్రవర్తనపై నిరంతరం పర్యవేక్షణ ఉంచాలని కోరారు. మాదకద్రవ్యాల వినియోగం, అసాంఘిక కార్యకలాపాలు, గొడవలు వంటివి గమనిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని, ప్రజల సహకారంతోనే నేరరహిత సమాజాన్ని స్థాపించగలమని పేర్కొన్నారు.

# పేదల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం



నిజామాబాద్, జూన్ 2(భారత శక్తి): రాష్ట్రంలో ఉన్న పేదల సొంతింటి కలను నెరవేర్చడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం అని వేల్పూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గడ్డం నర్సారెడ్డి అన్నారు. వేల్పూర్ మండలంలోని పచ్చల్ నడ్కుడలో ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నిరుపేదలు, ఆర్థికంగా వెనుకబడిన వారు పూరి గుడిసెలో ఉండొద్దనే ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవతో ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసిందని చెప్పారు. వేల్పూర్ మండలానికి మొదటి విడతగా 370 ఇండ్లు, పచ్చల్ నడ్కుడలో 42 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశామని తెలిపారు. మండల వ్యాప్తంగా మంజూరైన ఇందిరమ్మ ఇల్లు ఇప్పటికే నిర్మాణం పూర్తి చేసుకొని గృహప్రవేశాలకు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. రెండో విడతగా మండలానికి మర 400 ఇండ్లు మంజూరు అయ్యే అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నర్సయ్య, సహకార సంఘం డైరెక్టర్ నర్సారెడ్డి, జిల్లా కిసాన్ కాంగ్రెస్ ఉప అధ్యక్షులు గంగాధర్, మోహన్, నెహ్రూ, నర్సయ్య,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,ప్రజలు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## అక్రమ మైనింగ్ ను అడ్డుకున్న పోలీసులు



నిజామాబాద్, జూన్ 2(భారత శక్తి): కమ్మర్పల్లి మండలంలోని బషీరాబాద్ గ్రామ శివారులో ఉన్న కాడి చెరువు వద్ద నుంచి అక్రమంగా మొరం తవ్వకాలు జరుగుతున్నాయనే విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు మెరుపు దాడి చేశారు. ఏలాంటి అనుమతి లేకుండా అక్రమంగా మొరం తవ్వకాలను చేపట్టిన జీసీబీతో పాటు ఐదు ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై అనిల్ రెడ్డి మాట్లాడుతూ.. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అక్రమ మొరం, ఇసుక, మట్టి తవ్వకాలు మరియు రవాణాపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, ప్రభుత్వ సహజ వనరులను అక్రమంగా దోచుకునే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## తెలంగాణ స్ఫూర్తి చాటిన జర్నలిస్టులు

-వేములవాడలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు.

-టీయూడబ్ల్యూజే (హెచ్-143) ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ..

అమరవీరులకు ఘన నివాళి.



భారత శక్తి న్యూస్,రాజన్న సిరిసిల్ల జిల్లా, జూన్ 2: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే హెచ్-143) వేములవాడ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు.రాష్ట్ర ఉపాధ్యక్షులు,జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా ఆధ్వర్యంలో వేములవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొలిపాక నరసయ్య ప్రెస్ క్లబ్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కోరుట్ల బస్టాప్ నుంచి తిప్పాపూర్ మెయిన్ బస్టాండ్ మీదుగా అమరవీరుల స్తూపం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న జర్నలిస్టులు "జోహార్ తెలంగాణ అమరవీరులకు జోహార్", "జై తెలంగాణ జై జై తెలంగాణ", "జర్నలిస్టుల ఐక్యత వర్ధిల్లాలి" అంటూ నినాదాలు చేస్తూ తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని చాటిచెప్పారు అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించిన జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా, వేములవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నర్సయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తమ ప్రాణాలను అర్పించిన అమరవీరుల త్యాగాలను ఎన్నటికీ మరువలేమన్నారు. వారి పోరాట ఫలితంగానే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు..

## రాజన్న సిరిసిల్లలో ఉత్కంఠ

-వాటర్ ట్యాంక్ ఎక్కి ఆత్మహత్యాయత్నం చేసిన

యువకుడు, కాపాడిన కానిస్టేబుల్.

భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, జూన్ 2: జిల్లా కేంద్రంలో మంగళవారం చోటుచేసుకున్న ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. కొత్త బస్టాండ్ సమీపంలోని మున్సిపల్ వాటర్ ట్యాంక్ ఎక్కిన ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడటంతో అక్కడి పరిస్థితి ఉత్కంఠభరితంగా మారింది. వేములవాడ మున్సిపల్ పరిధి శాత్రాజుపల్లెకు చెందిన అశోక్ అనే యువకుడు ఈ సాహసానికి ఒడిగట్టాడు. కుటుంబ కలహాల కారణంగా మనస్థాపానికి గురైన అతను, తన భార్యకు విడాకులు ఇప్పించేలా ఒక వ్యక్తి వ్యవహరించాడని ఆరోపిస్తూ ఈ చర్యకు దిగాడు. ఇప్పటికే తాను పురుగుల మందు సేవించానని, ట్యాంక్ పై నుంచి దూకి ప్రాణాలు తీసుకుంటానని అతను కేకలు వేయడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకున్నారు. అశోక్‌ను కిందికి దింపేందుకు యత్నించగా, అతను పోలీసులతో వాగ్వాదానికి దిగాడు. ఈ తరుణంలో ఎస్బీ కానిస్టేబుల్ శ్రీనివాస్ అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించారు. ఎంతో చాకచక్యంగా వాటర్ ట్యాంక్ ఎక్కి, అశోక్‌ను గట్టిగా పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. వెంటనే మరికొందరు సిబ్బంది ట్యాంక్ పైకి చేరుకుని అతడిని సురక్షితంగా కిందికి దించారు. అనంతరం ఫైర్ ఇంజిన్ సహాయంతో హుటాహుటిన జిల్లా ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. కానిస్టేబుల్ శ్రీనివాస్ సకాలంలో స్పందించి యువకుడి ప్రాణాలను కాపాడటంతో స్థానికులు ఆయనను అభినందిస్తున్నారు.

# ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు.

-కొండాపూర్‌లో గ్రామపంచాయతీ ఆవరణలో జెండా ఆవిష్కరణ.-గ్రామపంచాయతీ సిబ్బందికి ఘన సన్మానం.

భారత శక్తి న్యూస్,రాజన్న సిరిసిల్ల జిల్లా, జూన్ 2: కోనరావుపేట మండలం కొండాపూర్ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు అత్యంత ఉత్సాహంగా, ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్ వంకాయల గౌతమి ప్రశాంత్, ఉప సర్పంచ్ రాజిరెడ్డి, వార్డు సభ్యులు పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సర్పంచ్ గౌతమి మాట్లాడుతూ, రాష్ట్రం సాధించిన ప్రగతిని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జెండా ఆవిష్కరణ అనంతరం గ్రామస్తులకు, ప్రజాప్రతినిధులకు స్వీట్లు పంపిణీ చేసి వేడుకలను జరుపుకున్నారు. గ్రామ అభివృద్ధిలో భాగస్వాములవుతున్న మల్టీపర్పస్ వర్కర్ల సేవలను గుర్తించిన సర్పంచ్ మరియు ఉపసర్పంచ్ వార్డు సభ్యులు వారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజిరెడ్డి, వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.



## తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



ఖుత్బుల్లాపూర్, భారత శక్తి ప్రతినిధి, జూన్ 2: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 132 జీడిమెట్ల డివిజన్( కుత్బుల్లాపూర్ డివిజన్ )పరిధి అయోధ్య నగర్ లో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఎంతో మంది తెలంగాణ అమరవీరుల త్యాగాలు, పోరాటాల వల్ల ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధ్యమైందని బిజెపి మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహా రెడ్డి గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు జోగిని రాజు, నటరాజ్ గౌడ్, నార్లకంటి దుర్గయ్య, నార్లకంటి ప్రతాప్, నల్లనాగుల కృష్ణ, పెద్దింటి సాయిలు, గంగాధర్, ప్రవీణ్ గౌడ్ ,సతీష్ చక్రవర్తి, నాగదీప్ గౌడ్, నవీన్ రెడ్డి, పద్మా రెడ్డి, మహేష్, పాపయ్య దొర, జాకీ, అంజయ్య వీరేశం, వనజ, భాగ్య, సోనీ, క్రాంతి, శ్రీకాంత్, శ్రవణ్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.



భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల జిల్లా,జూన్ 2: రాజన్న సిరిసిల్ల జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్లపై రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మీడియాతో మాట్లాడారు. రైతులు పండించిన ప్రతి గింజనూ మద్దతు ధరకే కొనుగోలు చేస్తామని, జిల్లాలో ఇప్పటికే 2.75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని ఆయన తెలిపారు. గత సీజన్ కంటే అధికంగా కొనుగోలు జరుగుతోందని, అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం స్వీకరిస్తోందని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద ఎటువంటి ఇబ్బందులు లేకుండా, 48 గంటల్లోపే రైతులకు చెల్లింపులు జరిగేలా యంత్రాంగం పనిచేస్తోందని వెల్లడించారు. బీజేపీ నేతలు రైతులపై కపట ప్రేమ చూపిస్తూ కల్లాల బాట పట్టడం సరికాదని, నిజంగా రైతులపై చిత్తశుద్ధి ఉంటే ఢిల్లీకి వెళ్లి కేంద్రంపై ఒత్తిడి తెచ్చి రాష్ట్ర ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేయించాలని ఆది శ్రీనివాస్ సవాల్ విసిరారు. వ్యవసాయానికి మూడు గంటల విద్యుత్ చాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారని కేటీఆర్ చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని, ఇది రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నమని కొట్టిపారేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత విద్యుత్తుకు కట్టుబడి ఉందని, వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు.

## అమరవీరుల త్యాగాల ఫలితమే.. తెలంగాణ అవతరణం

- మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్



కూకట్పల్లి, భారత శక్తి ప్రతినిధి, జూన్ 2: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం శుభసందర్భంగా ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రీ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఆశా నగర్ కాలనీ లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద మరియు ఇంద్రహిల్స్ కాలనీ వెల్ ఫెయిర్ అసోసియేషన్ కార్యాలయం వద్ద తెలంగాణ ఉద్యమకారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లతో కలిసి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ మాట్లాడుతూ అమరవీరుల త్యాగాల ఫలం, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ పోరాట ఫలితంగా తెలంగాణ రాష్ట్రం అవతరించిందని అన్నారు. తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపిస్తూ, ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తూ, అమరుల త్యాగాలను స్మరించుకుంటూ రాష్ట్రాన్ని సుసంపన్నం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో అమరులైన ఉద్యమ కారులందరికి నివాళులు అర్పించారు. ప్రజలందరికీ తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు, ఉద్యమకారులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి మంచిర్యాల జిల్లా పర్యటన పూర్తిగా విఫలం

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి



మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 2 (భారత శక్తి): ఆసిఫాబాద్ జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనంతరం తిరుగు ప్రయాణంలో మంచిర్యాల జిల్లాకు వచ్చి జిల్లాకు ఎలాంటి హామీలు ఇవ్వకుండా వెళ్లిపోవడంతో జిల్లా ప్రజలు తీవ్ర నిరాశకు గురయ్యారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి మంగళవారం రోజున బిజెపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రిక విలేకరుల సమావేశంలో అన్నారు. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జిల్లా పర్యటన వల్ల జిల్లా అభివృద్ధికి ప్రజలకు ఎలాంటి లాభం చేకూర్చారని ప్రశ్నించారు. కేవలం స్థానిక మీూూ ఇంటికి వచ్చి భోజనం చేసి వెళ్లారే తప్ప జిల్లా లోనెలకొన్న అనేక సమస్యలు జిల్లా అభివృద్ధి పై ఎలాంటి వాఖ్యలు చేయకపోవడంతో ప్రజలు తీవ్ర నిరాశకు గురయ్యారు అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారెంటీల్లో 14 హామీలు ఉంటే అందులో కేవలం రెండు హామీలు మాత్రమే నెరవేర్చి ప్రజలను ఈ కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని అన్నారు.వడ్ల కొనుగోల్లో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యి ఆ వైఫల్యాన్ని కప్పి పుచ్చుకోవడానికి కేంద్ర ప్రభుత్వం పై నెపం నెట్టి ప్రయత్నం చేస్తోందని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తెలంగాణ ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. మంచిర్యాల నియోజకవర్గానికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని కోట్ల నిధులు ఇచ్చిందో మీూూ గారు శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, పెద్దపల్లి పురుషోత్తం, ఎనగందుల కృష్ణ మూర్తి, గాజుల ముఖేష్ గౌడ్, అమిరిశెట్టి రాజ్ కుమార్, కుర్రె చక్రవర్తి, గడ్డం స్వామి రెడ్డి, బేర సత్యనారాయణ, మెట్టుపల్లి జయరామ రావు, సంజీవ్ రావు, నల్ల రవి, బింగి ప్రవీణ్, ఈర్ల సదానందం, చిరంజీవి, పొన్నవేణి సదానందం, తిప్పని భీమయ్య, రావణవేణి శ్రీనివాస్, శివ, ఆవిడపు రాజబాబు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు అండగా వాసవీ క్లబ్ సేవా కార్యక్రమాలు

-76 రోజుల పాటు సాగిన మజ్జిగ, మంచినీరు, అంబలి పంపిణీ



మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 2 (భారత శక్తి): నిరుపేదలకు అండగా నిలుస్తు సేవా కార్యక్రమాలకు కేరాఫ్ అడ్రస్ గా నిలుస్తున్న మంచిర్యాల వాసవిక్లబ్స్ ఆధ్వర్యంలో గత 76 రోజులుగా వేసవితాపం నుండి ప్రజల అవసరాలకు అనుగుణంగా చల్లని మంచినీరు, మజ్జిగతో పాటు అంబలి పంపిణీ చేపట్టారు. మంగళవారం రోజులు స్థానిక ఐబి చౌరస్తాలో వేసవి కాలం సందర్భంగా అత్యవసరంగా వివిధ పనుల కోసం రోడ్లపైకి వచ్చే ప్రజలకు, ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే వారికి ఆసరాగా నిలుస్తు ఉదయం నుండి సాయంత్రం వరకు చల్లని మంచినీరు, మజ్జిగను దాతల సహకారంతో వాసవిక్లబ్స్ ఆధ్వర్యంలో ప్రోగ్రాం ఛైర్మన్ పడకంటి శ్రీనివాస్ నేతృత్వంలో పంపిణీ చేపట్టారు.అలాగే గత పదిహేను రోజులుగా అంబలిని పంపిణీ చేశారు. ప్రతిసంవత్సరం వేసవి కాలంలో దాదాపు మూడు మాసాల పాటు ప్రజలకు అవసరమైన సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న వాసవిక్లబ్స్ ఈ సంవత్సరం కూడా వేసవి సందర్భంగా మంచిర్యాల పట్టణంలో ఏడు చోట్ల ఉచిత చల్లని మినరల్ వాటర్ సెంటర్లను ఏర్పాటు చేశారు.అలాగే ఐబి చౌరస్తాలో మంచినీటితో పాటు మజ్జిగ,అంబలితో పాటు పెరుగన్న కూడా పంపిణీ చేశారు.ప్రతి నెల అమావాస్య సందర్భంగా అన్నదానం.పౌర్ణమి రోజున సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహిస్తున్నారు.ఈ నెల అధికమాసం కావంతో గోదావరి నది తీరంలోని గౌతమేశ్వర ఆలయంలో వాసవిసక్లబ్స్ ఆధ్వర్యంలో సామూహిక షష్టిపూర్తి మహోత్సవంను కూడా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సేవా కార్యక్రమాలలో వాసవిక్లబ్ జిల్లా గవర్నర్ పుల్లూరి బాలమోహన్, క్యాబినెట్ సెక్రటరి సేవ కేశెట్టి వంశీకృష్ణ, ట్రెజరర్ కొంకుముట్టి వెంకటేశ్, పిఆర్ది వుత్తూరి రమేష్, జోన్ ఛైర్మన్ పడకంటి శ్రీనివాస్, వాసవిక్లబ్ అధ్యక్షుడు వెనిశెట్టి రాఘవేంద్ర, కార్యదర్శ గుండా మనోహర్, కోశాధికారి బండ శ్రీనివాస్, వనితాక్లబ్ కార్యదర్శి వెనిశెట్టి దివ్య, వేంపల్లి వనితాక్లబ్ అధ్యక్షురాలు పడకంటి రజిత, కార్యదర్శి కుకుడపు గాయత్రి, కోశాధికారి పుల్లూరి మాన్విక, నస్పూర్ మండల్ వాసవిక్లబ్ అధ్యక్షుడు నకిరెకొమ్ముల రాజేంద్రప్రసాద్, కార్యదర్శి తోట రాజయ్య, యూత్ క్లబ్ అధ్యక్షుడు ముక్తా విశ్వాస్, కార్యదర్శి బోనగిరి ప్రసన్న, కోశాధికారి గందెశ్రీ అనీలకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన నిర్మల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమన్ అలీ.



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, జూన్ 02(భారత శక్తి) ఆసిఫాబాద్ జిల్లాలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన "ప్రజా పాలన ప్రగతి బాట" కార్యక్రమం ఘనంగా జరిగింది. కొౌరారి గ్రామపంచాయతీ పరిధిలోని కొత్తగూడలో లక్ష ఇండ్ల సామూహిక గృహ ప్రవేశాలు, రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద 2.50 లక్షల ఇండ్ల మంజూరు, అలాగే పలు కీలక అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎనుముల రేవంత్ రెడ్డిను నిర్మల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సయ్యద్ అర్జుమాంద్ ఆలీ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సత్కరించారు. ప్రజా సంక్షేమం, గృహ నిర్మాణం, గ్రామీణాభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయని ఈ సందర్భంగా అర్జుమాంద్ ఆలీ పేర్కొన్నారు. జిల్లాలో విద్యా, సాంస్కృతిక, గ్రంథాలయ రంగాల అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి ఆయన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, వివిధ శాఖల ప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా సాగి ప్రజల నుంచి విశేష స్పందన పొందింది.

## ఘనంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు




కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జూన్ 02 : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని కామారెడ్డి జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జాతీయ జెండా, బిఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం తెలంగాణ తల్లి, జయశంకర్ సార్, కానిస్టేబుల్ కిష్టయ్య విగ్రహాలకు, తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద పూలమాలలు వేసి అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు

**-జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన ప్రభుత్వ సలహాదారులు హనుమంతరావు**

**-అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించిన ప్రభుత్వ సలహాదారులు, జిల్లా కలెక్టర్**



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జూన్ 02: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద (బీసీ సంక్షేమ శాఖ) ప్రభుత్వ సలహాదారులు హనుమంతరావు, జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అమర వీరులకు నివాళు లర్పించారు. అనంతరం ఐడీఓసీ (ఐడిఓసి)లో ఏర్పాటు చేసిన రాష్ట్ర అవతరణ దినోత్సవ ప్రధాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ సలహాదారులు పోలీసు గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తోందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరుల ఆశయాల సాధనే వారికి నిజమైన నివాళి అని పేర్కొన్నారు. జిల్లాలో వివిధ శాఖల ఆధ్వర్యంలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని వివరించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా విద్యార్థులు ప్రదర్శనలు ఇచ్చి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రభుత్వ సలహాదారులు హనుమంతరావు, జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర మెమెంటోలు అందజేసి అభినందించారు. అంతర్జాతీయ యోగా పోటీలలో ప్రతిభ కనబరిచిన యోగా విద్యార్థులకు రూ.50 వేల నగదు ప్రోత్సాహకం, జ్ఞాపికలను అందజేశారు. అలాగే రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా ఏడుగురు లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాల్స్‌ను ప్రభుత్వ సలహాదారులు, జిల్లా కలెక్టర్ సందర్శించి శాఖల పనితీరు, ప్రజలకు అందిస్తున్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, ఎన్ వి గిరి, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు,, వివిధ శాఖల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్ కలెక్టరేట్లో ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు.

**-ముఖ్య అతిథిగా హాజరై, జాతీయ జెండాను ఆవిష్కరించిన ప్రభుత్వ విప్ వేముల వీరేశం.**





నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 02(భారత శక్తి) నిర్మల్ కలెక్టరేట్లో మంగళవారం 13వ తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ప్రభుత్వ విప్ వేముల వీరేశం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. తర్వాత జాతీయ జెండాను ఎగురవేశారు. ముందుగా తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ వేడుకలలో భాగంగా, ప్రభుత్వ విప్ జిల్లా ప్రగతికి సంబంధించిన సందేశాన్ని శాఖల వారీగా చదివి వినిపించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాల ద్వారా నిర్మల్ జిల్లా అద్భుత ప్రగతి సాధిస్తుందని వివరించారు. పేదలకు ఎన్నో రకాల పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు. జిల్లా మరింత అభివృద్ధి సాధించేలా అధికారులు కృషి చేయాలని అన్నారు. మహిళా సంఘాలకు మంజూరైన 74 కోట్ల 93 లక్షల రూపాయల చెక్కును, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ కమిషన్ కు సంబంధించి 3 కోట్ల 94 లక్షల 91 వేల 512 రూపాయల చెక్కును అందించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాళ్లను పరిశీలించారు. ఈ వేడుకల్లో భాగంగా పలువురు విద్యార్థులచే ప్రదర్శించబడిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. వేడుకల అనంతరం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ రాష్ట్రావతరణ వేడుకల్లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, ఏఎస్పీలు సాయికిరణ్, ఉపేంద్ర రెడ్డి, డిఎఫ్ఓ సుశాంత్ సుఖదేవ్ బోబడే, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, డి పి ఆర్ ఓ విష్ణువర్ధన్. వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, జిల్లా ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు





కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జూన్ 02 : తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కామారెడ్డి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయం, జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) కార్యాలయంలో మంగళవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఐరేని సందీప్ ఆధ్వర్యంలో తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు నిర్వహించగా, ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన అమర వీరుల త్యాగాలను స్మరించుకున్నారు.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కాంగ్రెస్ పార్టీ, ముఖ్యంగా శ్రీమతి సోనియా గాంధీ తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయం కీలకమైందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చిన కాంగ్రెస్ పార్టీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. అదేవిధంగా కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో నిర్వహించిన అవతరణ దినోత్సవ వేడుకల్లో డీసీసీ ఉపాధ్యక్షులు పండ్ల రాజు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ సాధన కోసం వేలాది మంది ఉద్యమకారులు చేసిన త్యాగాలు, పోరాటాలను గుర్తు చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు తెలంగాణ ఉద్యమ అమరులకు ఘన నివాళులు అర్పించి, రాష్ట్ర ప్రజలకు తెలంగాణ అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించి దేశానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కారంగుల అశోక్ రెడ్డి, భూమని బాలరాజ్, పుట్నాల శ్రీనివాస్, గౌడుగుల శ్రీనివాస్, కౌన్సిలర్లు అంజాద్, ఇసాక్ షేరు, జావిద్, వాజిత్, ఆమీర్ లడ్డు, కళ్లెంసత్యం, గోనె శ్రీనివాస్, చాట్ల రాజేశ్వర్, సిరాజ్, కన్నయ్య, కాళ్ల గణేష్, ముబాషిర్, యూనిస్, అన్వర్ అహ్మద్, లక్ష్మీ రాజా గౌడ్, కిరణ్ , ప్రవీణ్ రాజ గౌడ్, ఖుర్షీద్, టింకు భరత్, సురేష్, సుఫియాన్, జ్యోతి, కార్యాలయ కార్యదర్శి లక్కపత్తిని గంగాధర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# "ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక" పర్యావరణ వారోత్సవాలు ఘనంగా నిర్వహించాలి.

**-వర్షాకాల సన్నద్ధతకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి.**

**-ఈ నెల 4, 6, 8, 10 వ తేదీల్లో గ్రామ సభలు నిర్వహించాలి.**

**-రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు.**





నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 02 (భారత శక్తి )ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పర్యావరణ వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్) రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పర్యావరణ వారోత్సవాలు, వర్షాకాలం సన్నద్ధత, గ్రామసభల నిర్వహణ, తదితర అంశాలపై హైదరాబాదు నుంచి సిఎస్ రామకృష్ణ రావు, రాష్ట్ర డిజిపి సి.వి ఆనంద్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పర్యావరణ వారోత్సవాలు విజయవంతంగా నిర్వహించాలన్నారు. అన్ని కార్యక్రమాలను ప్రణాళిక ప్రకారం చేపట్టాలన్నారు. ఈనెల 4, 6, 8, 10 వ తేదీలలో గ్రామ, వార్డు సభలను ఏర్పాటు చేసి వివిధ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈ సభలలో ముఖ్యంగా రైతులకు రానున్న వర్షాకాలం, వాతావరణ పరిస్థితులు, పంటల సాగు వంటి అనేక విషయాలను వివరించాలన్నారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. గ్రామ సభలలో మండల స్థాయి అధికారులు మొదలుకొని ప్రజా ప్రతినిధులు ప్రజలు మహిళా సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున భాగస్వామ్యం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. రానున్న వర్షాకాలం, ఆకస్మిక వరదలు, విపత్కర పరిస్థితులపై అధికారులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. పోలీసులు, అడ్మినిస్ట్రేటివ్ విభాగాలు పరస్పరం సమన్వయంతో ఉండాలని తెలిపారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి ఈ వీసీలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పర్యావరణ వారోత్సవాలను పకడ్బందీగా నిర్వహిస్తామని తెలిపారు. రాబోయే వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈనెల 4, 6, 8, 10 తేదీలలో గ్రామ వార్డు సభలు ఏర్పాటు చేసి వివిధ అంశాలపై రైతాంగానికి, ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. దీంతో పాటుగానే ఎస్ఐఆర్ ప్రక్రియపై కూడా ప్రజలకు అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. అనంతరం తహసిల్దార్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ సభలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. పెండింగ్ భూభారతి, సాదా బైనామా దరఖాస్తులను వెంటవెంటనే పరిష్కరిస్తూ ఉండాలని ఆదేశించారు. ఈ వీసీలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, ఎస్ డిసిఎల్ఎ నాయక్వాడి జల కుమారి, డిఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, డిఆర్డిఓ విజయలక్ష్మి, డిపివో శ్రీనివాస్, సిపివో గంగారెడ్డి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాలలో మైనార్టీ డిగ్రీ కళాశాల ఏర్పాటు మంత్రి అజారుద్దీన్

జగిత్యాల, జూన్ 2( భారత శక్తి ప్రతినిధి): జగిత్యాల జిల్లా కేంద్రంలో మైనార్టీ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్ ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జగిత్యాలలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌తో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు మతాల పేరుతో రాజకీయాలు చేస్తే అభివృద్ధి సాధ్యం కాదని, విద్య ద్వారానే సమాజంలో మార్పు వస్తుందని మంత్రి అన్నారు. జగిత్యాల జిల్లాలో మైనార్టీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ఈద్గా, కబరస్తాన్, ఉర్దూ పాఠశాల, విద్యార్థుల స్కాలర్‌షిప్ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. అలాగే జిల్లా కేంద్రంలో మైనార్టీ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో మైనార్టీల సంక్షేమం, సమస్యలపరిష్కారానికి మంత్రి అజారుద్దీన్ సహకారం అందించాలని కోరారు. క్రీడాకారులకు కుల, మత భేదాలు ఉండవని, ప్రజాసేవలో ఆయన మంచి గుర్తింపు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జిల్లాలో అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టులు అమలయ్యాయని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.



# జిన్నారం మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**-జాతీయ పతాకావిష్కరణ చేసిన మున్సిపల్ చైర్మన్ నకిర్తి జనార్ధన్**

**-అమరవీరులకు ఘన నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు**



జిన్నారం మున్సిపల్,జూన్ 02, (భారత శక్తి న్యూస్): సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని జిన్నారం మున్సిపల్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో మున్సిపల్ చైర్మన్ నకిర్తి జనార్ధన్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బలిదానాలతో, ప్రాణత్యాగాలు చేసిన అమరవీరులకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ నకీర్తి జనార్ధన్, వైస్ చైర్మన్ వంగేటి ప్రతాపరెడ్డి లు మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో అమరవీరుల బలిదానాల త్యాగాలు చిరస్మరణీయమని, వారి పోరాట స్ఫూర్తిని భావితరాలకు తెలియజేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సాధించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రస్తావిస్తూ, జిన్నారం మున్సిపాలిటీని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తామని తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ వంగేటి ప్రతాప్ రెడ్డి, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్, అధికారులు, ప్రజల సహకారంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని చైర్మన్ ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దేశభక్తి నినాదాలు, తెలంగాణ గీతాలతో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరేందర్ రెడ్డి, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, గ్రామ పెద్దలు, యువతీ యువకులు, పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టరేట్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్




సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జూన్ 2: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టరేట్ సముదాయంలో మంగళవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం విద్యార్థులకు నోట్‌బుక్స్, స్వీట్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర అత్యంత కీలకమైందని అన్నారు. ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన సేవలు అందించడం ప్రతి ఉద్యోగి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా అధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు, జిల్లా అధికారులు, ఆర్ డి ఓ, ఆయా శాఖల ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణ ఆవిర్భావం ప్రజల ఆకాంక్షల ఫలితం

**- మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి**



జగిత్యాల, జూన్ 2 (భారత్ శక్తి ప్రతినిధి): ధర్మపురి మున్సిపల్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం ప్రజల దీర్ఘకాల ఆకాంక్షల ఫలితమని పేర్కొన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత విద్య, వైద్యం, వ్యవసాయం, మౌలిక వసతులు, సంక్షేమ రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించిందన్నారు. ధర్మపురి పట్టణ అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యంతో కృషి చేస్తున్నామని తెలిపారు.ప్రజలకు మెరుగైన రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయం, పారిశుద్ధ్య సేవలు అందించేందుకు మున్సిపాలిటీ నిరంతరం పనిచేస్తోందని చెప్పారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం. శ్రీనివాస్, వైస్ చైర్మన్ ఇందారపు రామన్న, కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం పట్టణ ప్రజలకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

# తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



జగిత్యాల, జూన్ 2 (భారత్ శక్తి ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ కలెక్టర్ క్యాంప్ కార్యాలయం, జిల్లా పరిషత్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి.ఎస్. లత, బి. రాజగౌడ్, ఆర్డీవో మధుసూదన్, జెడ్పీ సీఈవో గౌతమ్ రెడ్డి, డిప్యూటీ సీఈవో పి. నరేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామ, వార్డు సభలను విజయవంతం చేయాలి

- ఎస్ఐఆర్‌పై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి
- డిజాస్టర్ మేనేజ్‌మెంట్, వాటర్ లాగింగ్ నివారణకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలి
- ప్రతి మండలం, మున్సిపాలిటీలో ప్రిపరేటరీ సమావేశాలు నిర్వహించాలి -జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్






సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జూన్ 02 :- ప్రజా పాలన – – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 4, 6, 8, 10 తేదీలలో జిల్లావ్యాప్తంగా నిర్వహించనున్న గ్రామ, వార్డు సభలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు.మంగళవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు వివిధ శాఖల ఉన్నతాధికారులతో కలిసి ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), జిల్లా విపత్తు నిర్వహణ ప్రణాళిక, గ్రామ-వార్డు సభల నిర్వహణ తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ గ్రామ, వార్డు సభల నిర్వహణలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు చేపడుతున్న ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా కొనసాగుతున్న పర్యావరణ వారోత్సవాలను నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు కలెక్టర్లు, అదనపు ఎస్పీతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, గ్రామ, వార్డు సభల ద్వారా ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తామని తెలిపారు. అలాగే జిల్లా విపత్తు నిర్వహణ ప్రణాళికను సమగ్రంగా రూపొందిస్తున్నట్లు చెప్పారు.అనంతరం జిల్లా అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి గ్రామ, వార్డు సభల ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. ప్రతి మండలం, మున్సిపాలిటీలో ముందస్తు సన్నాహక సమావేశాలు నిర్వహించి సభల నిర్వహణకు కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు.గ్రామ, వార్డు సభల్లో ఎస్ ఐ ఆర్ పై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ, వర్షపు నీటి సంరక్షణ, రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే రైతులకు ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఏ పంటలు సాగు చేయాలి, ఆయిల్‌పామ్, ఉద్యానవన పంటలు, ఫార్మర్ రిజిస్ట్రీ, నానో యూరియా వినియోగం వంటి అంశాలను వివరించి అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లా విపత్తు నిర్వహణ ప్రణాళికను రూపొందించాలని, వరదలు, భారీ వర్షాల సమయంలో సమస్యలు తలెత్తే ప్రాంతాలను ముందుగానే గుర్తించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యంగా పట్టణాలు, గ్రామాల్లో వాటర్ లాగింగ్ పాయింట్లను గుర్తించి తగిన నివారణ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.సంబంధిత శాఖల అధికారులు బాధ్యతాయుతంగా, సమన్వయంతో పనిచేసి గ్రామ, వార్డు సభలను ప్రజలకు ఉపయోగకరమైన వేదికలుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ కోరారు.ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, సబ్ కలెక్టర్ ఉమాహారతి, జిల్లా అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కూలి చింతల అంజమ్మ పై అడవి పంది దాడి

**-తీవ్ర గాయాలపాలైన ఉపాధి హామీకు కూలి**



మెదక్ జిల్లా కౌడిపల్లి, జూన్ 02 (భారత శక్తి న్యూస్): మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం కోకట్లపల్లి గ్రామంలో మంగళవారం ఉదయం ఉపాధి హామీ పనులకు వెళ్లిన చింతల అంజమ్మ అను ఓ మహిళపై అడవి పంది దాడి చేయడంతో తీవ్రంగా గాయపరిచింది. వివరాల్లోకెళ్తే కోకట్లపల్లి గ్రామానికి చెందిన చింతల అంజమ్మ తోటి కూలీలతో కలిసి ఉపాధి హామీ పనుల నిమిత్తం అడవిలోకి వెళ్ళగా. అకస్మాత్తుగా ఎదురైనా అడవిపంది ఆమె పై దాడి చేసింది. దాడిసంఘటనలో అంజమ్మ కు రెండు కుడి కాలకు తీవ్ర గాయాలయ్యాయి. అంజమ్మ పై అడవి పంది దాడిని గమనించిన తోటి కూలీలు వెంటనే ఆమెను అక్కడి నుంచి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి కౌడిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఆమెకు వైద్య చికిత్స చేస్తున్నారు.

# అభివృద్ధి, సంక్షేమంలో ముందుకు

**-రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాలరావు**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 2 (భారత శక్తి): రాష్ట్రంలోని ప్రజల సంక్షేమం, అభివృద్ధి కొరకు ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రోటోకాల్, ప్రజా సంబంధాలు) హర్కర వేణుగోపాలరావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం పెద్దపల్లి పార్లమెంటు సభ్యులు గడ్డం వంశీకృష్ణ, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డి.సి.పి. ఎ. భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య లతో కలిసి మంచిర్యాల పట్టణంలో అమరవీరుల స్తూపం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఏర్పాటు చేసిన ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు,మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మినిమం వేజ్ బోర్డు చైర్మన్ జనక్ ప్రసాద్, రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య లతో



కలిసి హాజరై హాజరై పోలీసు గౌరవ వందనం స్వీకరించి, జాతీయ జెండాను ఆవిష్కరించి తెలంగాణ తల్లి విగ్రహానికి పూల సమర్పణ చేశారు.ఈ సందర్భంగా ప్రగతి సందేశాన్ని అందించారు. ప్రభుత్వం రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి కొరకు అహర్నిశలు శ్రమిస్తుందని, రైతులు, మహిళల సంక్షేమాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని, విద్య, వైద్య రంగాల బలోపేతానికి కృషి చేస్తూ ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సౌకర్యం కొరకు సకల సదుపాయాలు కల్పిస్తుందని తెలిపారు. అనంతరం జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు మంజూరైన మోటారు సైకిళ్ళు, ల్యాప్ టాప్ లు, వీల్ చైర్లు ఇతరత్ర అర్హులైన లబ్ధిదారులకు అందజేశారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు, తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు ఆలపించిన గీతాలు అందరినీ అలరించాయి.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# బిజెపి ఆధ్వర్యంలో తెలంగాణ అవతరణ దినోత్సవం జాతీయ జెండా ఆవిష్కరణ



రేగొండ, జూన్ 2 (భారత శక్తి) తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కొత్తపల్లి గోరి లో మండల అధ్యక్షులు సూదనబోయిన విష్ణు యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం 2014 జూన్ 2 న ఏర్పడిన సందర్భంగా ప్రతి సంవత్సరం జూన్ రెండో తారీఖున రాష్ట్ర అవతరణ దినోత్సవంగా జరుపుకుంటున్నాం. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించి, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తమ ప్రాణాలను అర్పించిన అమర వీరులకు ఘన నివాళులు అర్పించారు . అనంతరం జాతీయ గీతాలాపన నిర్వహించి, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ చరిత్ర, రాష్ట్ర సాధనలో ప్రజల పోరాటం వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కానుగంటి పోశెట్టి, కరాబు బాపురావు, మార్త రవి, కొమ్మిడి తిరుపతి రెడ్డి, ఎంబాడి.తిరుపతి, దండబోయిన.సుధాకర్, లక్కర్సు. నరేష్, దబ్బేట.కుమార్, జిల్లా కౌన్సిలర్ నెంబర్ మాచపాక.సతీష్, మండల ఉపాధ్యక్షుడు జవాజి.ప్రభాకర్, మండల ప్రధాన కార్యదర్శి నెల్లి.వేణు, మండల మండల కార్యదర్శి రాజేందర్, శక్తి కేంద్రశీ ఇంచార్జ్ గూడ.రాకేష్, బూత్ అధ్యక్షులు జోరు.వీరస్వామి, పుట్ట. రాంబాబు, తనువుల.రమేష్, కమలాకర్, మండల నాయకులు వేణు, కిషన్, తోట్ల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక పర్యావరణ వారోత్సవాలు ఘనంగా నిర్వహించాలి.

**-వర్షాకాల సన్నద్ధతకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి.**

**-ఈ నెల 4, 6, 8, 10 వ తేదీల్లో గ్రామ, వార్డు సభలు నిర్వహించాలి.**

**-రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు**

**-అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష.**

**-వీసీకి హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె**



భారత శక్తి న్యూస్, భారత శక్తి ప్రతినిధి, జూన్ 2: ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పర్యావరణ వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పర్యావరణ వారోత్సవాలు, వర్షాకాలం సన్నద్ధత, గ్రామసభల నిర్వహణ, తదితర అంశాలపై హైదరాబాదు నుంచి సీఎస్ రామకృష్ణారావు రాష్ట్ర డీజీపీ సీ వీ ఆనంద్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి మంగళవారం సమావేశం నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితెతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పర్యావరణ వారోత్సవాలు విజయవంతంగా నిర్వహించాలన్నారు. అన్ని కార్యక్రమాలను ప్రణాళిక ప్రకారం చేపట్టాలని సూచించారు. ఈ నెల 4, 6, 8, 10 వ తేదీలలో గ్రామ, వార్డు సభలను ఏర్పాటు చేసి వివిధ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సభలలో ముఖ్యంగా రైతులకు రానున్న వర్షాకాలం, వాతావరణ పరిస్థితులు, పంటల సాగు వంటి అనేక విషయాలను వివరించాలన్నారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. గ్రామ సభలలో మండల స్థాయి అధికారులు మొదలుకొని ప్రజా ప్రతినిధులు ప్రజలు మహిళా సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున భాగస్వామ్యం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. రానున్న వర్షాకాలం, ఆకస్మిక వరదలు, విపత్కర పరిస్థితులపై అధికారులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. పోలీసులు, అడ్మినిస్ట్రేటివ్ విభాగాలు పరస్పరం సమన్వయంతో ఉండాలని తెలిపారు. వీసీలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్. ఆర్డీఓ వేములవాడ కే ఎస్ బీ కుమారి, ఎన్ పీ డీ సీ ఎల్ ఎస్ ఈ వేణుమాధవ్, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, సీపీఓ శ్రీనివాసాచారి, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా పంచాయతీ అధికారి షరీఫుద్దీన్, ఉద్యానవన శాఖ అధికారి శరత్, జిల్లా వైద్యాధికారి రజిత, ఇరిగేషన్ అధికారులు కిశోర్ కుమార్, సంతు ప్రకాశ్, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, లోకేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అన్నామలై సొంత పార్టీ దిశగా అడుగులు

**చెన్నై (భారత శక్తి)**తమిళనాడు రాజకీయాల్లో ఇప్పుడు సరికొత్త ముఖచిత్రం ఆవిష్కృతం కాబోతోందా? సింగం ఐపీఎస్ ఆఫీసర్‌గా గుర్తింపు తెచ్చుకుని, ఆ తర్వాత కమలం గూటికి చేరి ఆ రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనం సృష్టించిన కే. అన్నామలై బీజేపీకి గుడ్‌బై చెప్పబోతున్నారా? అంటే అవుననే అంటున్నాయి తమిళ మీడియా వర్గాలు. ఢిల్లీ పెద్దల నిర్ణయాలతో విభేదిస్తూ, ఆయన సొంతంగా కొత్త రాజకీయ పార్టీ లేదా సరికొత్త ఉద్యమాన్ని ప్రారంభించేందుకు గ్రౌండ్ ప్రిపేర్ చేసుకున్నట్లు తెలుస్తోంది. జూన్ 3వ తేదీన ఆయన చెన్నైలో ఒక ప్రెస్ మీట్ పెట్టి, తన భవిష్యత్తు కార్యాచరణను అధికారికంగా ప్రకటించబోతున్నారని తమిళ పాలిటిక్స్ లో జోరుగా ప్రచారం సాగుతోంది. ఇప్పటికే సోషల్ మీడియాలో అన్నామలై మద్దతుదారులు ఆయన స్థాపించబోయే కొత్త పార్టీ పేరు, జెండా డిజైన్లను కూడా వైరల్ చేయడం ఈ ఊహాగానాలకు మరింత బలాన్ని చేకూరుస్తోంది. ఢిల్లీ కేంద్రంగా సాగే హైకమాండ్ రాజకీయాలకు స్వస్తి చెప్పి, తమిళనాడు మట్టి వాసన తెలిసిన ఒక ప్రాంతీయ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగాలన్నదే అన్నామలై ప్లాన్‌గా కనిపిస్తోంది. కేంద్రంలోని బీజేపీ నాయకత్వంతో అన్నామలైకి గత కొంతకాలంగా విభేదాలు నడుస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ 9వ తరగతి విద్యార్థులకు త్రిభాషా సూత్రాన్ని హడావుడిగా అమలు చేయాలని చూడాన్ని అన్నామలై బహిరంగంగానే వ్యతిరేకించారు. తమిళనాడు సెంటిమెంట్‌కు అత్యంత సున్నితమైన భాషా వివాదం విషయంలో కేంద్రం తీసుకున్న నిర్ణయం వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతారని ఆయన ఎక్స్ వేదికగా తప్పుబట్టారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై ఆయన ఇలా తిరుగుబావుటా ఎగరేయడం, ఢిల్లీ పెద్దలకు ఆయన పంపుతున్న బలమైన పొలిటికల్ సిగ్నల్‌గా విశ్లేషకులు భావిస్తున్నారు. ఇటీవల ముగిసిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకేతో మళ్ళీ పొత్తు పెట్టుకోవాలనే ఢిల్లీ బీజేపీ పెద్దల నిర్ణయం అన్నామలైకి అస్సలు నచ్చలేదు. గతంలో జయలలిత, అన్నాదురైలపై అన్నామలై చేసిన ఘాటు వ్యాఖ్యల వల్లే కూటమి విచ్ఛిన్నమైందని, పొత్తు కుదరాలంటే అన్నామలైని రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తప్పించాలని ఎడప్పాడి పళనిస్వామి కండిషన్ పెట్టారు. దాంతో హైకమాండ్ ఆయనను తప్పించి నైనార్ నాగేంద్రన్‌ను అధ్యక్షుడిగా నియమించింది. పార్టీ లైన్ దాటకుండా అన్నామలై అప్పట్లో కూటమి తరఫున ప్రచారం చేసినప్పటికీ.. ఎన్నికల్లో బీజేపీ కేవలం ఒకే ఒక్క స్థానాన్ని గెలుచుకుని ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. ఈ వైఫల్యం తర్వాత, ఢిల్లీ పెద్దల చేతుల్లో కీలుబొమ్మగా మారడం కంటే బయటకు రావడమే బెటర్ అని ఆయన డిసైడ్ అయినట్లు టాక్. తమిళనాడులో ప్రస్తుతం ద్రవిడ పార్టీలైన డీఎంకే, అన్నాడీఎంకేలకు తోడు నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం అధికారంలోకి వచ్చి సరికొత్త రాజకీయ శకాన్ని ప్రారంభించింది. యువత అంతా విజయ్ వైపు మొగ్గు చూపుతున్న తరుణంలో, తాను కూడా ఒక స్వతంత్ర ప్రాంతీయ శక్తేనని నిరూపించుకోకపోతే తమిళ రాజకీయాల్లో వెనుకబడిపోతామని అన్నామలై భావిస్తున్నారు. అందుకే బీజేపీ రాష్ట్ర ఇన్-ఛార్జ్ నితిన్ నబిన్‌తో అత్యవసర సమావేశాన్ని కోరినట్లు సమాచారం. ఈ చర్చలు విఫలమైతే, గురువారం ఆయన పార్టీ వీడటం ఖాయమని తమిళ పత్రికలు కథనాలు ప్రసారం చేస్తున్నాయి..మరోవైపు, తమిళనాడు బీజేపీ సీనియర్ నాయకులు ఈ ప్రచారాన్ని కొట్టిపారేస్తున్నారు. అన్నామలై పార్టీ వీడటం లేదని, ఆయనకు జాతీయ స్థాయిలో ఒక కీలకమైన బాధ్యతను అప్పగించేందుకు అధిష్టానం ఆలోచిస్తోందని చెబుతున్నారు. ఒకవేళ అన్నామలై నిజంగానే సొంత పార్టీ పెడితే, అది తమిళనాడులో కాస్తో కూస్తో పుంజుకుంటున్న బీజేపీ ఓటు బ్యాంకును ఘోరంగా దెబ్బతీస్తుంది. ఏది ఏమైనా, మాజీ ఐపీఎస్ అధికారి తీసుకోబోయే ఈ తదుపరి అడుగు ఈ వారంలో తమిళనాడు రాజకీయాల్లో ఒక పెను భూకంపం సృష్టించబోతోందనడంలో ఎలాంటి సందేహం లేదు.

### 17 నుంచి 2 శాతానికి పడిపోయిన ఓట్ షేర్

2024 పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి తమిళనాడులో 13% ఓటు బ్యాంకు వచ్చిందంటే దానికి ప్రధాన కారణం అన్నామలై. ఎన్డీఏ కూటమి మొత్తానికి 17% శాతం ఓటు బ్యాంకు నమోదయింది. కానీ, 2026 అసెంబ్లీ ఎన్నికలకు వచ్చేసరికి బీజేపీ అధిష్టానం అన్నామలై విషయంలో స్టాండ్ మార్చుకుంది. అన్నా డీఎంకే అధినేత "ఈపీఎస్" ఒత్తిడికి తలవంచి అన్నామలై ని బిజెపి అధ్యక్షుడి స్థానం నుంచి తొలగించింది. ఇది తమిళనాడులో కమలం పార్టీకి మొదటి దెబ్బ. ఆ తర్వాత అన్నా డీఎంకే చెప్పిన స్థానాలలోని బిజెపి పోటీ చేయాల్సి వచ్చింది. అవన్నీ అత్యంత బలహీనమైన స్థానాలు. పనికిమాలిన అన్నా డీఎంకే ఒత్తిడి వల్ల బిజెపి గెలిచే స్థానాలు కోల్పోవడంతో పాటు.. పోటీ చేసే స్థానాల్లో కూడా తీవ్రమైన ఒత్తిడి ఎదుర్కొంది.బిజెపి తమిళనాడు అధ్యక్షుడు నుంచి మొదలు పెడితే తమిళ సై సౌందర రాజన్ వరకు తమ స్థానాలను మార్చకుండా అన్నా డీఎంకేతో లోపాయికారి ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. అయితే వారు కూడా విజయం సాధించలేకపోయారు. చివరికి పార్టీని కూడా బతికించలేకపోయారు. ఎన్నికల్లో బిజెపికి రెండు శాతం ఓటు బ్యాంకు వచ్చిందంటే దానిని ఎలా అర్థం చేసుకోవాలో కమలం పెద్దలే నిర్ణయించుకోవాలి.బిజెపి అధిష్టానం వ్యవహరించిన తీరుతో అన్నామలై తీవ్ర అంతర్మదనంలో పడ్డట్టు వార్తలు వస్తున్నాయి. అంతేకాదు బిజెపికి రాజీనామా చేసి.. ఆరు నెలల పాటు క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలు తెలుసుకొని.. పార్టీని ఏర్పాటు చేస్తారని తెలుస్తోంది.

ఇప్పటికే అన్నామలై బిజెపి పెద్దలకు వర్తమానం పంపినట్లు సమాచారం. అయితే దీనిపై ఇంతవరకు బిజెపి పెద్దలు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. మరో వైపు తమిళనాడులో ద్రావిడ వాదానికి సంబంధం లేకుండా రాజకీయాలను రూపొందించాలని అన్నామలై భావిస్తున్నారు. బిజెపి ద్వారా దానిని భర్తీ చేయాలని అనుకున్నారు.ఇటీవల ఎన్నికల్లో స్పష్టమైన మెజారిటీ ఏ పార్టీకి రాకపోవడంతో ద్రావిడ వాదంతో తమిళ ప్రజలను పిచ్చోళ్లను చేసే ఆ రెండు పార్టీలు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని అనుకున్నాయి. చివరి నిమిషంలో విజయ్ మేల్కోవడంతో ఆ ప్రయత్నం ఆగిపోయింది. ద్రావిడ వాద సెంటిమెంట్ నిత్యం రగిలిస్తూ.. తమిళ ప్రజలను పిచ్చోళ్లను చేస్తున్నాయి ఆ రెండు పార్టీలు. వాటికి ప్రత్యామ్నాయంగా బిజెపిని రూపొందించాలని అన్నామలై భావించారు. కానీ అధిష్టానం తలతిక్క వ్యవహార శైలి వల్ల ఆయన పార్టీకే దూరమయ్యే ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికైనా బిజెపి అధిష్టానం మేల్కొంటుందా.. అన్నామలైకి అధ్యక్ష బాధ్యతలు అప్పగిస్తుందా.. ఈ ప్రశ్నలకు కాలమే సమాధానం చెప్పాలి.

## ఐక్యంగా, సౌభ్రాతృత్వంతో ముందుకు సాగుదాం

**(భారత శక్తి)**తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభసందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఎందరో మహానుభావుల త్యాగాలు, ఉద్యమ స్ఫూర్తి ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని పేర్కొంటూ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు.ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షలను సాకారం చేసుకుని తెలంగాణ అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తెలంగాణను సమగ్ర అభివృద్ధి, సామాజిక న్యాయం, ఆర్థిక పురోగతి దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని చెప్పారు.రైతుల సంక్షేమం, మహిళల సాధికారత, యువతకు ఉపాధి అవకాశాలు, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నామని గుర్తుచేశారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పారదర్శక, జవాబుదారీతనంతో కూడిన పాలనను అందిస్తూ, ప్రతి కుటుంబానికి అభివృద్ధి ఫలాలు చేరేలా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం వేడుక సందర్భంగా రాష్ట్ర ప్రజలందరూ ఐక్యంగా, సౌభ్రాతృత్వంతో ముందుకు సాగుతూ, తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

## ములమాడ గ్రామంలో ఉద్రిక్తత

**- దళిత కుటుంబంపై దాడి చేశారంటూ ఆరోపణలు**

**వికారాబాద్ (భారత శక్తి)**వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట మండలం ములమాడ గ్రామంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. పాత కక్షల నేపథ్యంలో గ్రామ సర్పంచ్ భర్త నరేందర్ రెడ్డి తన అనుచరులతో కలిసి దళిత కుటుంబంపై దాడికి పాల్పడ్డారంటూ బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటన గ్రామంలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. బాధితుల కథనం ప్రకారం, నరేందర్ రెడ్డి తన అనుచరులతో మంది వ్యక్తులతో కలిసి జిన్నారం బాలరాజు కుటుంబం నివాసానికి చేరుకుని దాడి చేశారు. ఈ ఘటనలో కుటుంబంలోని మహిళలు, పురుషులు, చిన్నారులను విచక్షణారహితంగా కొట్టారని, ఇంట్లోని సామగ్రిని బయటకు విసిరివేసి ఇంటిపై దాడికి పాల్పడ్డారని ఆరోపిస్తున్నారు. దాడి సమయంలో కుటుంబ సభ్యులు భయాందోళనలకు గురయ్యారని స్థానికులు చెబుతున్నారు.

ఘటన సమయంలో పోలీసులు అక్కడే ఉన్నప్పటికీ దాడిని అడ్డుకోవడంలో విఫలమయ్యారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. బాధిత కుటుంబాన్ని రక్షించాల్సిన పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించారంటూ విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు స్పందించి విచారణ జరపాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.ఇదిలా ఉండగా, నరేందర్ రెడ్డి వ్యవహార శైలిపై గతం నుంచే గ్రామంలో విమర్శలు ఉన్నాయని కొందరు స్థానికులు పేర్కొంటున్నారు. వివాదాలను చర్చల ద్వారా పరిష్కరించాల్సిన సందర్భాల్లో కూడా దౌర్జన్యాలకు పాల్పడటం, ప్రత్యర్థులపై ఒత్తిడి తీసుకురావడం వంటి ఆరోపణలు గతంలోనూ వినిపించాయని చెబుతున్నారు. జిన్నారం బాలరాజు కుటుంబంపై జరిగిన తాజా ఘటన కూడా అదే ధోరణికి కొనసాగింపుగా కనిపిస్తోందని బాధితులు ఆరోపిస్తున్నారు. దళిత కుటుంబంపై జరిగినట్లు చెబుతున్న ఈ దాడి ఘటన స్థానికంగా కలకలం రేపింది. బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం సహా సంబంధిత సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## అల్వాల్‌లో దోపిడి దొంగల బీభత్సం

**మేడ్చల్ (భారత శక్తి)**అల్వాల్ లో దోపిడి దొంగలు బీభత్సం సృష్టించారు. మధ్య బొల్లారంలోని ఓ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. బాధితుడు రమేష్ అరుణాచల్ ప్రదేశ్ కు వెళ్లాడు. దాంతో దొంగలు పక్కా స్కెచ్ తో దోపిడికి పాల్పడ్డారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటనలో 30 తులాల బంగారం, వెండి ఆభరణాలు, లక్ష రూపాయల నగదు దొంగలు ఎత్తుకెళ్లారు. ఇంటిగేటు, ఇంటి తాళాలు పగలగొట్టిన విషయాన్ని గమనించి స్థానికులు రమేష్ కు సమాచారం అందించారు. దాంతో రమేష్ టూహుటిన అరుణాచల్ ప్రదేశ్ నుంచి తిరిగి వస్తున్నారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఆరా తీస్తున్నారు.

## నిద్రలోనే ఇద్దరు మహిళలు సజీవదహనం

**ఏలూరు (భారత శక్తి)** వేలేరుపాడులో మంగళవారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ దుర్ఘటనలో వలగని సావిత్రి ఇల్లు, పక్కనే ఉన్న లక్ష్మి ఇల్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. సావిత్రి ఇంట్లో నిద్రిస్తున్న ఆమె, సూర్యాపేట జిల్లా నుంచి వచ్చిన ఆమె అక్క సిగ పూలమ్మ ఇద్దరూ నిద్రలోనే సజీవదహనమయ్యారు. లక్ష్మి ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. అగ్ని ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## ఇటలీలో భారీ భూకంపం..

**(భారత శక్తి)** దక్షిణ ఇటలీ తీర ప్రాంతంలో మంగళవారం ఉదయం 6.1 తీవ్రతతో బలమైన భూకంపం సంభవించింది. జర్మన్ రీసెర్చ్ సెంటర్ ఫర్ జియోసైన్సెస్ ప్రకారం భూకంప కేంద్రం భూమి ఉపరితలం నుంచి సుమారు 253 కిలోమీటర్ల లోతులో ఉంది. ఇప్పటివరకు ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం జరిగినట్లు అధికారిక నివేదికలు లేవు. భూకంప కేంద్రం లోతుగా ఉండటం వల్ల ఉపరితలంపై ప్రభావం పరిమితంగా ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు. అధికారులు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

## తొమ్మిది లారీల్లో పశువుల రవాణా

**- పట్టుకున్న స్థానికులు**

**అన్నమయ్య (భారత శక్తి)**తంబళ్లపల్లి నియోజకవర్గం పెద్దమండెం నడిబొడ్డున 9 కంటైనర్లలో పశువులను కుక్కి వివిధ ప్రాంతాలకు తీసుకెళ్తుండగా అక్కడి ప్రజలు గుర్తించి వాటిని నిలిపివేసారు. అక్రమ రవాణా చేస్తున్న కర్ణాటక మహారాష్ట్ర చెందిన 15 పెద్ద లారీలలో పశువులను అక్రమంగా తరలిస్తుండడంతో పెద్దమండెంలో స్థానికులు అడ్డుకున్నారు వాహనాల్లో ఆవులు ఎద్దులు ఎనుములు పెద్ద ఎత్తున ఉన్నాయి వీటిని స్థానికులు అడ్డుకోవడంతో యజమానులు డ్రైవర్లు పరారైనట్లు తెలుస్తుంది. వాహనాలకు సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేశారు ఇంకా 15 వాహనాలు వెళ్లిపోయినట్లు స్థానికులు చెబుతున్నారు

## హరీష్ రావు పార్టీ మార్పు ప్రచారం

**మెదక్,(భారత శక్తి)** తెలంగాణ రాజకీయాల్లో సీనియర్ నేత, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు పార్టీ మార్పు అంశం మరోసారి తీవ్ర దుమారం రేపుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన సంచలన వ్యాఖ్యలు, దానికి హరీష్ రావు అంతే ఘాటుగా ఇచ్చిన కౌంటర్లతో రాష్ట్ర రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. గత కొన్ని రోజులుగా తెరవెనుక నడుస్తున్న ఈ ప్రచారం.. ఇప్పుడు ఇద్దరు అగ్ర నేతల మధ్య బహిరంగ సవాల్ గా మారింది.ఇటీవల మీడియాతో నిర్వహించిన ఒక చిట్‌చాట్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. హరీష్ రావు రాజకీయ భవిష్యత్తుపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. హరీష్ రావు ఫ్యూచర్ ఏంటో ఆయనకే క్లారిటీ లేదని, భవిష్యత్తులో ఆయన ఏ పార్టీలో ఉంటారో ఆయనకే తెలియదంటూ ఎద్దేవా చేశారు. అంతేకాకుండా, గత చరిత్రను తవ్వుతూ 2008లో హరీష్ రావు అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డిని కలిసింది నిజం కాదా? అని రేవంత్ ప్రశ్నించారు. ప్రస్తుతం హరీష్ రావు ఎవరెవరితో టచ్‌లో ఉన్నారో, ఎవరెవరితో మాట్లాడుతున్నారో తనకు పూర్తి సమాచారం ఉందని సీఎం వ్యాఖ్యానించడం రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది. ఫాంహౌస్‌లో ఉన్న కేసీఆర్ మీద ఒట్టేసి.. తాను బీజేపీలో చేరబోనని హరీష్ రావు చెప్పగలరా? అంటూ రేవంత్ రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విసిరిన సవాల్‌పై హరీష్ రావు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రేవంత్ వ్యాఖ్యలను పూర్తిగా ఖండించారు. తన రాజకీయ నిబద్ధత ఏంటో అందరికీ తెలుసన్నారు. "నా పుట్టుక బీఆర్ఎస్.. నా జీవితమంతా బీఆర్ఎస్.. నా చావు కూడా బీఆర్ఎస్ పార్టీలోనే" అని హరీష్ రావు తేల్చి చెప్పారు. ఇప్పటికే ఈ విషయాన్ని తాను వంద సార్లు చెప్పానని, అవసరమైతే మరో వంద సార్లు చెప్పడానికైనా సిద్ధమని స్పష్టం చేశారు. జీవితాంతం కేసీఆర్ అడుగుజాడల్లోనే నడుస్తానని పునరుద్ఘాటించారు. నాలుగు పార్టీలు మారిన రేవంత్ రెడ్డికి నా నిబద్ధత గురించి మాట్లాడే నైతిక అర్హత ఎక్కడిదని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. అసలు మాటలకు విలువ ఎక్కడుందని ఎద్దేవా చేశారు.తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు ఇప్పటికే కాంగ్రెస్ గూటికి చేరిన నేపథ్యంలో, హరీష్ రావు లాంటి బలమైన నేతను టార్గెట్ చేయడం ద్వారా ప్రతిపక్షాన్ని మరింత బలహీనపరచాలనే వ్యూహంలో కాంగ్రెస్ ఉన్నట్లు కనిపిస్తోంది. 2008 నాటి వైఎస్సార్ కలయిక ప్రస్తావనను తెరపైకి తెచ్చి బీఆర్ఎస్ శ్రేణుల్లో అనుమానాలు రేకెత్తించేందుకు సీఎం ప్రయత్నించారు.. హరీష్ రావు మాత్రం తన మాతృసంస్థపై, కేసీఆర్ నాయకత్వంపై ఉన్న నమ్మకాన్ని గట్టిగా చాటుకుంటూ ఆ ప్రచారానికి బ్రేక్ వేసే ప్రయత్నం చేశారు.

## రెండు గ్రహాలపై వజ్రాల వాన!

**హైదరాబాద్ (భారత శక్తి)**విశ్వంలో మనకు తెలియని వింతలెన్నో ఉన్నాయి. భూమి మీద నీటి వర్షం కురవడం సహజం. కానీ మన సౌర కుటుంబంలోని మంచు గ్రహాలైన నెప్ట్యూన్, యురేనెస్‌ల మీద వజ్రాల వర్షం కురుస్తుందని మీకు తెలుసా? ఇది ఏదో సైన్స్ ఫిక్షన్ సినిమా కథ కాదు. శాస్త్రవేత్తలు ప్రయోగపూర్వకంగా నిరూపించిన యథార్థం. ఈ వజ్రాల వాన మనం అనుకున్నదాని కంటే చాలా తక్కువ ఉష్ణోగ్రతలు, పీడనాల వద్దే మొదలవుతుందని తేలింది. అసలు ఈ వజ్రాలు ఎలా ఏర్పడతాయి? అవి ఆగ్రహాల అయస్కాంత క్షేత్రాలను ఎలా మారుస్తున్నాయి?. ఐస్ జెయింట్స్ అని పిలుపుస్తారు. వీటిలో ఘనమైన కోర్ చుట్టూ నీరు, అమ్మోనియం, హైడ్రోకార్బన్లతో కూడిన మందపాటి మంచు పొరలు ఉంటాయి. ఈ గ్రహాల లోపలి భాగంలో పీడనం, ఉష్ణోగ్రత విపరీతంగా పెరుగుతాయి. ఈ తీవ్రమైన పరిస్థితుల్లో, మీథేన్ వంటి హైడ్రోకార్బన్లలోని కార్బన్, హైడ్రోజన్ విడిపోతాయి. ఆ విడిపోయిన కార్బన్ అణువులు తీవ్రమైన పీడనం వల్ల వజ్రాల స్ఫటికాలుగా మారి, వర్షంలా ఆ గ్రహం లోపలి పొరల్లో కురుస్తాయి. దీనినే శాస్త్రవేత్తలు వజ్రాల వాన అంటారు. వజ్రాల వాన కురుస్తుందని శాస్త్రవేత్తలు దశాబ్దాలుగా ఊహిస్తున్నప్పటికీ, దానిని ప్రయోగశాలలో మొదటిసారిగా 2017లో ానంఅ నేషనల్ యాక్సిలరేటర్ లాబొరేటరీ పరిశోధకులు గమనించారు. అప్పట్లో హై- పరవర్ లేజర్లను ఉపయోగించి కేవలం కొన్ని నానో సెకన్లపాటు మాత్రమే ఈ పరిస్థితులను సృష్టించగలిగారు. అయితే 2024లో ప్రచురితమైన పరిశోధనలో జర్మనీలోని యూరోపియన్ ఎక్స్ రే ఫ్రీ ఎలక్ట్రాన్ లేజర్ సహాయంతో శాస్త్రవేత్తలు అద్భుతాన్ని సాధించారు. వీరు పాలీస్టైరిన్ అనే ప్లాస్టిక్ పొరను తీసుకొని, దానిని వజ్రాల మధ్య ఉంచి విపరీతమైన పీడనానికి గురి చేశారు. ఆ తర్వాత ఎక్స్‌రే పల్స్ ద్వారా 2200 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువ వేడి చేశారు. ఈ ప్రయోగంలో వజ్రాలు మనం గతంలో అనుకున్న దాని కంటే తక్కువ లోతులో తక్కువ పీడనం వద్దే ఏర్పడుతున్నాయని గుర్తించారు.

### అయస్కాంత క్షేత్రాల రహస్యం

భూమికి ఉండే అయస్కాంత క్షేత్రం చాలా క్రమబద్ధంగా, ఉత్తర, దక్షిణ ధ్రువాల నుంచి విస్తరించి ఉంటుంది. కానీ నెప్ట్యూన్, యురేనస్ గ్రహాల అయస్కాంత క్షేత్రాలు చాలా వింతగా, అసమానంగా ఉంటాయి. ఇవి గ్రహం మధ్యలో కాకుండా ఒక పక్కకు నెట్టివేసినట్టు కనిపిస్తాయి. ఇలా ఎందుకు జరుగుతుందో ఇంత వరకు అంతుచిక్కలేదు. తాజా పరిశోధనల ప్రకారం, ఆకాశం నుంచి వజ్రాలు కిందికి పడుతున్నప్పుడు, అవి తమతోపాటు వాయువులను, మంచును కూడా లాగుతూ కిందకు వెళ్తాయి. ఇది ఆ గ్రహంలోని విద్యుత్ ప్రసరణ చేసే మంచు పొరల్లో ఒకరమైన కదలికను కలిగిస్తుంది. ఈ కదలికలే ఒక డైనమోలాగా పని చేసి ఆగ్రహాలకు వింతైన అయస్కాంత క్షేత్రాలను సృష్టిస్తున్నాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. మన సౌర కుటుంబంలోని గ్రహాల లోపల ఏం జరుగుతుందో తెలుసుకోవడానికి ఈ పరిశోధన దోహదపడుతుంది. విశ్వంలో నెప్ట్యూన్ కంటే చిన్నగా ఉండే మినీ- నెప్ట్యూన్స్ అత్యంత సాధారణమైన గ్రహాలు. అక్కడ కూడా ఇలాంటి వజ్రాల వాన కురిసే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ప్రయోగశాలలో ప్లాస్టిక్ నుంచి వజ్రాలను తయారు చేసే ఈ పద్ధతిని భవిష్యత్‌లో మెడిసిన్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో వాణిజ్యం పరంగా వాడుకోవచ్చు.ప్రయోగశాలలో ఇవి నానో మీటర్ల పరిమాణంలో ఏర్పడినప్పటికీ, నెప్ట్యూన్ గ్రహం మీద ఇవి లక్షల క్యారెట్ల బరువు ఉండే పెద్ద వజ్రాలుగా మారే అవకాశం ఉంది. పై నుంచి వజ్రాలు కిందకు పడుతున్నప్పుడు అవి ఘర్షణ వల్ల వేడిని పుట్టిస్తాయి. ఇది ఆ గ్రహం లోప అదనపు ఉష్ణశక్తిగా మారుతుంది. భూమి మీద వర్షపు చినుకులు ఎలా పడతాయో, వేరే గ్రహాల మీద వజ్రాలు లేదా లోహాలు వర్షం కూడా భౌతిక శాస్త్ర నియమాల ప్రకారమే జరుగుతుందని హార్వర్డ్ పరిశోధకులు వివరిస్తున్నారు.

## వివాదంలో ఉప్పల్ ఎమ్మెల్యే

**హైదరాబాద్ (భారత శక్తి)**పిల్లలు క్రికెట్ ఆడుకుంటున్నారనే నెపంతో ఒక అధికార పార్టీ నేత దంపతులపై దారుణంగా దాడి చేయడమే కాకుండా, పోలీసులను అడ్డం పెట్టుకుని స్టేషన్‌లో వారిచేత బలవంతంగా కాళ్లు మొక్కించుకున్న ఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగుచూసింది.బీహార్ ప్రాంతానికి చెందిన లీలావతి, ఆమె భర్త ఉప్పల్ ఐడీఏ పరిధిలోని లక్ష్మీనారాయణ కాలనీలో నివసిస్తూ అక్కడి ఒక ఆట్టల కంపెనీలో పనిచేస్తున్నారు. మే 25వ తేదీ సాయంత్రం లీలావతి తన ఇద్దరు పిల్లలు, మరికొందరితో కలిసి కాలనీ రోడ్డుపై క్రికెట్ ఆడుతుండగా, అదే కాలనీలో ఉండే కాంగ్రెస్ నేతకు అది నచ్చలేదు. రాత్రిపూట ఆటలేంటి అంటూ బూతులు తిడుతూ ఆయన రోడ్డుపైకి వచ్చాడు.

లీలావతి దీనిని ప్రశ్నించడంతో ఆగ్రహానికి గురైన ఆ నేత, ఆమె బట్టలు చినిగిపోయేలా దాడికి దిగాడు. అడ్డువచ్చిన ఆమె భర్తను కూడా చితకబాదడంతో, అతని కంటి పైభాగంలో తీవ్ర గాయమై రక్తం కారింది. ఆ తర్వాత దాడి చేసిన సదరు నేత స్వయంగా పోలీసులకు సమాచారం ఇవ్వడంతో, రాత్రి పెట్రోలింగ్ సిబ్బంది వచ్చి బాధితులను స్టేషన్‌కు తరలించారు.బాధితులు తమపై జరిగిన దాడి గురించి ఫిర్యాదు చేయడానికి ప్రయత్నించగా, స్టేషన్ సిబ్బంది తిరస్కరించారు.

ఇదే సమయంలో సదరు నేత తన అధికార బలంతో పోలీసుల సాక్షిగా దంపతులను భయపెట్టాడు. లీలావతి కుటుంబం తన బంగారు గొలుసు దొంగిలించిందంటూ ఒక తప్పుడు ఫిర్యాదు ఇచ్చాడు. దీంతో ఆందోళన చెందిన బాధితులు తమపై దొంగతనం కేసు పెట్టవద్దని ప్రాధేయపడ్డారు. తన కాళ్లు మొక్కి, తప్పు చేశామని ఒప్పుకుంటేనే ఫిర్యాదు వెనక్కి తీసుకుంటానని ఆ నేత అర్ధరాత్రి వేళ స్టేషన్‌లోనే భీష్మించాడు. గత్యంతరం లేని పరిస్థితుల్లో బాధితులు పోలీసుల ముందే అతని కాళ్లు మొక్కడంతో ఆ నేత వారిని వదలిపెట్టాడు.ఈ దారుణానికి సంబంధించిన దాడి వీడియోలు వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొట్టడం, అలాగే తమపై జరిగిన అన్యాయాన్ని, స్టేషన్‌లో ఎదురైన అవమానాన్ని వివరిస్తూ సదరు బాధిత మహిళ తీసుకున్న సెల్ఫీ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడంతో ఈ విషయం బయటకు వచ్చింది. తప్పుడు ఫిర్యాదు ఇచ్చినప్పటికీ పోలీసులు ఆ నేతకు సహకరించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై ప్రస్తుతం స్పెషల్ బ్రాంచ్ పోలీసులు నివేదిక సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది.

## చీలక దిశగా తృణమూల్...

**కోల్ కత్తా,(భారత శక్తి)** పశ్చిమ బెంగాల్ అధికార పక్షమైన ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్‌లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ, యువ నేత అభిషేక్ బెనర్జీ లేని కొత్త తృణమూల్ కాంగ్రెస్ ఏర్పాటు కాబోతోందా? అనే ఊహాగానాలు బెంగాల్ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాతి సమీకరణలు, అంతర్గత విభేదాలు ఒక్కసారిగా బద్దలవడంతో పార్టీ నిలువునా చీలిపోయే ప్రమాదంలో పడినట్లు కనిపిస్తోంది. మహారాష్ట్రలో శివసేన పార్టీ చీలిపోయిన తరహాలోనే.. ఇప్పుడు బెంగాల్‌లోనూ మహారాష్ట్ర మోడల్ పునరావృతం కాబోతోందా అనే చర్చ సర్వత్రా నడుస్తోంది. ఈ వివాదానికి ప్రధాన కారణం పార్టీలో తీవ్ర చర్చకు దారితీసిన సిగ్నేచర్ రో. ఈ వ్యవహారంలో పార్టీ అంతర్గత విషయాలను బయటపెట్టి, విజిల్‌బ్లోయర్‌లుగా మారిన ఇద్దరు తృణమూల్ ఎమ్మెల్యేలు రితబ్రత బెనర్జీ, సందీపన్ సాహాలను పార్టీ అధిష్టానం బహిష్కరించింది. ఈ బహిష్కరణ చర్యతో అసమ్మతి శ్రేణులు ఒక్కసారిగా యాక్టివ్ అయ్యాయి. పార్టీకి చెందిన దాదాపు 50 మంది ఎమ్మెల్యేలు, కొందరు ఎంపీలు కూడా పార్టీని వీడేందుకు సిద్ధంగా ఉన్నట్లు, వారు ఇప్పటికే ప్రత్యామ్నాయ శ్రేణులతో చర్చలు జరుపుతున్నట్లు రాజకీయ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది కోల్‌కతాలోని మమతా బెనర్జీ నివాసంలో అత్యవసరంగా ఏర్పాటు చేసిన కీలక సమావేశమే ఈ చీలిక ఊహాగానాలకు బలాన్ని చేకూరుస్తోంది. పార్టీకి ఉన్న 80 మంది ఎమ్మెల్యేలలో ఏకంగా 60 మంది ఎమ్మెల్యేలు ఈ సమావేశానికి గైర్హాజరవడం తృణమూల్ కాంగ్రెస్‌లో కలకలం రేపింది. మరోవైపు సమావేశానికి రాని కొందరు ఎమ్మెల్యేలు సీనియర్ నేత రథిన్ ఘోష్ నివాసంలో భేటీ అయినట్లు సమాచారం. అయితే తాను అనారోగ్యం కారణంగానే దీదీ సమావేశానికి వెళ్లలేదని రథిన్ ఘోష్ సమర్థించుకున్నారు. అదే సమయంలో మరికొందరు ఎమ్మెల్యేలు దక్షిణ కోల్‌కతాలోని గేట్‌వే హోటల్‌లో రహస్యంగా సమావేశమవడం బెంగాల్ రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. ఈ పరిణామాలపై బెంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీ ఫేస్‌బుక్ లైవ్ ద్వారా స్పందిస్తూ తీవ్ర ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేశారు. తన పార్టీలోని ఒక వర్గంతో కలిసి బీజేపీ ఈ కుట్రకు తెరలేపిందని ఆమె ఆరోపించారు. "నలుగురు ఎమ్మెల్యేలు నా దగ్గరకు వచ్చి ఫిర్యాదు చేశారు. పోలీసులు వారిని తీవ్రంగా భయపెడుతున్నారట. ఒకవేళ కాళీఘాట్ సమావేశానికి హాజరైతే.. ఆయుధాల చట్టం కింద అరెస్ట్ చేస్తామని బెదిరించారట. అసలు ఇది ఎలాంటి ప్రజాస్వామ్యం? రాష్ట్రంలో అణచివేత అన్ని హద్దులు దాటిపోయింది. మా ఎమ్మెల్యేలను, ఎంపీలను ప్రలోభాలతో, బెదిరింపులతో లాక్కోవాలని బీజేపీ చూస్తోంది" అని ఆరోపించారు. తమ పార్టీలోనే ఉంటూ కొంతమంది నాయకులు 'ద్రోహులుగా' మారుతున్నారని, పోలీసు యంత్రాంగాన్ని కూడా ఇందుకు దుర్వినియోగం చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. హోటల్‌లో రహస్యంగా సమావేశమైన ఎమ్మెల్యేల తీరుపై తృణమూల్ నేత కునాల్ ఘోష్ తీవ్రంగా మండిపడ్డారు. ఎవరి పేర్లనూ నేరుగా ప్రస్తావించకుండా ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. "ఇప్పుడు ఫోన్ కాల్స్ అందుకుంటూ, గేట్‌వే హోటల్‌లో సమావేశాలు పెడుతున్న ఎమ్మెల్యేలందరికీ ఒక్కటే గుర్తు చేస్తున్నా. మనలో ఎవరూ స్వతంత్ర అభ్యర్థులుగా గెలవలేదు. ఒక 70 ఏళ్ల మహిళ రాష్ట్రమంతటా అలుపెరగకుండా తిరుగుతూ కష్టపడితే, ఆమె ముఖాన్ని చూసి ప్రజలు మనకు ఓట్లేసి గెలిపించారు. పార్టీని చీల్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్న మాట వాస్తవమే. అయితే దీనికి నేను బీజేపీని నిందించను, మనలోని అవకాశవాదులనే బాధ్యులను చేస్తాను. మనుషులన్నాక కనీస నైతికత, మనస్సాక్షి ఉండాలి" అని వ్యాఖ్యానించారు. కాగా ఈ పరిణామాల నేపథ్యంలో తృణమూల్ కాంగ్రెస్‌లో రేగిన ఈ అసమ్మతి జ్వాలలు ఎటు దారితీస్తాయనేది ఆసక్తికరంగా మారింది.

## పవన్ పక్కా స్కెచ్...

**హైదరాబాద్ (భారత శక్తి)** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు కెలికితే మామూలుగా ఉండదు. ముఖ్యంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఆ విషయం తెలుసు. ఆది నుంచి పవన్ కళ్యాణ్ విషయంలో ఆ పార్టీ కొంచెం అతిగా ప్రవర్తించింది. లెక్కలేని తనాన్ని చూపింది. దానికి మూల్యం చెల్లించుకుంది. అయితే నిండా మునిగాక.. చలి ఎందుకు అన్న మాదిరిగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పవన్ కళ్యాణ్ ను శాశ్వత శత్రువు అన్నట్లు చూస్తోంది. మరోవైపు తెలంగాణలో జనసేన పెద్దగా రాజకీయాలు చేయడం లేదు. కానీ ఆ పార్టీకి పెద్ద ఎత్తున అభిమానులు ఉన్నారు. సోషల్ మీడియా వరకు యాక్టివ్ గా పని చేస్తూ వస్తున్నారు. కానీ పవన్ పై రాజకీయ కుట్రలు జరుగుతున్న తరుణంలో తెలంగాణలో సైతం జనసేన ను విస్తరించాలన్న ఆలోచనకు పవన్ వచ్చినట్లు తెలుస్తోంది. అందులో భాగంగా పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. తెలంగాణలో జనసేన కీలక నేతలకు ఇప్పటికే సమాచారం అందించారు. ఆ సమావేశానికి సంబంధించిన ఏర్పాట్లు కూడా చురుగ్గా జరుగుతున్నాయి.తెలంగాణ విషయంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పెద్దగా దృష్టి సారించిన దాఖలాలు లేవు. తెలంగాణ ప్రజలు సైతం పవన్ కళ్యాణ్ విషయంలో చాలా సాఫ్ట్ గా ఉంటారు. రాష్ట్ర విభజన సమయంలో సైతం ఇక్కడి వారి భావోద్వేగాన్ని గుర్తించారు పవన్ కళ్యాణ్. వాటిని గౌరవించారే తప్ప ఎన్నడు వ్యతిరేకించలేదు. తెలంగాణ కళాకారులను గౌరవించారు. గద్దర్ లాంటి వారిని ఎంతగానో గౌరవించి సొంత అన్నదమ్ముడు మాదిరిగా చూసుకున్నారు. విపత్తుల సమయంలో తెలంగాణ ప్రభుత్వానికి భారీ స్థాయిలో నిధులు కూడా ఇచ్చారు. ప్రాంతీయవాదంతో లెక్క లేకుండా తెలంగాణ సమాజానికి ఎంతో సాయం చేశారు పవన్ కళ్యాణ్. అందుకే తెలంగాణ ప్రజలు పవన్ విషయంలో మరో ఆలోచన చేయరు. కానీ అదే తెలంగాణ నుంచి తనపై కుట్రలు జరుగుతుండడంతో.. గట్టిగానే రిప్లై ఇవ్వాలనుకుంటున్నారు పవన్ కళ్యాణ్. ఇలా కుట్రలు చేస్తున్న వారిని రాజకీయంగా ఇబ్బంది పెట్టాలంటే పార్టీని యాక్టివ్ చేయడమే ఉత్తమం అన్న నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.ప్రొఫెసర్ నాగేశ్వర్ ఎపిసోడ్ తర్వాత తెలంగాణలో జనసేన నేతలు క్రియాశీలకం అయ్యారు. చాలా దూకుడుతో వ్యవహరిస్తున్నారు. తెలంగాణ సమాజానికి పవన్ కళ్యాణ్ ఎలా సాయం చేశారో ఆధారాలతో సహా వివరించే ప్రయత్నం చేస్తున్నారు. అంతటితో ఆగకుండా రేపు జనసేన ముఖ్య నేతలతో పవన్ కళ్యాణ్ భేటీ కానున్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై వారితో చర్చించనున్నారు. తెలంగాణలో పార్టీ అభివృద్ధిపై పూర్తి దృష్టి కేంద్రీకరించనున్నారు. ఈ నెలలోనే భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు కూడా నిర్ణయించారు. గ్రేటర్ హైదరాబాద్ తో పాటు వరంగల్, ఖమ్మం కార్పొరేషన్లకు ఎన్నికలు జరగనున్నాయి. ఇదే ఊపు కొనసాగించి కార్పొరేషన్ ఎన్నికల్లో సత్తా చాటాలని భావిస్తున్నారు పవన్. వాటిలో గౌరవప్రదమైన సీట్లు దక్కించుకొని.. తెలంగాణ రాజకీయాల్లో మరింత యాక్టివ్ కావాలని భావిస్తున్నారు. చూడాలి ఆయన ప్రయత్నాలు ఎంత వరకు వర్క్ అవుట్ అవుతాయో..

# ‘హయగ్రీవ’ మూవీ రివ్యూ!



కన్నడలో ‘ధన్వీర’ కథానాయకుడిగా నటించిన సినిమానే ‘హయగ్రీవ’. రఘు కుమార్ దర్శకత్వం వహించిన ఈ సినిమా, ఫిబ్రవరి 26వ తేదీన థియేటర్లకు వచ్చింది. క్రైమ్ థ్రిల్లర్ జోనర్లో రూపొందిన ఈ సినిమాలో కథానాయికగా సంజనా ఆనంద్ నటించింది. ఈ ఏడాది ఫిబ్రవరి 27వ తేదీన థియేటర్లకు వచ్చిన ఈ సినిమా, మే 22వ తేదీ నుంచి ‘అమెజాన్ ప్రైమ్’లో స్ట్రీమింగ్ అవుతోంది. ప్రస్తుతం ఈ సినిమా కన్నడలో మాత్రమే అందుబాటులో ఉంది. బెంగుళూర్ లో క్రైమ్ బ్రాంచ్ కి సంబంధించిన పోలీస్ ఆఫీసర్ గా అర్జున్ హయగ్రీవ (ధన్వీర) పనిచేస్తుంటాడు. ఆయన భార్య ఐశ్వర్య ( సంజనా ఆనంద్) ఒక కార్పొరేట్ హాస్పిటల్లో డాక్టర్ గా ఉంటుంది. పెళ్లి తరువాత అర్జున్ హయగ్రీవ మరింత బిజీ అవుతాడు. సిటీలో వరుస హత్యలు జరుగుతూ ఉంటాయి. శవాలు లభిస్తున్న తీరు పోలీసులను సైతం కంగారు పెడుతూ ఉంటుంది. మనిషి దేహానికి మృగాల .. జంతువుల ‘తల’ను అమర్చడం చూసి ప్రజలు భయభ్రాంతులకు గురవుతుంటారు. హంతకుడు ఒక సైకో. అతను ఒక్కడే ఈ హత్యలను చేస్తున్నాడనే విషయం హయగ్రీవకి నిర్ధారణ అవుతుంది. హంతకుడికి వైద్య శాస్త్రంపై మంచి అవగాహన ఉందనే విషయం అర్థమవుతుంది. అయితే అతను ఎందుకు ఈ హత్యలను చేస్తున్నాడు? మనిషి తలను తీసేసి, జంతువుల తలలను ఎందుకు పెడుతున్నాడు? అనేది హయగ్రీవకి అర్థం కాదు. ఎలాంటి ఆధారాలు లభించకపోయినా, ఆ సైకో కిల్లర్ గురించి గాలించడం మొదలుపెడతాడు. అసలు ఆ సైకో కిల్లర్ ఎలా ఉంటాడు? హత్యలు చేయడానికి ఎవరిని ఎలా ఎంచుకుంటున్నాడు? శరీరం నుంచి తలను వేరు చేసి .. జంతువుల ‘తల’ను తగిలించే ఈ కార్యక్రమాన్ని అతను ఎక్కడ చేస్తున్నాడు? అనే విషయాన్ని కనుక్కోవడానికి హయగ్రీవ ఒక ప్లాన్ చేస్తాడు. అదేమిటి? తన కోసం హయగ్రీవ తీవ్రంగా గాలిస్తున్నాడని తెలుసుకున్న ఆ సైకో ఏం చేస్తాడు? అసలు అతను ఇదంతా ఎందుకు చేస్తున్నాడు? అనే ఆసక్తికరమైన అంశాలతో కూడుకున్న కథ ఇది.

పిల్లలు ఎదుగుతున్నప్పుడే వాళ్ల ప్రవర్తనను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలి. ఏ విషయాన్ని వాళ్లు ఎలా తీసుకుంటున్నారు? ఎలా ఆలోచిస్తున్నారు? అనేది పరిశీలన చేస్తూ ఉండాలి. లేదంటే ఇతరులకంటే తేడాగా తాము ఆలోచన చేస్తున్నామనే విషయం మరిచిపోయి, తాము నమ్మినదే చేస్తూ సైకోలుగా మారిపోతారు. అలాంటి ఒక సైకో కిల్లర్ చుట్టూ తిరిగే కథ ఇది. అతణ్ణి పట్టుకోవడానికి పరిగెత్తే ఒక పోలీస్ ఆఫీసర్ కథ ఇది. ధైర్యవంతుడైన ఒక సిన్సియర్ పోలీస్ ఆఫీసర్ .. భయమనేది తెలియని ఒక ‘సైకో పాత్’ చుట్టూ దర్శకుడు ఈ కథను అల్లుకుంటూ వెళ్లాడు. సైకోలు ఎలాంటి ప్రత్యేకతలతో కనిపించరు. చాలా సాధారణంగా కనిపిస్తూనే, దారుణాలకు పాల్పడుతూ ఉంటారు. అందువలన వాళ్లను గుర్తించడానికీ .. పట్టుకోవడానికి పోలీసులు నానా అవస్థలు పడుతుంటారు. ఈ కథ కూడా అదే పద్ధతిలో నడుస్తుంది. ఇక ఒక వ్యక్తి సైకోగా మారిపోవడానికి వెనుక ఒక బలమైన కారణం ఉంటుంది. అలాంటి ఒక కారణం ఈ సినిమాలో ఫ్లాష్ బ్యాక్ గా వస్తుంది. కారణంగా అంత బలంగా లేని ఈ ఎపిసోడ్, ఓ మాదిరిగా అనిపిస్తుంది. ఇక సైకో ఎటాక్ చేయడం .. హత్యలు చేయడం వంటి సన్నివేశాలు పరమ రొటీన్ గా అనిపిస్తాయి. పోస్టుమార్టం టేబుల్ పై శవాలను .. తలలేని మొండాలను క్లోజప్ లో చూపించడం కాస్త ఇబ్బంది పెడుతుంది. ఇలాంటి కథల్లో అసలు ఈ హత్యలు ఎవరు చేస్తున్నారనేది దర్శకుడు రివీల్ చేసేవరకూ ఆడియన్స్ కి తెలియకూడదు. కానీ దర్శకుడు ముందుగానే చూపించిన ఒక్క సీన్ వలన ఆ ఇంపాక్ట్ పోయిందని అనిపిస్తుంది. ఒక రకంగా అది స్క్రీన్ ప్లే లోని లోపంగానే చెప్పుకోవాలి. ఆయా పాత్రలను ఆడియన్స్ అనుమానించేలా ఆ పాత్రలతో ఒక చిన్న ‘లుక్’ ఇప్పించడం సిల్లీగా అనిపిస్తుంది. కథ పాతదే .. కథనం కూడా పాత పద్ధతిని ఫాలో అయిందే. పోలీస్ ఇన్వెస్టిగేషన్ కి సంబంధించిన హడావిడి లేకుండా తాపీగా నడవడమే ఈ కథలోని లోపాలలో ముఖ్యమైనదిగా చెప్పుకోవాలి. ప్రీ క్లైమాక్స్ .. క్లైమాక్స్ సమయాలలోను కథనం వేగాన్ని పుంజుకోలేదు. కథను పురాణాలతో లింక్ చేసిన తీరు కొత్తగా అనిపిస్తుంది గానీ .. దానిని కనెక్ట్ చేయలేకపోయారు. ధన్వీర నటన బాగానే ఉంది. సంజనా ఆనంద్ చేయడానికేమీ లేదు. సైకో పాత్రను పోషించిన ఆర్టిస్ట్ నటన ఫరవాలేదు. మిగతా పాత్రలకు ఎలాంటి ప్రాధాన్యత లేదు. గిరీశ్ గౌడా ఫొటోగ్రఫీ బాగుంది. జుదా శాండీ సంగీతం ఓ మాదిరిగా అనిపిస్తుంది. ప్రకాశ్ ఎడిటింగ్ ఫరవాలేదు. ఒక సైకో .. అతణ్ణి ప్రభావితం చేసే ఒక ఫ్లాష్ బ్యాక్ .. ఆ సైకోను పట్టుకోవడానికి పోలీస్ ఆఫీసర్ డిజైన్ చేసే వ్యూహాలు .. చివరికి ఉచ్చులో పడేలా చేయడం .. వంటి కథలతో గతంలో చాలానే కథలు వచ్చాయి. ఆ కథలకు ఏ మాత్రం భిన్నంగా లేని సినిమా ఇది. రొటీన్ కథను రొటీన్ గానే చెప్పిన కంటెంట్ ఇది.

## హీరో విజయ్‌తో రిలేషన్ రూమర్స్..

### పరోక్షంగా కౌంటర్ ఇచ్చిన నటి త్రిష!



తమిళనాడు సీఎం, కోలీవుడ్ స్టార్ హీరో విజయ్‌తో నటి త్రిష రిలేషన్‌లో ఉన్నారంటూ వస్తున్న వార్తలు కొన్ని రోజులుగా సినీ, రాజకీయ రంగాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. సాధారణంగా తన వ్యక్తిగత విషయాలపై వచ్చే రూమర్లపై స్పందించని త్రిష, తాజాగా సోషల్ మీడియా వేదికగా పరోక్షంగా స్పందించారు. తన పెంపుడు కుక్క ఫొటోను షేర్ చేస్తూ.. “నా వ్యక్తిగత విషయాల్లో తలదూర్చడానికి దీన్ని మాత్రమే అనుమతిస్తాను” అంటూ ఆసక్తికరమైన క్యాప్షన్ పెట్టారు. నేరుగా ఎవరి పేరు ప్రస్తావించకపోయినప్పటికీ, తనపై అసత్య ప్రచారాలు చేస్తున్న వారికి కౌంటర్‌గానే ఈ పోస్ట్ పెట్టారని అభిమానులు భావిస్తున్నారు.మరోవైపు, మే నెల జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ త్రిష చేసిన “మ్యాజికల్ మే” పోస్ట్ కూడా నెట్టింట వైరల్ అవుతోంది. ఈ ఏడాది మే నెలను తలచుకున్నప్పుడల్లా తన ముఖంపై చిరునవ్వు వస్తూనే ఉంటుందని ఆమె పేర్కొన్నారు. మే నెలలోనే త్రిష పుట్టినరోజు ఉండడం, అదే సమయంలో తన ఆప్తమిత్రుడు విజయ్ తమిళనాడు ఎన్నికల్లో ఘన విజయం సాధించి సీఎం కావడం విశేషం. దీనికి తోడు ఆమె నటించిన ‘కరుప్పు’ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ హిట్‌గా నిలిచి 348 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. ఈ వరుస విజయాల వల్లే ఆమె ఈ పోస్ట్ పెట్టారు.

### కృష్ణ ఫ్యాన్స్‌ను మెప్పిస్తున్న

## కుర్రాడి కటౌట్!

తెలుగు ఇండస్ట్రీ ఎప్పటికీ మరిచిపోలేని హీరో కృష్ణ. ఆయన చేసిన సినిమాలే కాదు .. సాహసోపేతమైన నిర్ణయాలు .. ప్రయోగాలు అలా మైలురాళ్లను సెట్ చేసి పెట్టాయి. ఆ ఫ్యామిలీ నుంచి వచ్చిన మహేశ్ బాబు మరో సూపర్ స్టార్ గా తన హవా కొనసాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో మహేశ్ బాబు అన్న రమేశ్ బాబు కొడుకు ‘జయకృష్ణ’ కూడా హీరోగా ఎంట్రీ ఇవ్వడానికి రెడీ అవుతున్నాడు. ‘శ్రీనివాస మంగాపురం’ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. ‘ RX 100’ సినిమాతో ఒక భారీ హిట్ ఇచ్చిన అజయ్ భూపతి, ఆ తరువాత కూడా తన మార్క్ సినిమాలను ఆడియన్స్ కి పరిచయం చేశాడు. ఆయన దర్శకత్వం వహించిన ‘శ్రీనివాస మంగాపురం’ సినిమాతో జయకృష్ణ హీరోగా



పరిచయమవుతున్నాడు. యాక్షన్ తో కూడిన రొమాంటిక్ లవ్ స్టోరీ ఇది. రీసెంటుగా వదిలిన ఈ సినిమా ‘గ్లింప్స్’ చూసినవాళ్ల నుంచి జయకృష్ణకి మంచి మార్కులే పడుతున్నాయి. కటౌట్ కరెక్టుగానే ఉందని చెప్పుకుంటున్నారు. సైడ్ నుంచి అచ్చు రమేశ్ బాబులా కనిపిస్తున్న జయకృష్ణ, నటన పరంగా తనదైన ప్రత్యేకతను చాటుకుంటాడేమో చూడాలి. ఈ సినిమాతో రవీనా టాండన్ కూతురు ‘రషా థడాని’ హీరోయిన్ గా పరిచయమవుతోంది. బాలీవుడ్ బ్యూటీ అనిపించుకున్న రవీనాకి తెలుగులో ‘బంగారు బుల్లోడు’ .. ‘రథసారథి’ వంటి హిట్స్ ఉన్నాయి. ఇక ఇప్పటి యూత్ ను అలరించడానికి రషా థడాని సిద్ధమవుతోంది. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతాన్ని సమకూర్చిన ఈ సినిమా, జులై 9వ తేదీన ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సినిమాతో ఈ కొత్త జంట దూసుకుపోతుందేమో చూడాలి.

## నీ అందంతో సినిమాను ప్రమోట్ చెయ్..

### ‘నేషనల్ క్రష్’ నటికి కంగనా ఫన్నీ సలహా



బాలీవుడ్ ఫైర్ బ్రాండ్ కంగనా రనౌత్ తన సహనటికి సరదాగా ఓ సలహా ఇచ్చారు. ‘భారత్ భాగ్య విధాత’ అనే తమ కొత్త సినిమా ప్రమోషన్‌లో భాగంగా, నటి గిరిజా ఓక్‌ను ఉద్దేశించి “నీ దాన్ని ఉపయోగించి మన సినిమాను ప్రమోట్ చెయ్యి” అంటూ చమత్కరించారు. ఇటీవల ‘నేషనల్ క్రష్’గా సోషల్ మీడియాలో వైరల్ అయిన గిరిజా, ఆ ట్యాగ్‌పై తన అభిప్రాయం వ్యక్తం చేస్తున్న సమయంలో కంగనా ఈ వ్యాఖ్యలు చేశారు.‘భారత్ భాగ్య విధాత’ సినిమా ప్రమోషన్ కోసం ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో గిరిజా ఓక్ సోషల్ మీడియా పాపులారిటీపై చర్చ జరిగింది.

గతేడాది ఓ పాడ్‌కాస్ట్‌కు సంబంధించిన క్లిప్‌లో గిరిజా నీలం రంగు చీరలో కనిపించారు. ఆ వీడియో ఇంటర్నెట్‌లో విపరీతంగా వైరల్ అవ్వడంతో, నెటిజన్లు ఆమెను ‘బ్లూ శారీ గర్ల్’ అని, ‘నేషనల్ క్రష్’ అని పిలవడం ప్రారంభించారు.

ఈ విషయం ప్రస్తావనకు రాగానే, కంగనా కూడా “ఆ బ్లూ శారీ సంగతేంటి? నేను కూడా విన్నాను” అని ఆసక్తిగా అడిగారు.తనకు వచ్చిన ఈ గుర్తింపుపై గిరిజా ఓక్ వినమ్రంగా స్పందించారు. “ఆ వీడియో ఎందుకు వైరల్ అయిందో నాకు అర్థం కాలేదు. అందులో ఎలాంటి లాజిక్ లేదు. చాలా మంది నా అందం గురించి కామెంట్లు చేశారు.

కానీ, నా రూపం నా ఘనత కాదు. అది నా జన్యువుల వల్ల వచ్చింది. నా అందంలో నేను సంపాదించుకున్నది ఏమీ లేదు” అని ఆమె వివరించారు.గిరిజా సమాధానం విన్న కంగనా, “నువ్వు నా సినిమాలో ఉన్నందుకు చాలా సంతోషంగా ఉంది. దయచేసి నీ అందాన్ని ఉపయోగించి సినిమాను ప్రమోట్ చెయ్యి” అని నవ్వుతూ అన్నారు. దీనిపై గిరిజా స్పందిస్తూ, “దేనికైనా ‘నేషనల్’ అని గుర్తింపు రావాలంటే సర్టిఫికెట్ ఉండాలి. కంగనాకు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం సబబే. కానీ నన్ను ‘నేషనల్ క్రష్’ అనడంలో ఎలాంటి ప్రామాణికత లేదు” అని స్పష్టం చేశారు.మనోజ్ తపాడియా దర్శకత్వం వహించిన ‘భారత్ భాగ్య విధాత’ చిత్రం జూన్ 12న థియేటర్లలో విడుదల కానుంది. ఈ సినిమాలో కంగనా రనౌత్, గిరిజా ఓక్‌లతో పాటు స్మితా తాంబే, ఇషా దే, ప్రియా బెర్డే, ఆశా షెలార్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.


## ప్రేమకథలో కొత్త మలుపు



గాయని సునీత తనయుడు ఆకాష్ హీరోగా నటిస్తున్న చిత్రం ‘కొత్త మలుపు’. శివవరప్రసాద్ కేశనకుర్తి దర్శకుడు. భైరవి అర్థ్యా కథానాయికగా నటిస్తున్నది. ఈ నెల 12న ప్రేక్షకుల ముందుకురానుంది. మైత్రీ మూవీ మేకర్స్ రిలీజ్ చేస్తున్నది. సోమవారం ట్రైలర్‌ను ఆవిష్కరించారు. గ్రామీణ నేపథ్యంలో రూపొందిన ఈ సినిమాలో ప్రేమ, వినోదం, సస్పెన్స్ సమపాళ్లలో ఉంటాయని, నాయకానాయికలు బావామరదళ్లుగా కనిపిస్తారని దర్శకుడు తెలిపారు. తెరపై కోనసీమ అందాలను ఆవిష్కరిస్తూ చక్కటి వినోదంతో ఆకట్టుకుంటుందని నిర్మాత పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సీనియర్ నటుడు భానుచందర్, గాయని సునీత, నిర్మాత సి.కల్యాణ్ తదితరులు అతిథులుగా హాజరయ్యారు. ఈ చిత్రానికి కెమెరా: సుమంత్ కాచర్ల, జవహర్ రెడ్డి, సంగీతం: యశ్వంత్‌నాగ్, దర్శకత్వం: శివ వరప్రసాద్ కేశనకుర్తి.

## దుష్టశిక్షణలో స్వయంభూ

నిఖిల్ కథానాయకుడిగా నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా ‘స్వయంభూ’. భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్నారు. సోమవారం హీరో నిఖిల్ పుట్టినరోజు సందర్భంగా స్పెషల్ వీడియోను విడుదల చేశారు. ఇందులో యుద్ధవీరుడి పాత్ర కోసం నిఖిల్ చేసిన కఠోర శ్రమను చూపించారు. ఈ సినిమా కోసం నిఖిల్ ప్రొఫెషనల్ ట్రెయినర్ల పర్యవేక్షణలో కత్తియుద్ధం, మార్షల్ ఆర్ట్స్ వంటి విద్యల్లో శిక్షణ తీసుకున్నారని మేకర్స్ తెలిపారు.వీడియో చివరలో చూపించిన విజువల్స్ ఆకట్టుకున్నాయి. వీటిలో యుద్ధ కవచం ధరించిన నిఖిల్ శత్రువులపై విరుచుకుపడటం, అగ్ని జ్వాలల మధ్య పోరాటాలు రోమాంఛితంగా అనిపించాయి. ఈ సినిమాలో నిఖిల్..చోళ యుద్ధ వీరుడి పాత్రలో కనిపించనున్నారని సమాచారం. ఓ సామాన్యుడు చారిత్రక పురుషుడిగా మారే వైనం కథలో ఆసక్తికర అంశమని చెబుతున్నారు. త్వరలో పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా విడుదలకానుంది. సంయుక్త, నభానటేష్ తదితరులు కీలక పాత్రల్ని పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: రవి బస్రూర్, నిర్మాతలు: భువన్, శ్రీకర్, రచన-దర్శకత్వం: భరత్ కృష్ణమాచారి.



## తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఎస్వీ కృష్ణారెడ్డి

సకుటుంబ కథాచిత్రాల దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి దర్శకత్వంలో వస్తున్న 43వ సినిమా ‘వేదవ్యాస్’. కె.అచ్చిరెడ్డి సమర్పణలో కొమ్మూరి ప్రతాపరెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రం ద్వారా పిడుగు విశ్వనాథ్ హీరోగా పరిచయం అవుతున్నారు. కొరియన్ నటి జూన్‌హ్యాంజీ, మంగోలియన్ నటుడు షరన్ బోల్డ్ సెగ్మెంట్ తెలుగు ప్రేక్షకులకు పరిచయం అవుతున్నారు. సోమవారం ఎస్వీకృష్ణారెడ్డి 75వ పుట్టినరోజు సందర్భంగా హైదరాబాద్‌లో వేడుకలను నిర్వహించారు. ఇందులో భాగంగా ‘వేదవ్యాస్’ సినిమా మేకింగ్ వీడియోను లాంచ్ చేశారు. వీటితోపాటు 38 చిత్రాలకు సంగీత దర్శకత్వం వహించిన దర్శకుడిగా ఎస్వీ కృష్ణారెడ్డికి ‘తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్’ నుంచి వరల్డ్ రికార్డ్ గుర్తింపు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్వీకృష్ణారెడ్డితో తమకున్న అనుబంధాన్ని కె.అచ్చిరెడ్డి గుర్తు చేసుకున్నారు. నిర్మాత కొమ్మూరి ప్రతాపరెడ్డి ఈ సినిమాలో భాగమైనందుకు సంతోషం వెలిబుచ్చారు.



# డీఎస్సీ వార్ - వైసీపీ వర్సెస్ లోకేష్..

**విజయవాడ,(భారత శక్తి)** ఆంధ్రప్రదేశ్‌లో మెగా డీఎస్సీ-2025 నియామకాల చుట్టూ ఇప్పుడు రాజకీయ యుద్ధం ముదిరింది. వైఎస్సార్‌సీపీ ఈ ప్రక్రియలో భారీ కుంభకోణం జరిగిందని ఆరోపిస్తుండగా, ప్రభుత్వం, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈ ఆరోపణలను తోసిపుచ్చుతూ ఎదురుదాడికి దిగారు. అయితే ఎదురుదాడి కాదని వైసీపీ చేస్తున్న ఆరోపణలకు క్లారిటీ ఇవ్వాల్సిన అవసరం కనిపిస్తోంది. ఏపీలో ఉపాధ్యాయ నియామకాల కోసం నిర్వహించిన మెగా డీఎస్సీ ఒక మెగా స్కామ్ అని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రశ్నపత్రాల లీకేజీ, మెరిట్ జాబితాలో అక్రమాలు, స్పోర్ట్స్ కోటా కింద పోస్టుల విక్రయం వంటివి జరిగాయని ఆయన వాదిస్తున్నారు. ముఖ్యంగా ఎస్సీఈఆర్టీ లో పనిచేసిన ఒక అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి స్టేట్ టాపర్‌గా రావడం వెనుక లోతైన కుట్ర ఉందని, దీనిపై సిట్టింగ్ జడ్జితో లేదా సీబీఐతో విచారణ జరిపించాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. వైసీపీ ఆరోపణలను ప్రభుత్వం మంత్రి నారా లోకేష్ తీవ్రంగా ఖండించారు. గత ఐదేళ్ల పాలనలో ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయని జగన్‌కు, తమను విమర్శించే నైతిక హక్కు లేదని లోకేష్ మండిపడ్డారు. కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానంలో ప్రశ్నపత్రం లీకేజీ అనేది సాంకేతికంగా అసాధ్యమని విద్యాశాఖ వివరణ ఇచ్చింది. సుమారు 16,347 పోస్టులను కేవలం 148 రోజుల్లోనే అత్యంత పారదర్శకంగా భర్తీ చేశామని, నియామక ప్రక్రియపై న్యాయస్థానాలు కూడా క్లీన్ చిట్ ఇచ్చాయని మంత్రి గుర్తు చేశారు. వైసీపీ కోరుతున్నట్లుగా సీబీఐ విచారణ జరిపే ఉద్దేశ్యం ప్రభుత్వానికి లేనట్లు తెలుస్తోంది. పైగా, ప్రభుత్వంపై బురద చల్లేందుకు తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై క్రిమినల్ కేసులు పెడతామని విద్యాశాఖ హెచ్చరించింది. అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిపై ఇప్పటికే చర్యలు తీసుకున్నామని, మెరిట్ జాబితాలను ఆన్‌లైన్‌లో అందరికీ అందుబాటులో ఉంచామని అధికారులు స్పష్టం చేశారు. తప్పుడు వార్తలు వ్యాప్తి చేసే సోషల్ మీడియా హ్యాండిల్స్ , మీడియా సంస్థలకు డెఫమేషన్ నోటీసులు ఇస్తామని కూడా ప్రభుత్వం హెచ్చరించింది. ఈ వివాదం ఇప్పుడు నిరుద్యోగ యువతలో చర్చకు దారితీస్తోంది. వైసీపీ తన ఆరోపణల ద్వారా ప్రభుత్వంపై వ్యతిరేకత పెంచాలని చూస్తుంటే, లోకేష్ మాత్రం జాబ్ క్యాలెండర్ అమలు ద్వారా యువతకు భరోసా ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఒక్క అక్రమం జరిగిందని నిరూపిస్తే రాజీనామాకు సిద్ధం అని లోకేష్ సవాల్ విసరడం ద్వారా ప్రభుత్వం తన పారదర్శకతపై నమ్మకంగా ఉన్నట్లు కనిపిస్తోంది. చివరగా చెప్పాలంటే, వైసీపీ ఈ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి ఉద్యమించాలని చూస్తుంటే.. ప్రభుత్వం మాత్రం రికార్డు స్థాయి సమయంలో నియామకాలు పూర్తి చేశామనే అంశాన్ని తన విజయంగా చెప్పుకుంటోంది. విచారణ సంగతి ఎలా ఉన్నా, ఈ డీఎస్సీ వార్ మాత్రం ఇరు పార్టీల మధ్య యుద్ధాన్ని మరింత వేడెక్కించింది.

## వైసీపీ బిగ్ ప్లాన్

వస్తే కొండ.. పోతే ఈక.. అన్నట్టు ఆలోచనతో ఉంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. మెగా డీఎస్సీ 2025 పై భారీగానే ప్లాన్ చేసింది ఆ పార్టీ. ఏడాది తరువాత అక్రమాలు జరిగాయి అంటూ ఆరోపణలు చేస్తోంది. కేవలం ఆరోపణలకు మాత్రమే పరిమితం అవుతోంది. ఎక్కడ న్యాయపోరాటం చేయడం లేదు. దీని వెనుక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పక్కా స్కెచ్ అర్థం అవుతోంది. కేవలం రాష్ట్రంలో లక్షలాది ఓట్లను టార్గెట్ చేసుకునే ఈ కొత్త ప్రచారానికి తెర తీసింది. పోతే వేల ఓట్లు.. వస్తే లక్షల కోట్లు అన్నట్టు ఆలోచన చేసింది. గట్టిగానే ప్రణాళిక వేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తోంది. సాక్షి మీడియాలో వ్యతిరేక కథనాలు వడ్డిస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో ఒక్క ఉపాధ్యాయ పోస్ట్ కూడా భర్తీ చేయలేదు. కనీసం అటువంటి ఆలోచన చేయలేదు. అధికారంలోకి వస్తే ఏటా మెగా డీఎస్సీ ప్రకటిస్తామని 2019 ఎన్నికల్లో హామీ ఇచ్చారు జగన్. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయ శిక్షణ పొందిన లక్షలాదిమంది ఆశగా ఎదురు చూశారు. కానీ వారికి అవకాశం ఇవ్వలేదు జగన్. 2024 ఎన్నికలకు నెల రోజుల ముందు 6100 ఉపాధ్యాయ పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారు. ఇంతలోనే ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో డీఎస్సీ రద్దయింది. దీంతో లక్షలాదిమందికి ఎదురుచూపులు మిగిలిపోయాయికూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ ఫైల్ పై సంతకం చేశారు సీఎం చంద్రబాబు. నారా లోకేష్ నేతృత్వంలో డీఎస్సీ నియామక ప్రక్రియ గడువులోగా పూర్తి చేయగలిగారు. గత ఏడాది ఉపాధ్యాయులను నియమించారు. అయితే కూటమికి అదో ప్లస్ పాయింట్ గా మారింది. ఉపాధ్యాయ వర్గాల్లో కూడా సంతృప్తి కనిపిస్తోంది. అయితే ఇది అంత మాత్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి రుచించలేదు. అందుకే కొత్త ప్రణాళిక వేసింది. డీఎస్సీలో అక్రమాలు జరిగాయి అంటూ జగన్మోహన్ రెడ్డి ఆరోపణలు చేయడం ప్రారంభించారు. ఏదైనా నియామక ప్రక్రియ పై ఆరోపణలు వస్తే వెంటనే కోర్టుకు వెళ్లాలి. కానీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అలా చేయలేదు. ఎందుకంటే డీఎస్సీలో ఎటువంటి అక్రమాలు జరగలేదు. ఆ విషయం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి కూడా తెలుసు. బాధితుల పక్షాన న్యాయ పోరాటం చేయడం కంటే దీనిని రాజకీయం చేయడానికి ఎక్కువగా వాడుకుంటుంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ.దాదాపు ఆరు లక్షల మంది డిఎస్సీ పరీక్ష రాశారు. అందులో 16 వేల మందికి ఉద్యోగాలు వచ్చాయి. కానీ అభ్యర్థుల్లో ఒక రకమైన గందరగోళం సృష్టించాలన్నది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆలోచన. పోతే 16,000 ఓట్లు.. వస్తే లక్షల ఓట్లు అన్నది ఆ పార్టీ ఆలోచన. ఎలాంటి ప్రభుత్వ ఉద్యోగానికైనా రిజర్వేషన్లు అమలు చేయాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి కూడా తెలుసు. కుల రిజర్వేషన్లతో పాటు దివ్యాంగులకు కొన్ని పోస్టులు కేటాయించాలి. ప్రభుత్వం పూర్తి పారదర్శకంగా అలానే చేసింది. నిన్ననే విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్ పూర్తి క్లారిటీ ఇచ్చారు. సుదీర్ఘ వివరణ ఇచ్చారు. సాక్షి మీడియాలో డీఎస్సీ అక్రమాలంటూ వచ్చిన కేస్ స్టడీ పై కూడా స్పష్టతనిచ్చారు. అయితే ఇదంతా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి తెలియనిది కాదు. డీఎస్సీ పై బురద జల్లి ప్రభుత్వానికి క్రెడిట్ రాకుండా చేయాలి. డీఎస్సీలో ఉద్యోగం రాని వారికి అనుమానం పెంచి వారిని తమ వైపునకు తిప్పుకోవాలి. అంతకుమించి ఏమీ కనిపించడం లేదు కూడా ఇందులో.

# రాపాక, ఆమంచి దారెటు...

**రాజమండ్రి (భారత శక్తి)**ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పార్టీలు మారడం కొత్త విషయం కాదు. పరిస్థితులకు అనుగుణంగా నాయకులు తమ రాజకీయ భవిష్యత్తును నిర్ణయించుకుంటూ ఉంటారు. అయితే కొందరు నేతల విషయంలో ప్రస్తుతం వారు ఏ పార్టీలో ఉన్నారనే సందేహమే రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీస్తోంది. ముఖ్యంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా, ఉమ్మడి ప్రకాశం జిల్లాలకు చెందిన ఇద్దరు ప్రముఖ నాయకుల రాజకీయ ప్రయాణం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.రాజోలు నియోజకవర్గానికి చెందిన రాపాక వరప్రసాద్ రాజకీయ ప్రస్థానం గత కొన్నేళ్లుగా అనేక మలుపులు తిరిగింది. 2019 ఎన్నికల్లో జనసేన తరఫున పోటీ చేసి విజయం సాధించిన ఏకైక అభ్యర్థిగా ఆయన గుర్తింపు పొందారు. ఆ ఎన్నికల్లో జనసేనకు పెద్దగా విజయాలు రాకపోయినా, రాపాక మాత్రం తన స్థానాన్ని నిలబెట్టుకున్నారు. అయితే ఎన్నికల తర్వాత రాజకీయ పరిస్థితులు మారడంతో ఆయన వైసీపీ కి దగ్గరయ్యారు.కాలక్రమేణా వైసీపీతో ఆయన అనుబంధం మరింత బలపడింది. గత ఎన్నికల్లో పార్టీ అధిష్ఠానం ఆయనకు పార్లమెంట్ టికెట్ కూడా ఇచ్చింది. కానీ రాష్ట్రవ్యాప్తంగా కూటమిప్రభావం ఎక్కువగా ఉండటంతో ఆయనకు ఆశించిన ఫలితం దక్కలేదు. ఎన్నికల తర్వాత వైసీపీ కూడా అధికారాన్ని కోల్పోవడంతో రాపాక రాజకీయ వైఖరిపై మళ్లీ చర్చ మొదలైంది.కొంతకాలంగా ఆయన తిరిగి జనసేనలో చేరే ప్రయత్నాలు చేస్తున్నారనే ప్రచారం రాజకీయ వర్గాల్లో వినిపించింది. ఈ నేపథ్యంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కూడా పార్టీని వదిలి వెళ్లిన నాయకుల పునరాగమనంపై పరోక్ష వ్యాఖ్యలు చేశారు. అయితే రాపాక పేరు నేరుగా ప్రస్తావించకపోయినా, ఒకసారి పార్టీని వీడిన వారిని తిరిగి చేర్చుకునే విషయంలో జాగ్రత్తగా వ్యవహరిస్తామని సంకేతాలు ఇచ్చారు. ప్రస్తుతం రాపాక వైసీపీకి దూరంగా ఉంటున్నప్పటికీ, భవిష్యత్తులో ఆయన ఎలాంటి రాజకీయ నిర్ణయం తీసుకుంటారనే ఆసక్తి కొనసాగుతోంది.ఇక చీరాల నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకుడు ఆమంచి కృష్ణమోహన్ పరిస్థితి కూడా దాదాపు ఇదే విధంగా ఉంది. ఒకప్పుడు వైసీపీలో కీలక నేతగా ఉన్న ఆయన, తరువాత కాంగ్రెస్ లో చేరి గత ఎన్నికల్లో పోటీ చేశారు. అయితే ఎన్నికల్లో ఓటమి తర్వాత ఆయన రాజకీయ కార్యకలాపాలు గణనీయంగా తగ్గాయి. కాంగ్రెస్ కార్యక్రమాల్లో కూడా పెద్దగా కనిపించకపోవడంతో ఆయన భవిష్యత్తుపై అనేక ఊహాగానాలు మొదలయ్యాయి. తిరిగి వైసీపీలో చేరే అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరుగుతున్నప్పటికీ, దీనిపై ఆమంచి ఇప్పటివరకు స్పష్టత ఇవ్వలేదు. దీంతో ఆయన తదుపరి అడుగు ఏమిటన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తికర అంశంగా మారింది. రాబోయే ఎన్నికలకు ఇంకా సమయం ఉన్న నేపథ్యంలో ఈ ఇద్దరు నాయకులు తమ రాజకీయ భవిష్యత్తును ఎలా మలుచుకుంటారన్నది చూడాల్సి ఉంది. ప్రస్తుతం మాత్రం వారు ఏ రాజకీయ శిబిరానికి పూర్తిగా దగ్గరగా ఉన్నారో స్పష్టత లేకపోవడం చర్చనీయాంశంగా మారింది.

### వాస్తవాలకు దూరంగా

# నివేదికలు

**విజయవాడ (భారత శక్తి)**ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు అధికారులు ఇస్తున్న క్షేత్ర స్థాయి నివేదికలపై పార్టీ నేతలే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడుస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులపై వాస్తవాలను ముఖ్యమంత్రి చంద్రబాబు ముందు ఉంచడం లేదు. చంద్రబాబు జిల్లా పర్యటనల్లోనూ, ప్రతి మూడు నెలలకు ఒకసారి జరిపే జిల్లా కలెక్టర్ సమావేశంలోనూ నిజాలను దాచిపెట్టి ఆల్ ఫీల్ గుడ్ అంటూ చెబుతుండటంతో దానిని ఆయన నమ్మేస్తున్నారంటున్నారు. గ్రౌండ్ లెవెల్లో ప్రజలు కూటమి సర్కార్ పట్ల తెలియజేస్తున్న అభిప్రాయాన్ని మాత్రం దాచి పెడుతున్నారు.చంద్రబాబు అయినా, జగన్ అయినా అధికారులపై ఆధారపడక తప్పదు. ఐఏఎస్, ఐపీఎస్ లు పాలనపరంగా కీలకం కావడంతో వారిపై ఆధారపడాల్సి ఉంటుంది. అయితే అదే సమయంలో వాస్తవ విషయాలను, క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందన్న విషయాలను ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించాలి. ఎమ్మెల్యేల పనితీరును కూడా పార్టీ కేంద్ర కార్యాలయం సిబ్బంది నుంచి అడిగి తెలుసుకోవడమేంటని ప్రశ్నిస్తున్నారు. కొందరు సీనియర్ ఎమ్మెల్యేలు టీడీపీలో ఇప్పటికీ ఉన్నారు. గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ధూళిపాళ్ల నరేంద్ర, కళా వెంకట్రావు వంటి వారితో ముఖాముఖి సమావేశమైతే వారు అసలు విషయాలను చెబుతారంటున్నారు.మరొకవైపు జిల్లాల పర్యటనకు వెళ్లినప్పుడు కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి తాము క్యాడర్ కు అండగా ఉంటామని చెబుతున్నారు. కానీ అదే సమయంలో వారి నుంచి ఎలాంటి ఫీడ్ బ్యాక్ తీసుకోవడం లేదు. దీనివల్ల చంద్రబాబుకు తప్పుడు నివేదికలు అందుతున్నాయని సీనియర్ నేతలే వాపోతున్నారు. ముఖ్యమంత్రిగా పాలనలో తలమునకలై ఉండవచ్చు. కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి వేగంగా తీసుకెళుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం అంత బాగా లేదని, సంక్షేమ పథకాలు కొందరు అర్హులకు కూడా అందకపోవడాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదని అంటున్నారు. మొత్తం మీద చంద్రబాబు తన పాలనలో ఏం జరుగుతుందన్న విషయాన్ని నేతల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవడం మంచిదని సూచిస్తున్నారు.

# సేనా గళంతో ప్లాన్

**ఒంగోలు** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ యువతను రాజకీయాల్లో మరింత చురుకుగా భాగస్వామ్యం చేయాలనే లక్ష్యంతో కీలక నిర్ణయం తీసుకున్నారు. పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయడంతో పాటు కొత్త తరం ఆలోచనలకు ప్రాధాన్యం కల్పించేందుకు “సేనా గళం” పేరుతో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. యువత ఆశయాలు, సామాజిక బాధ్యతలు, దేశాభివృద్ధి లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని ఈ వేదికను రూపొందిస్తున్నట్లు ఆయన తెలిపారు.ప్రస్తుతం దేశవ్యాప్తంగా జెన్-జీ తరం ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో, రాజకీయాల్లో కూడా యువత భాగస్వామ్యం పెరగాల్సిన అవసరం ఉందని పవన్ కళ్యాణ్ అభిప్రాయపడ్డారు. ఈ కొత్త కమిటీ ద్వారా సమాజంలో సానుకూల మార్పులు తీసుకురావాలని, రాజ్యాంగ విలువల పరిరక్షణతో పాటు బాధ్యతాయుత రాజకీయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన సూచించారు.నియోజకవర్గాల వారీగా సేనా గళం కమిటీలను ఏర్పాటు చేయాలని పార్టీ నాయకత్వానికి ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా 40 ఏళ్ల లోపు యువతకు ఈ కమిటీల్లో ఎక్కువ అవకాశాలు కల్పించాలని స్పష్టం చేశారు. యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు ప్రజా సమస్యలపై అవగాహన కల్పించడం కూడా ఈ కమిటీల ప్రధాన బాధ్యతగా ఉండనుంది. ఈ వేదికలో సభ్యత్వం పొందే వారికి కులం, మతం, ప్రాంతం వంటి అంశాలతో సంబంధం ఉండదని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. సమాజానికి సేవ చేయాలనే తపన, ప్రజల కోసం పనిచేయాలనే సంకల్పం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు. విద్యావంతులు మాత్రమే కాకుండా, సామాజిక బాధ్యతతో ముందుకు రావాలనుకునే ప్రతి యువకుడికి అవకాశం కల్పిస్తామని వెల్లడించారు.రాజకీయాల్లో కులపరమైన విభజనలు పెరుగుతున్నాయని, అనేక సందర్భాల్లో వ్యక్తిగత తప్పులను కూడా కులాల పేరుతో సమర్థించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని పవన్ కళ్యాణ్ విమర్శించారు. ఇలాంటి ధోరణులకు యువత వ్యతిరేకంగా నిలుస్తోందని, అదే భావజాలాన్ని సేనా గళం ప్రతిబింబిస్తుందని చెప్పారు. వ్యక్తుల చర్యలకు సమాజాన్ని బాధ్యులను చేయడం సరైన విధానం కాదని వ్యాఖ్యానించారు.పాత రాజకీయ సంస్కృతులకు భిన్నంగా కొత్త ఆలోచనలతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. సమాజంలో మార్పు తీసుకురావాలనే ఆలోచన కలిగిన వారికి జనసేనలో ప్రత్యేక స్థానం ఉంటుందని స్పష్టం చేశారు. అభ్యుదయ భావాలు, దేశభక్తి, సామాజిక చైతన్యం కలిగిన యువతను ఈ కార్యక్రమం ద్వారా ఒకే వేదికపైకి తీసుకురావాలనేది పార్టీ లక్ష్యమని వివరించారు.ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు పెంచుకోవడం, ప్రభుత్వ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరవేయడం, యువత సమస్యలను గుర్తించి వాటికి పరిష్కార మార్గాలు సూచించడం వంటి బాధ్యతలను సేనా గళం కమిటీలు నిర్వర్తించనున్నాయి. యువత ఆకాంక్షలు, ఆశయాలు, అభిప్రాయాలకు ప్రతినిధిగా ఈ వేదిక పనిచేస్తుందని పవన్ కళ్యాణ్ తెలిపారు. దీంతో జనసేన పార్టీ భవిష్యత్ రాజకీయ వ్యూహాల్లో యువతకు మరింత కీలక స్థానం దక్కనున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

పవన్ తన మార్క్ ను చూపించేందుకు రెడీ జనసేన అధినేత పవన్ కల్యాణ్ రూటు మార్చినట్లు కనిపిస్తుంది. కొంత కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించినట్లు ఆయన నిర్ణయం తీసుకున్నారు. ఉప ముఖ్యమంత్రిగా రెండేళ్లు పదవీ కాలం పూర్తి కావడంతో ఆయనకు పాలనపై కొంత వరకూ పట్టు సంపాదించారు. భవిష్యత్ లో ఏదైనా సమస్య ఎదురైతే కూటమి ప్రభుత్వంలో మిత్రపక్షంగా ఉన్న జనసేన కూడా రాజకీయంగా ఇబ్బంది పడాల్సి వస్తుందని ఆయన భావిస్తున్నట్లుంది. అందుకే నేరుగా రంగంలోకి దిగి ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు దుర్వినియోగం కాకుండా, పనుల్లో ఆలస్యం జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు తెలిసింది.తాజాగా రాజమండ్రి పర్యటనతో పవన్ కల్యాణ్ కూటమి పార్టీ నేతలకు పవన్ కల్యాణ్ ఈ రకమైన సంకేతాలను బలంగానే పంపగలిగారు. గోదావరి పుష్కరాలు 2027లో జరగనున్నాయి. 2027 జూన్ నెలలో ప్రారంభం కానున్న గోదావరి పుష్కరాలకు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు కొన్ని మంజూరయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం కూడా నిధులు మంజూరు చేసింది. పుష్కర ఘాట్ల నిర్మాణంతో పాటు భక్తులు ఇబ్బందులు పడకుండా అవసరమైన చర్యలు, రహదారి మరమ్మతులు వంటివి చేయాల్సి ఉంది. కానీ అధికారులు మాత్రం లైట్ గా తీసుకుంటున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు మాత్రం పనులు వేగంగా జరుగుతున్నాయని నమ్మబలికే ప్రయత్నం చేస్తున్నారు. కానీ గ్రౌండ్ లెవెల్లో పనుల పురోగతి ఆశించినంతగా లేదని పవన్ కల్యాణ్ గుర్తించారు.ఏడు వేల కోట్ల రూపాయల విలువైన పనులను ఏడాదిలో ఎలా పూర్తి చేస్తారంటూ పవన్ కల్యాణ్ సూటిగానే అధికారులను ప్రశ్నించారు. హడావిడిగా చివరి నిమిషంలో చేపట్టిన నిర్మాణాలు కూలిపోతే ఎన్డీఏ ప్రభుత్వానికి చెడ్డపేరు రాదా? అని అధికారులను నిలదీశారు. పనులు వేగంగా జరగకపోవడంపై తాను త్వరలో జరిగే ఏపీ మంత్రివర్గ సమావేశంలో చర్చిస్తామని పవన్ కల్యాణ్ అధికారులకు హెచ్చరికలు జారీ చేశారు. హడావుడి పనులతో భక్తుల ప్రాణాలతో చెలగాటం వద్దంటూ వార్నింగ్ ఇచ్చారు.మొత్తం మీద పవన్ కల్యాణ్ మాత్రం పాలనలో తన మార్క్ చూపించాలని నిర్ణయించుకున్నట్లు కనపడుతుంది.

# నాగబాబా... లింగమనేని

**విజయవాడ,(భారత శక్తి)** ఏపీలో రాజ్యసభ స్థానాల భర్తీకి నోటిఫికేషన్ వచ్చేసింది. నాలుగు స్థానాలకు ఎన్నిక జరగబోతుంది. ఇవన్నీ కూటమి పార్టీలకు దక్కబోతున్నాయ్. ఐతే పొత్తులో భాగంగా వీటిలో ఒక స్థానాన్ని జనసేనకు కేటాయించారు. దీంతో ఇప్పుడు ఆసక్తికర చర్చ మొదలైంది. జనసేన తరఫున మొదటిసారిగా రాజ్యసభలో అడుగు పెట్టబోయేది ఎవరు.. అవకాశం ఎవరికి దక్కబోతోందనే చర్చ పార్టీలో జరుగుతోంది.

జనసేనకు ఇది మొట్టమొదటి స్థానం కావడంతో.. పెద్దల సభకు పవన్ ఎవరిని పంపిస్తారు.. ఎలాంటి సమీకరణాలు లెక్కలోకి తీసుకుంటారనే ఆసక్తి పార్టీ వర్గాలతో పాటు పొలిటికల్ సర్కిల్స్‌లో ఆసక్తికర చర్చ కనిపిస్తోంది.రాజ్యసభ స్థానం విషయంలో పవన్ కల్యాణ్ భారీగా కసరత్తు చేస్తున్నారు. ఇక అటు ఈ ఒక్క స్థానం కోసం ఆశావహులు గట్టి ప్రయత్నాలే చేస్తున్నారు. ఇక అటు రేసులో కొందరి పేర్లు కీలకంగా వినిపిస్తున్నాయ్. ఆ లిస్టులో మొదటిగా వినిపిస్తున్న పేరు.. లింగమనేని రమేష్. పవన్‌తో పాటు చంద్రబాబు, నాదెండ్ల మనోహర్‌కు ఆయన అత్యంత సన్నిహితులు. పైగా కష్టకాలంలో పార్టీకి అన్ని రకాలుగా అండగా నిలిచారు. ఇవి లింగమనేని రమేష్‌కు కలిసి వచ్చే అంశాలు. జనసేనకు రాజ్యసభ అవకాశం ఎప్పుడు వచ్చినా.. లింగమనేని రమేష్‌కి ఇస్తారనే పార్టీలో దాదాపు అందరూ ఫిక్స్ అయిపోయిన పరిస్థితి. ఇక ఆయన కూడా చాలాకాలంగా ఈ అవకాశం కోసమే ఎదురుచూస్తున్నారని తెలుస్తోంది. పవన్ కూడా లింగమనేనికే దాదాపు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చే అవకాశాలు ఉన్నాయని పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.ఇక అటు లింగమనేనితో పాటు.. మరికొందరు కూడా రాజ్యసభ స్థానంపై ఆశలు పెట్టుకున్నారు. ఇందులో ప్రధానంగా నాగబాబు పేరు వినిపిస్తోంది. ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్న ఆయన.. ఎంపీగా వెళ్లాలని ఎప్పటినుంచో అనుకుంటున్నారు. గతంలో రాజ్యసభ స్థానాల ఎంపిక విషయంలో నాగబాబు పేరు వచ్చినా అది టీడీపీకి కేటాయించారు. దీంతో ఆయన ఎమ్మెల్సీగా సరిపెట్టుకున్నారు. పొత్తులో భాగంగా అనకాపల్లి ఎంపీ స్థానం త్యాగం చేయడం.. మంత్రి పదవి కూడా రాకపోవడంతో.. రాజ్యసభకు వెళ్లాలన్న కోరిక అయినా తీర్చుకోవాలని నాగబాబు అనుకుంటున్నారట. ఆయనకు కానీ రాజ్యసభ స్థానం దక్కితే.. నాగబాబు ఎమ్మెల్సీ స్థానాన్ని బాలినేనికి ఇచ్చే అవకాశాలు ఉన్నాయ్. నిజానికి బాలినేని కూడా చాలాకాలంగా ఎమ్మెల్సీ పదవి కోసం ఎదురుచూస్తున్నారు. నాగబాబును రాజ్యసభ పంపిస్తే ఇద్దరికీ అవకాశం ఇచ్చినట్లు అవుతుందనే చర్చ కూడా పార్టీ వర్గాల్లో వినిపిస్తోంది.ఈ ఇద్దరితో పాటు.. మరికొందరు పారిశ్రామికవేత్తలు, పార్టీలోనే ఉన్న సీనియర్ నిర్మాత ఒం రత్నం కూడా రాజ్యసభ స్థానం కోసం పవన్ దగ్గర ప్రయత్నాలు చేస్తున్నారట. ఐతే పవన్ మాత్రం.. పార్టీకి చాలా కాలంగా అండదండలు అందిస్తున్న లింగమనేని వైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. మరి ఆయన పేరే ఫైనల్ అవుతుందా.. ట్విస్టులు కనిపిస్తాయా.. రాజకీయ సమీకరణాలు మారతాయా అనేది చూడాలి.

# సింహపురి మాజీ మంత్రి మిస్సింగ్

**నెల్లూరు, (భారత శక్తి)** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చాలామంది నేతలు ఒక వెలుగు వెలిగారు. మంత్రి పదవులు దక్కించుకున్నారు. ఆర్థికంగా బలోపేతమైన వారు ఉన్నారు. అయితే పార్టీ కష్టకాలంలో ఉండగా చాలామంది నేతలు ఆ పార్టీకి గుడ్ బై చెప్పారు.. మరికొందరు ఫుల్ సైలెంట్ అయ్యారు. ఇప్పుడిప్పుడే యాక్టివ్ అవుతున్న వారు ఉన్నారు. కొడాలి నాని లాంటివారు ఇటీవల ముందుకు వచ్చారు. కూటమి ప్రభుత్వంపై సెటైర్లు వేశారు. కానీ మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ జాడ మాత్రం ఇంతవరకు లేదు. అందరూ నేతలు కనిపిస్తున్నా అనిల్ కుమార్ యాదవ్ ఎందుకో కనిపించడం లేదు. మొన్న కోఆర్డినేటర్ల సమావేశానికి సైతం హాజరు కాలేదు. అప్పుడప్పుడు నెల్లూరులో ప్రెస్ మీట్ పెట్టి కనిపించే ఆయన ఇప్పుడు బొత్తిగా జాడ లేకుండా పోయారు. అసలు ఆయన యాక్టివ్ అవుతారా లేదా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. లేకుంటే క్రమేపి పార్టీకి, రాజకీయాలకు దూరం అవుతారా అనే అనుమానాలు కూడా ఉన్నాయి.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓటమి తర్వాత ఆ పార్టీ శ్రేణులు తీవ్ర నైరాస్యంలో పడిపోయాయి. దీనికి తోడు పార్టీ నుంచి నేతలు బయటకు వెళ్లిపోయారు. ఉన్నవారు సైతం ఫుల్ సైలెంట్ అయ్యారు. దీంతో అధినేత జగన్మోహన్ రెడ్డి పార్టీని యాక్టివ్ చేసేందుకు చేయని ప్రయత్నం అంటూ లేదు. అయితే అధికారానికి దూరమై రెండేళ్లు అవుతున్న తరుణంలో కూటమి ప్రభుత్వంపై గట్టి ఆందోళనలకు పిలుపునిస్తున్నారు జగన్మోహన్ రెడ్డి. ఈనెల 4 నుంచి 12 వరకు వరుసగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఇటీవల తాడేపల్లి పార్టీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి టీడీపీ శ్రేణులు హాజరయ్యాయి. దాదాపు మాజీ మంత్రులతో పాటు నియోజకవర్గ ఇన్చార్జిలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. అయితే మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ జాడ మాత్రం లేదు.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఫైర్ బ్రాండ్ గా పేరు తెచ్చుకున్నారు అనిల్ కుమార్ యాదవ్. ఆయన ఒక్కడు మాత్రమే కాదు. పేర్ని నాని, కొడాలి నాని, అంబటి రాంబాబు, ఆర్కే రోజా, గుడివాడ అమర్నాథ్ లాంటివారు అప్పట్లో గట్టిగానే మాట్లాడేవారు. వారిపై బూతు అనే ముద్ర కూడా ఉంది. అయితే వైసిపి అధికారానికి దూరమైన తర్వాత చాలామంది నేతలు బయటకు వెళ్లిపోయారు. అయితే వైసీపీలో ఫైర్ బ్రాండ్ ముద్ర వేసుకున్న వారికి మాత్రం కూటమి పార్టీల్లో ఆప్షన్ లేదు. వేరే పార్టీల్లో అవకాసం లేదు. అందుకే అలానే ఉండిపోయారు. అయితే కొడాలి నాని లాంటి వారు కూడా అనారోగ్యానికి గురై తిరిగి యాక్టివ్ అవుతూ కనిపిస్తున్నారు. కానీ అనిల్ కుమార్ యాదవ్ మాత్రం అలా కాదు. ఆయన ఎందుకో మన రాష్ట్రంలో కూడా కనిపించడం లేదు.

పక్క రాష్ట్రంలో వ్యాపారాలు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. మొన్నటి ఎన్నికల్లో ఆయన నరసరావుపేట ఎంపీ స్థానం నుంచి పోటీ చేశారు. ఓటమి చవిచూశారు. కానీ ఆయన తిరిగి నెల్లూరు సిటీ నియోజకవర్గ బాధ్యతలను కోరుతున్నారు. జగన్మోహన్ రెడ్డి పట్టించుకోకపోవడంతోనే పక్క రాష్ట్రంలో వ్యాపారాలకు పరిమితం అవుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

# గోదావరి జిల్లాలో ఇల్లీగల్ దందా

**కాకినాడ(భారత శక్తి)** ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఇల్లీగల్ దందా ఊపందుకుంటోందని చెప్పుకుంటు న్నారు. కొందరు తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలకు బాగా కావాల్సిన వాళ్ళే దగ్గరుండి మరీ వాటిని నడిపిస్తున్నారన్న ఆరోపణలు పెరుగుతున్నాయి. రాజకీయ అండతో కొన్ని ప్రాంతాల్లో బహిరంగం గానే పేకాట శిబిరాలు నాన్ స్టాప్‌గా నడుస్తున్నాయన్నది లోకల్ టాక్. జూదానికి బానిసలైన వాళ్ళు ఇందులో పడి ఇల్లు ఒళ్లు గుల్ల చేసుకుంటుంటే? ఈ అక్రమాలకు అండగా ఉన్నవాళ్ళు మాత్రం కోట్లు గడిస్తున్నారన్న మాటలు గట్టిగానే వినిపిస్తున్నాయి జిల్లాలో. కొన్ని నియోజకవర్గాల్లో పేకాట శిబిరాలు విచ్చలవిడిగా నడుస్తున్నాయని, అధికార పార్టీకి చెందిన కొద్దిమంది కీలక నేతలు, ప్రజాప్రతినిధుల ముఖ్య అనుచరులే వాటిని నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అలాంటి నియోజకవర్గాలు ప్రస్తుతం పేకాట రాయుళ్లకు సేఫ్ జోన్‌గా మారిపోయాయని అంటున్నారు. స్థానికంగా ఉండే రాజకీయ అండ కారణంగా? పోలీసులు కూడా చూసీచూడనట్టు వదిలేస్తున్నారని, ఒకవేళ రైడ్ అయినా?. ముందస్తు సమాచారం లీకై తప్పించుకోవచ్చన్న నమ్మకంతో ఇతర జిల్లాల నుంచి కూడా పెద్ద ఎత్తున పేకాట ఆడేవారు ఇక్కడికి తరలివస్తున్నారట. కొన్ని శిబిరాల్లో రోజూ లక్షల రూపాయల లావాదేవీలు జరుగుతున్నట్టు తెలుస్తోంది. శిబిరం స్థాయిని బట్టి నిర్వాహకులకు కూడా రోజుకు పది వేల రూపాయల దాకా ఆదాయం వస్తున్నట్టు చెప్పుకుంటున్నారు. శిబిరం పెద్దదైతే?. ఈ మొత్తం మరింత పెరుగుతోందట. ఇక్కడే పోలీసుల పాత్ర మీద కూడా అనుమానాలు పెరుగుతున్నాయి. అసలేమీ పట్టించుకోవడం లేదని ఎవరైనా వేలెత్తి చూపకుండా పోలీసులు కర్ర విరక్కుండా, పాము చావకుండా అన్నట్టు వ్యవహరిస్తున్నారట. అప్పుడప్పుడు పేకాట శిబిరాలపై దాడులు నిర్వహిస్తూ? నామ మాత్రపు కేసులు బుక్ చేస్తున్నారన్న మాటలు వినిపిస్తున్నాయి. ముందస్తు లీక్‌లతో పోలీసులు వెళ్ళే టైంకి ముఖ్యమైన వాళ్ళు ఎవ్వరూ ఉండరట. పని జరిగినట్టు కనిపిస్తుంది, అలాగని ఎవ్వరూ ఇరుక్కోరు. ఆ తూతూ మంత్రపు దాడులు కూడా చిన్న చిన్న శిబిరాల మీదేగానీ? పెద్దవాళ్ళ జోలికి అస్సలు పోరన్న విమర్శలున్నాయి. శిబిరాల వెనుక ఉన్న కీలక వ్యక్తులపై చర్యల గురించి మాత్రం లోకల్ పోలీసులు అస్సలు ఆలోచించబోరని కూడా అంటున్నారు కొందరు. పైగా?. కొన్ని ప్రాంతాల్లో పోలీస్ స్టేషన్లకు నెలవారీ మామూళ్లు అందుతున్నాయన్న ఆరోపణలు సైతం ఉన్నాయి. ఇలాంటి రకరకాల కారణాలతో పెద్ద నాయకుల అనుచరులు నిర్వహించే శిబిరాల జోలికి పోలీసులు వెళ్లరన్న వాదనలు వినిపిస్తున్నాయి. అయితే? వీటికి సంబంధించి అధికారికంగా ఎక్కడా ఏ చిన్న ఆధారం దొరక్కుండా జాగ్రత్త పడుతుంటారు. ఇటీవల రావులపాలెం ఘటనతో మళ్లీ పేకాట క్లబ్బుల వ్యవహారంపై చర్చలు మొదలయ్యాయి. రావులపాలెం మండలం దేవరపల్లి శివారులో పోలీసులు నిర్వహించిన దాడి స్థానికంగా కలకలం రేపింది. ఈ దాడిలో కొందరు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసులు పెట్టారు. అయితే ఆ స్థలం అధికార పార్టీకి చెందిన కీలక నేత అనుచరుడిదేనన్న ప్రచారం సోషల్ మీడియాలో బాగా వైరల్ అయింది. దీంతో అధికార పార్టీలోనే వర్గపోరు బయట పడిందన్న చర్చ మొదలైంది. కేవలం పేకాట ఆడేవారిపై మాత్రమే కాదు? స్థలం ఇచ్చిన వారిపైనా చర్యలు తీసుకోవాలంటూ కొందరు సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టడం ఆసక్తికరంగా మారింది. కానీ? టీడీపీలోని అంతర్గత రాజకీయాల కారణంగానే ఆ శిబిరంపై దాడి జరిగిందన్న గుసగుసలు సైతం ఉన్నాయి. పట్టుబడింది ఒక శిబిరమే? కానీ ఇంకా అలాంటివి చాలానే ఉన్నాయంటున్నారు స్థానికులు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని పలు నియోజకవర్గాల్లో పేకాట శిబిరాలు పెరిగిపోయాయన్న ఆందోళన సైతం వ్యక్తం అవుతోంది. కొత్తపేట నియోజకవర్గంలో మండలానికో శిబిరం ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అమలాపురం, ముమ్మిడివరం, రామచంద్రపురం, మండపేట, రాజమండ్రి సిటీ, రాజమండ్రి రూరల్, కొవ్వూరు, గోపాలపురం ప్రాంతాల్లో కూడా పేకాట కేంద్రాలు జోరుగా నడుస్తున్నాయన్న ప్రచారం జరుగుతోంది. అయితే? ఏ పార్టీ అధికారంలో ఉన్నా?? ఇక్కడ పేకాట శిబిరాలు స్థానిక నేతలకు ఆదాయ వనరులుగా మారుతున్నాయని చెప్పుకుంటున్నారు. కరోనా సమయంలో కూడా ఇక్కడ బ్రేక్ ఇవ్వలేదు. అప్పుడు కోనసీమలోని ఒక కీలక నేత ఇంటిలో పేకాట ఆడిన అందరికీ కరోనా సోకిన సంగతి గురించి ఇప్పటికీ చెప్పుకుంటుంటారు. పీఠం మీద పార్టీలు మారుతున్నా.. . ఇక్కడ సంస్కృతి మాత్రం మారడం లేదన్న ఆవేదన సామాన్య ప్రజల్లో కనిపిస్తోంది. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందిస్తారా..? పెద్ద స్థాయిలో నడుస్తున్న పేకాట శిబిరాలపై కఠిన చర్యలు తీసుకుంటారా?? అని ఎదురు చూస్తున్నారు స్థానికులు.

## ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే



మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 2( భారత శక్తి):దండేపల్లి మండలంలోని ధర్మారావుపేట్ గ్రామంలో పైలెట్ ప్రాజెక్టు ద్వారా 104 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ఇవ్వడం జరిగింది. అందులో భాగంగా మంగళవారం రోజున 41 మంది లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్ల సాముహిక గృహ ప్రవేశాల కార్యక్రమంలో పాల్గొని కొల్లూరి సుజాత - మల్లేష్, కొల్లూరి స్నేహ - మధుకర్ నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ ప్రతి పేదవాడికి సొంతంటి కల సాకారం చేయడమే ఈ ప్రజాపాలన ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు అన్నారు.లబ్ధిదారులు ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు -సురేఖమ్మ పుణ్య దంపతులను శాలువాలతో సన్మానించి, మాకు ఇందిరమ్మ ఇళ్ల ఇచ్చినందుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.అనంతరం గ్రామపంచాయతీ లో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని గ్రామ ప్రజలందరితో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని వాటి అన్నిటిని పరిష్కరిస్తానని చెప్పారు..ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, లక్షెట్టిపేట్ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రేమ్ చంద్, సర్పంచులు, ఉప సర్పంచ్లు, వార్డు మెంబర్లు, మండల అధ్యక్షులు, నాయకులు, మహిళా నాయకురాలు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామసభల నిర్వహణపై ముఖ్య కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జూన్ 02: జూన్ 3 నుంచి 12 వరకు నిర్వహించనున్న గ్రామసభలపై రాష్ట్ర ముఖ్య కార్యదర్శి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పాల్గొన్నారు.గ్రామసభల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు, శాఖల వారీగా చేపట్టాల్సిన చర్యలు, ప్రజల సమస్యల స్వీకరణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు పురోగతి తదితర అంశాలపై ముఖ్య కార్యదర్శి అధికారులకు మార్గనిర్దేశం చేశారు.గ్రామసభలను సమర్థవంతంగా నిర్వహించి ప్రజలకు ప్రభుత్వ సేవలు చేరువయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో గ్రామసభలను విజయవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు, జిల్లా స్థాయి వ్యవసాయ, నీటిపారుదల, ఇంధన, పంచాయతీరాజ్ & గ్రామీణాభివృద్ధి, మున్సిపల్, విపత్తు నిర్వహణ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కోనరావుపేట నుండి వేములవాడకు మంగళపల్లిని మార్చండి.

### -మండల మార్పు కోసం ఆవిర్భావ దినోత్సవం రోజున గ్రామస్తుడి నిరసన.




భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, జూన్ 2: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సమయంలో ఒక వినూత్న నిరసన చోటుచేసుకుంది. కోనరావుపేట మండలం మంగళపల్లి గ్రామానికి చెందిన ఉప్పుల జీవరత్నం అనే వ్యక్తి, తమ గ్రామాన్ని వేములవాడ మండలంలో కలపాలనే ప్రధాన డిమాండ్‌తో నిరసన వ్యక్తం చేశారు. ప్రస్తుతం మంగళపల్లి గ్రామం కోనరావుపేట మండలంలో ఉంది. అయితే, తమ గ్రామం నుండి మండల కేంద్రమైన కోనరావుపేటకు వెళ్లాలంటే సుమారు 17 నుండి 18 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తుందని, సరైన రవాణా సౌకర్యాలు లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జీవరత్నం ఆవేదన వ్యక్తం చేశారు. అదే సమయంలో, తమ గ్రామానికి సుమారు 10 కిలోమీటర్ల దూరంలోనే వేములవాడ పట్టణం అందుబాటులో ఉందని, పరిపాలనా సౌలభ్యం కోసం తమ గ్రామాన్ని వేములవాడ మండలంలో విలీనం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, తమ గ్రామాన్ని వేములవాడలో కలిపేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఆవిర్భావ దినోత్సవం రోజున ఫ్లెక్సీ పట్టుకుని ఆయన చేసిన నిరసన ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశమైంది.

## హరీశ్ రావు జన్మదినోత్సవం సందర్భంగా పాటల సీడీ ఆవిష్కరణ




సంగారెడ్డి, భారతశక్తి ప్రతినిధి, జూన్ 2:బిఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని యువ నాయకుడు వికాస్ రూపొందించిన ప్రత్యేక పాటల సీడీని మాజీ మంత్రి హరీశ్ రావు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ కలిసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ, హరీశ్ రావు నాయకత్వం తెలంగాణ రాష్ట్రానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో హరీశ్ రావు కీలక పాత్ర పోషించారని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఆయన చూపిన చొరవ, నిబద్ధత రాష్ట్ర ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని తెలిపారు.తెలంగాణ ఉద్యమం నుంచి రాష్ట్ర నిర్మాణం వరకు హరీశ్ రావు చేసిన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల కోసం నిరంతరం పనిచేసే నాయకుడిగా హరీశ్ రావు ప్రత్యేక గుర్తింపు పొందారని కొనియాడారు.

# గ్రామ సభలను విజయవంతం చేయాలి

**- జిల్లా కలెక్టర్ - తేజస్ నంద్ లాల్ పవార్**

**-ఫార్మర్ రిజిస్ట్రేషన్ పై రైతులకు అవగాహన కల్పించాలి**

**- నకిలీ విత్తనాలను అరికట్టేందుకు టాస్క్ ఫోర్స్ నిఘా పెంచాలి**




సూర్యాపేట (భారత శక్తి ప్రతినిధి) జూన్ 2: వచ్చే నాలుగు రోజుల పాటు జిల్లావ్యాప్తంగా నిర్వహించే గ్రామ సభల కోసం మండలాల వారీగా ఎంపిడిఓలు, తహసీల్దార్లు పక్కా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి గ్రామ సభలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు. జిల్లాలో నిర్వహించే గ్రామ సభలు, శానిటేషన్, తాగునీరు, సీజనల్ వ్యాధుల నివారణ, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్, కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక ఓటర్ల సవరణలపై కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ కె. నరసింహతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ఉన్న అన్ని శాఖలకు సంబంధించిన సిబ్బందితో పాటు, మండల స్థాయి అధికారులు కూడా ఖచ్చితంగా గ్రామ సభల్లో పాల్గొనేలా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతు వేదికల్లో నిర్వహించాలని, గ్రామ సభలు అధికారులందరూ హాజరు కావాలని సూచించారు. రైతులకు పూర్తి స్థాయిలో లబ్ధి చేకూర్చేందుకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియపై అధికారులు ప్రత్యేక అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులకు సులభంగా అర్థమయ్యే రీతిలో అధికారులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను వివరించాలని తెలిపారు. సోషల్ మీడియా వేదికల ద్వారా ఈ ప్రక్రియపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 72శాతం ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసి, రాష్ట్రంలోనే సూర్యాపేట జిల్లాను 3వ స్థానంలో నిలిపినందుకు వ్యవసాయ శాఖ అధికారులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. అదే విధంగా జిల్లాలో యూరియా విక్రయాలు ఎక్కువగా ఉండటంపై కలెక్టర్ ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు యూరియాను ఎందుకు అంత ఎక్కువగా వినియోగిస్తున్నారనే అంశంపై వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, ఆలోచన చేయాలన్నారు. అలాగే, వానాకాలం సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టేందుకు టాస్క్ ఫోర్స్ బృందాలు గట్టి నిఘా పెట్టాలని స్పష్టం చేశారు. అదే విధంగా రానున్న వర్షాకాలం పై యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. ఒకవేళ వర్షపాతం తక్కువగా నమోదైతే ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ యాక్షన్ ప్లాన్ కూడా సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈ సంవత్సరం నిర్వహించబోయే వన మహోత్సవం కార్యక్రమం కోసం అటవీ శాఖ, డీఆర్డీఏ, పంచాయతీ రాజ్, మున్సిపల్ శాఖలు పరస్పరం సమన్వయం చేసుకుంటూ తక్షణమే యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్‌కు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. పట్టణాలు, గ్రామాల్లో డ్రైనేజీల క్లీనింగ్, పారిశుధ్యాన్ని పర్యవేక్షించాలి. వారం రోజుల్లోగా సమగ్ర డిజాస్టర్ మేనేజ్మెంట్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. వర్షాకాలంలో కలుషిత నీటి సమస్య రాకుండా, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాల న్నారు. ప్రజాపాలన కార్యక్రమాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లులను అధికారులు సబ్మిట్ చేస్తే వెంటనే మంజూరు చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. అలాగే, కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ) పై అధికారులందరికీ పూర్తి అవగాహన ఉండాలని, ఇందుకోసం సిబ్బందికి తక్షణమే ఒకరోజు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు.జిల్లా ప్రగతిలో అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేసి, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ హెచ్చరించారు.

### - గ్రామ సభల విజయవంతానికి పోలీస్ శాఖ పూర్తి సహకారం: జిల్లా ఎస్పీ కె. నరసింహ

జిల్లాలో నిర్వహించబోయే గ్రామ సభలు, వార్డు సభలను ప్రశాంత వాతావరణంలో విజయవంతం చేసేందుకు పోలీస్ శాఖ అన్ని విధాలా సిద్ధంగా ఉందని జిల్లా ఎస్పీ కె. నరసింహ తెలిపారు. రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో పోలీస్ శాఖ నిరంతరం సమన్వయం చేసుకుంటూ పనిచేస్తుందని స్పష్టం చేశారు.

జిల్లావ్యాప్తంగా గ్రామ సభలు నిర్వహించే అన్ని ప్రాంతాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ సభల పర్యవేక్షణ, బందోబస్తు నిర్వహణ కోసం ప్రత్యేకంగా ఒక పోలీస్ అధికారిని (స్పెషల్ ఆఫీసర్) నియమిస్తున్నట్లు చెప్పారు. అలాగే, మున్సిపాలిటీలలో నిర్వహించే వార్డు స్థాయి సభలలో కూడా పోలీస్ సిబ్బంది ఖచ్చితంగా పాల్గొనేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. గ్రామ సభలను వేదికగా చేసుకుని శాంతిభద్రతలతో పాటు పలు కీలక సామాజిక అంశాలపై ప్రజలకు పోలీస్ శాఖ తరపున అవగాహన కల్పించనున్నట్లు ఎస్పీ వివరించారు. ముఖ్యంగా స్త్రీ, శిశు సంరక్షణ, మహిళలు, బాలల భద్రత, చట్టాలపై అవగాహన, యాంటీ డ్రగ్స్, అలైవ్ అరైవ్ నివారణపై అవగాహన కల్పిస్తామన్నారు.

### రైతులను ముంచే నకిలీ విత్తన విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

జూన్ 12వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో, విద్యార్థులను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు పోలీస్ శాఖ ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేస్తోందని ఎస్పీ నరసింహ తెలిపారు. పాఠశాలలు తెరిచిన మొదటి రోజు నుంచే విద్యార్థులకు, యువతకు యాంటీ డ్రగ్స్ పై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించేలా పక్కా కార్యాచరణను రూపొందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.సమావేశంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డిఆర్డిఓ సన్యాసయ్య, జెడ్పీ సీఈవో శిరీష, డిఎఫ్ఓ దామోదర్ రెడ్డి, డిపిఓ యాదగిరి, డిఏఓ శ్రీధర్ రెడ్డి, సిపిఓ కిషన్, జిల్లా ఫైర్ అధికారి కృష్ణారెడ్డి, ఇతర జిల్లా అధికారులు, మున్సిపల్ కమీషనర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ, వార్డు సభలు సమర్థవంతంగా నిర్వహించాలి






మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 2 (భారత శక్తి): ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 4, 6, 8, 10 తేదీలలో రాష్ట్రంలోని అన్ని గ్రామపంచాయతీలలో గ్రామసభలు, మున్సిపల్ కార్పొరేషన్లు/ మున్సిపాలిటీలలో డివిజన్/వార్డు సభలు సమర్థవంతంగా నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర డిజిపి సివి ఆనంద్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు, సంబంధిత శాఖల అధికారులతో సభల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 4, 6, 8, 10 తేదీలలో గ్రామపంచాయతీలలో, మున్సిపల్ కార్పొరేషన్/మున్సిపాలిటీలలో డివిజన్/వార్డులలో నిర్వహించనున్న సభలకు సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని తెలిపారు. సభలలో కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ కార్యక్రమం ఉద్దేశాన్ని వివరించాలని, పర్యావరణ పరిరక్షణపై చర్చించాలని, యాసంగి వరి ధాన్యం కొనుగోలు, నిల్వ, రవాణా ప్రక్రియలు వేగవంతం చేయాలని తెలిపారు. వచ్చే ఖరీఫ్ సీజన్ లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విత్తనాలు, ఎరువులు అందించేందుకు ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. సభలలో మహిళల రక్షణ, మాదకద్రవ్యాల నివారణ, రహదారి భద్రతపై వివరించాలని తెలిపారు. వచ్చే వర్షాకాలంలో గ్రామాలలో పారిశుధ్యం, మురుగు కాలువల శుభ్రత, ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు, భారీ వర్షాల వల్ల లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి తరలించాలని తెలిపారు. వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలను సిద్ధం చేసుకోవాలని, రాష్ట్ర, కేంద్ర ప్రకృతి విపత్తుల ప్రతిస్పందన బృందాలను, రెస్క్యూ బృందాలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలోని గ్రామపంచాయతీలు, 1 మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలలో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం సభలు నిర్వహణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వచ్చే ఖరీఫ్ సీజన్ కు రైతులకు సరిపడా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా వ్యవసాయ శాఖ అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని, గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలలో ప్రతి రోజు పారిశుద్ధ్య పనుల నిర్వహణపై పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. 4 రోజుల పాటు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం గ్రామసభలు, డివిజన్/వార్డు సభలు అధికారుల సమన్వయంతో నిర్వహించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గణపతి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, మున్సిపల్ కమిషనర్లు, విద్యుత్, ముఖ్య ప్రణాళిక శాఖల అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న సీఎం రేవంత్ రెడ్డి

**- తెలంగాణ రాష్ట్ర దివ్యాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 2 ( భారత శక్తి): తెలంగాణ వికలాంగుల కార్పొరేషన్ నుండి మంచిర్యాల జిల్లా లో వికలాంగుల కి ట్రై మోటారైజడ్ స్కూటీలు, బ్యాటరీ వీల్ చైర్లు, బ్యాటరీ ట్రై సైకిళ్ళు, లాప్టాప్ లు, 5G స్మార్ట్ ఫోన్లు, బిజినెస్ ఎంపవర్ కార్ట్స్ ఇతర ఉపకారణాలు ను ప్రభుత్వం సలహా దారులు హార్కర వేణుగోపాల్, ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావ్, కనీస వేతనాల కార్పొరేషన్ చైర్మన్ జనక్ ప్రసాద్,కలెక్టర్ కుమార్ దీపక్ తో కలసి తెలంగాణ వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య జిల్లా సంక్షేమ శాఖ అధికారి రావుఫ్ ఖాన్ అధ్యక్షతన పంచడం జరిగింది.తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా దివ్యాంగుల పెద్దన్న, వికలాంగుల సంక్షేమ అభివృద్ధి ప్రధాత రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టిందని రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన వేడుకలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగుల సహకార సంస్థ చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్, శాఖ అధికారుల సహకారంతోలి దివ్యాంగుల సంక్షేమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా కోర్టు ఉద్యోగాలు లో 4 శాతం రిజర్వేషన్, ఉన్నత విద్యలో 5 శాతం రిజర్వేషన్, నిరుద్యోగులు కోసం Job portal ఏర్పాటు చేసి వందల మంది దివ్యాంగులకు ఉద్యోగ అవకాశాలు,దివ్యాంగులు దివ్యాంగులను పెండ్లి చేసుకుంటే కల్యాణ లక్ష్మి తో పాటు అదనంగా 2 లక్షలు రూపాయల ప్రోత్సాహకం, దివ్యాంగుల స్వయం సహాయక సంఘాలను పున ప్రారంభించి మంగళవారం రోజున 11 వేల దివ్యాంగుల సంఘాలు ఏర్పడటానికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దివ్యాంగులను ప్రోత్సహించి దాదాపు 80 వేల మంది పొదుపు చేసుకునేలా ఆర్థికంగా ఎదిగే దిశగా నడిపించడం దివ్యాంగుల కార్పొరేషన్ లో పనిచేసే దివ్యాంగ ఉద్యోగులకి 2010 PRC, 2015 PRC, 2020 PRC అమలు చేయడం ,దేశంలో ఎక్కడా లేని విధంగా దివ్యాంగులకు 40 శాతం వైకల్యానికి ట్రై మోటారైజడ్ స్కూటీలతో పాటు బ్యాటరీ ట్రై సైకిళ్ళు, ఇన్నోవేటివ్ బ్యాటరీవీల్ చైర్లు,బ్యాటరీ వీల్ చైర్లు, బిసినెస్ ఏంపవర్ కార్ట్స్, బిసినెస్ ఆటోస్ , అంద విద్యార్థుల కొరకు హై ఎండ్, లో ఎండ్ ల్యాప్ టాప్ లు, ట్యాబ్ లు, ఉన్నత విద్య అభ్యసిస్తున్న శారీరక దివ్యాంగులకు అమలు చేయడం, బధిరుల కోసం 5G స్మార్ట్ ఫోన్లు, వినికిడి యంత్రాలు, చేతి కర్రలు, సంక కర్రల పంపిణీ కొరకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.రాష్ట్రంలోని దివ్యాంగుల సంక్షేమం దిశగా రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర మంత్రివర్గం, అధికార యంత్రాంగం, స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో అనేక పథకాలు అమలు చేస్తూ దివ్యాంగుల అభివృద్ధికి కృషి చేస్తుందని తెలిపారు.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy